www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 16-3-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 331

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.40 తదుపరి అష్టమి; నక్షత్రం: రోహిణి సా. 4.06 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.8.07-9.42, రా.9.51-11.30; దుర్ముహూర్తం: ఉ.6.26-8.02; అమృతఘడియలు: మ.12.54-2.30; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.22

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


Sleep Cooler.
Sleep Better.™
Q-GEL™ MATTRESS
Powered by
CuSense™ Technology
Centuary® MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
CuSense™ Technology
Centrik Pro Responsive Cushioning
Ergo-form Transition Foam
Euro top
ANTI SLIP
Grip+ Fabric
CertiPUR-US
Certification of Quality
NEW LAUNCH OFFER
FREE
Antimicrobial Bedsheet
CuSense™ Pillow Set
10% off
*T&C Apply
A.S RAO NAGAR: SRI ANU FURNITURE 9533873033 | ABIDS: ANKIT STUDIO 9885019825 | AMEERPET: GEETA ENTERPRISES 8801179234 | SRI AAVISHKAR 9948214520 HUNDHA FURNISHING 9491618313 | AS RAO NAGAR: VEDA BOMBAY DYEING 9440072324 | ASIF NAGAR: DHARANI FURNITURE 8885488103 | NOVA FOAMS 9346660381 | ATTAPUR: SRI ANU FURNITURE 7702883033 | SRI ANU FURNITURE 9032243033 | POONAM ENTERPRIZZ 9949423263 | FURNITURE TRENDZ 9394325114 | BACHUPALLY: CHITRA DECORS 7337511756 | BADANGPET: SRI LAKSHMI NARASIMHA ENTERPRISES 9908140627 | BALANAGAR: ADESH GARMENTS 9849031510 | BANDLAGUDA SUNCITY: SAI FURNITURE 9966996818 | BANJARAHILLS: ISHAANA INTERIORS 9026566666 | BN REDDY NAGAR: NEW SRI SAI ENTERPRISES 9391016483 | BODUPPAL: SAI DIVYA ENTERPRISES 9246929270 | CHAMPAPET: AAKASH FURNITURE 9515718643 | CHANDANAGAR: SRI ANU FURNITURE 8978033033 | CELEBRATIONS 9440256755 | CHIKKADPALLY: INDUS FASHIONS 9866700761 |CHINTAL: R S MODERN FURNITURE 9849379465 | DILSUKHNAGAR: HEAVEN 9989646643 | GOWLIGUDA: AGARWAL FOAM &FURNISHING 8977900074 | HABSIGUDA RISHABH 9849050636 | HASTHINAPURAM: RAM FURNITURE 9912599563 | HAYATHANAGAR: JAYALAXMI FURNITURE 9948134307 | HITECH CITY: INDUS HITECH 7093321061 | J.P NAGAR MIYAPUR: BALAJI FURNITURE 9866916940 | JUBLIHILLS CHECKPOST: JAYADURGA FURNISHINGS 9246359346 | KARMANGHAT: SRI GURU DATTA FOAMS 9390505425 | VINAYAKA FURNITURE 9849876231 | KATEDAN: SRI VENKATESHWARA FURNITURE 7093992282 | KHARKHANA: SHREE MATTRESS 8801179234 | KOMPALLY: SRI ANU FURNITURE 7075573033 | SHOBHA DECORS 9100311151 | KOTHAPET: INDUS EAST 8374140840 | KPHB: SOWMYA FURNITURE 9848038795 | SAI DARPAN INTERIO 9849212884 | KUKATPALLY: SRI ANU FURNITURE 7993343033 | DEVAGURU FURNITURE 9394795213 | L.B NAGAR: SRI ANU FURNITURE 8688169666 | SRI ANU FURNITURE 9704932156 | JAGNIS HOME & FURNITURE 9246736533 | LIBERTY: KLASSIK DEKORS 7013359757 | MALKAJGIRI ROSHINI 9246107771 | MALLAMPET: AISHWARYA B HUB & INTERIOR 9985603577 | MANIKONDA: MAIRA FURNISHING 8374413469 | R.R HAPPY HOMES 9100600326 | MANNEGUDA: SHUBHAM FURNITURE 9346393808 | MEDIPALLY: SRI ANU FURNITURE 9392743033 | ADVITH ENTERPRISES 9848787876 | MEHDIPATNAM: THE EXCELLENT 9676546199 | MIYAPUR: COMPANY OWNED OUTLET 9700124406 | SRI ANU FURNITURE 9348423033 | MS FURNITURE DOORS 8328579276 | PARTH 8179780303 | MOOSARAMBAGH: K.K. DECORS INTERIORS & FURNITURES 7386371111 | NACHARAM: SRI ANU FURNITURE – 9014553033 | NAGARAM: SRI ANU FURNITURE 7075783033 | NAGOLE: NAKSHTRA FURNITURE 9293146264 | NALLAGANDLA: INDUS NALLANGANDLA 7285994994 | NALLAKUNTA: HEERA 9848486466 | NAMPALLY: BATCHA'S SLEEP ZONE 9866645792 | NARSING: ISHAANA INTERIORS 9026566666 | NARYANGUDA: GEETA ENTERPRISES 9866540400 | NEXUS MALL: INDUS NEXUS MALL 8499961013 | NIZAMPET: SRI LAKSHMI FURNITURE&INTERIOR 9949470662 | PRAGATHI NAGAR: MR FURNITURE 9985331787 | RAMANTAPUR: INDUS DSL 9963768855 | S.D ROAD: INDUS FABRICS 7093321060 | SAINKPURI: GEETA ENTERPRISES 9866540400 | SARATH CITY CAPITAL MALL: INDUS RETAIL 8179110840 | SHAPURNAGAR: SRI KRISHNA ENTERPRISES 9949628428 | SRI NAGAR COLONY: MANOMAY 9848848702 | SUCHITRA: NEW MS FURNITURE 8121583343 | ENLIVEN FURNITURE 9642437788 | SUNCITY: SRI SAI DATTA FURNITURES 9966996818 | THRIMULGHERRY: VR ENTERPRISES 9866317399 | THURKAYAMZAL: K.B. FURNITURE WORLD 9848375496 | KEERTHANA FURNITURE 9963333435 | TOLICHOWKI: SV HOME DECORS 9848050582 | FUSION DECORS 9985957401 | TUKKUGUDA: SR FURNITURES 9848455596 | VAIDEHINAGAR: SAI SHUBHAM FURITURE 9966747423 | VANASTLIPURAM: COLOR TRENDZ 9030425399 | YAPRAL: SAINATH ENTERPRISES 9849307008 | SADASHIVPET: SRI SAI HOME NEEDS 9490675124 |SIDDEPET: THIRUMAL STEEL & FURNITURE 9885533343 |VIKARABAD: SANGAMESHWARA HOME NEEDS – 9581158599.
CENTUARY EXPERIENCE STORE: MIYAPUR: 9700124406
FOR TRADE & BULK ENQUIRY: 6305105461 | 9705606321

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రక్తంతో మునిగిన వైసీపీ పునాదులు

న్యాయంకోసం నిలబడిన ఆడబిడ్డ ఒకవైపు..
హంతకులను రక్షిస్తున్న ప్రభుత్వం మరో వైపు
జనం ఎటువైపో తేల్చుకోవాల్సిన తరుణం ఇదే
మేమే చంపించామని 'సాక్షి'లో తప్పుడు రాతలు
చనిపోయే దాకా జగన్ కోసమే వివేక పనిచేశారు
వివేకానందరెడ్డి వర్ధంతి సభలో సునీత వ్యాఖ్యలు

3

సొంత అన్నయ్యే.. హంతకులను
కాపాడుతున్నాడు
'సాక్షి'లో వివేకా వ్యక్తిత్వ హననానికి యత్నం
మీరు మనుషులేనా? మనస్సాక్షి లేదా మీకు?
న్యాయం, నిజం వైపు ఏపీ ప్రజలు నిలబడాలి
సునీత పోరాటంలో ఆయుధం అవుతా:షర్మిల

శనివారం | 16-3-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 331

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.40 తదుపరి అష్టమి; నక్షత్రం: రోహిణి సా. 4.06 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.8.07-9.42, రా.9.51-11.30; దుర్ముహూర్తం: ఉ.6.26-8.02; అమృతఘడియలు: మ.12.54-2.30; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.22

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కవిత అరెస్ట్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ చేసిన ఈడీ.. ఢిల్లీకి తరలింపు

అనూహ్యంగా కవిత ఇంటికి ఈడీ అధికారులు
కవితతోపాటు సిబ్బంది ఫోన్ల స్వాధీనం
లోపలికెవరూ రాకుండా కేంద్ర బలగాల పహారా
మధ్యాహ్నం 1.30 నుంచి తనిఖీలు, విచారణ..
సాయంత్రం 5.20 గంటలకు అరెస్ట్
అరెస్టుకు కారణాలతో 14 పేజీల సమాచారం
అరెస్ట్ సమయంలో కవిత ఇంట్లో
కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు
శ్రేణుల నిరసన.. మోదీ వ్యతిరేక నినాదాలు
కవితను తరలిస్తున్న వాహనం అడ్డగింత
ట్రాన్సిట్ వారెంట్ లేకుండా
ఎలా అరెస్ట్ చేస్తారంటూ కేటీఆర్ ప్రశ్న
సుప్రీంకోర్టు నుంచి ఇబ్బందులు
ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక
బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ
హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన కేటీఆర్
నేడు సుప్రీంకోర్టులో పిటిషన్: న్యాయవాది
నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు


ఈడీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఇంటి నుంచి బయటకు వస్తున్న కవిత

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. శుక్రవారం అనూహ్య పరిణామాల మధ్య ఆమెను అరెస్టు చేసి ఢిల్లీకి తరలించారు. లిక్కర్ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కోణంలో పీఎంఎల్ఏ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఊహించని విధంగా శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన ఈడీ బృందం సుమారు నాలుగు గంటలపాటు కవిత నివాసంలో సోదాలు నిర్వహించిన అనంతరం ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించింది. లిక్కర్ స్కాం కేసులో తనపై ఎటువంటి చర్యలు చేపట్టవద్దంటూ కవిత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ఉన్నందున.. ఆమెను అరెస్టు చేసే అవకాశం ఉండదని, ఈడీ బృందం సోదాలు

మిగతా 13వ పేజీలో...

సరిగ్గా ఏడాదికి..

నిరుడు మార్చిలో ఈడీ విచారణ 13
ఆ తర్వాత పలు మార్లు నోటీసులు
హాజరు కాని కవిత.. సుప్రీంలో పిటిషన్
ఏడాదిగా కొనసాగుతున్న విచారణ

కవిత కేసు 19కి వాయిదా

డ్రామాలో భాగమే అరెస్టు
మంత్రి కోమటిరెడ్డి విమర్శ 11

బీజేపీ, కాంగ్రెస్‌ల కుమ్మక్కుతోనే.. 11
అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం..
ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే..: హరీశ్
కవిత నిర్దోషిగా తిరిగి వస్తారు: జగదీశ్

కారుతో దోస్తీ లేదని చాటుకోవడానికే!
బీఆర్ఎస్‌తో పొత్తు ఉందన్న ప్రచారంతో బీజేపీకి తీవ్ర నష్టం
అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించిన ప్రభావం
కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టలేని నిస్సహాయతలో బీజేపీ రాష్ట్ర నేతలు
లోక్‌సభ ఎన్నికలకూ అదే సమస్య
అధిష్ఠానానికి తెలిపిన శ్రేణులు 13
ఈ నేపథ్యంలోనే కవిత అరెస్టు?

ఎన్నికలకూ అరెస్టుకు సంబంధం లేదు: అమిత్ షా


ఇఫ్తార్ విందులో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

4% రిజర్వేషన్లను తొలగించడం..
మోదీ, షా వల్ల కాదు

అర్హులైన ముస్లింల ఇంటి వద్దకే రుణాలు, పథకాలు
ఎక్కడ అవకాశం ఉన్నా వారి వాటా వారికి ఇస్తాం
ప్రభుత్వ ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
తెల్లవారుజాము దాకా హోటల్స్, దుకాణాలకు అనుమతి

హైదరాబాద్, బర్కత్‌పుర/రవీంద్రభారతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ముస్లింలకు ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లను తొలగిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంటున్నారు. దీనిపై ఆయనకు స్పష్టంగా చెప్పదలచుకున్నా.. తెలంగాణ కాంగ్రెస్ అడ్డా. ఇక్కడ రిజర్వేషన్లను తొలగించడం అమిత్ షాతోనే కాదు.. ప్రధాని మోదీ వల్ల కూడా కాదు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కల్పించిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో

మిగతా 12వ పేజీలో...

ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక
అటవీ, పర్యాటక శాఖలు కలిసి పని చేయాలి.. సమీక్షలో సీఎం రేవంత్

కుల గణనకు ఉత్తర్వులు
రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యారంగాల వారీగా సర్వే
రాజకీయంగా ఏ కులానికి ఎన్ని పదవులనే దానిపైనా..
త్వరలో సమగ్ర విధివిధానాలు
12

నేడే ఎన్నికల భేరి

మధ్యాహ్నం 3 గంటలకు లోక్‌సభ షెడ్యూల్
ఆంధ్ర, ఒడిసా, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకూ..
4-5 దశల్లో పార్లమెంటు పోలింగ్?
ఏపీ, అరుణాచల్, సిక్కింలకు ఒకేసారి
ఒడిసాకు 4 విడతల్లో జరిగే అవకాశం
దేశవ్యాప్తంగా ఈసీ పర్యటనలు
ఎన్నికల సన్నద్ధతపై కసరత్తు, సమీక్ష
షెడ్యూల్ ప్రకటించగానే కోడ్ అమల్లోకి
కొత్త కమిషనర్ల నియామకంపై స్టేకు సుప్రీం నో

తెలుగు రాష్ట్రాల్లో వచ్చే నెలాఖరులో పోలింగ్!



న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం తొలిఘట్టం శనివారం మొదలవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కొత్త కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సంధూలతో కూడిన పూర్తిస్థాయి ఎన్నికల కమిషన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఆ సందర్భంగా ఎన్నికల

మిగతా 2వ పేజీలో...


రోడ్ షోలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల. చిత్రంలో కిషన్‌రెడ్డి

మల్కాజిగిరిలో మోదీ రోడ్ షో

పోటెత్తిన బీజేపీ కార్యకర్తల సందోహం
అభివాదం చేస్తూ ముందుకు సాగిన ప్రధాని
1.3 కిలోమీటర్ల పొడవునా పూల వర్షం
మోదీ నినాదాలతో దద్దరిల్లిన పరిసరాలు
ప్రసంగం లేకుండానే ముగిసిన కార్యక్రమం
తెలంగాణలో లోక్‌సభ ప్రచారం షురూ
నేడు నాగర్‌కర్నూల్‌లో ప్రధాని సభ

హైదరాబాద్ సిటీ/మౌలాలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో బీజేపీ అత్యధికంగా ఆశలు పెట్టుకున్న తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దేశంలోకెల్లా అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో పార్టీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహించారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్‌రోడ్డు వరకు 1.3 కిలోమీటర్ల మేర అట్టహాసంగా సాగిన ఈ రోడ్ షోలో అడుగడుగునా పూల వాన కురిపిస్తూ బీజేపీ శ్రేణులు, అభిమానులు ప్రధానికి ఘన స్వాగతం

మిగతా 11వ పేజీలో...

కంటి నిండా కునుకుండట్లే..!!

దేశంలో పెరుగుతున్న నిద్రలేమి సమస్య
తగినంత నిద్రపోయేది 27% మంది
పని ఒత్తిడే నిద్రలేమికి ప్రధాన కారణం
రెస్‌మెడ్ స్లీప్ సర్వేలో వెల్లడి 2






రేవంత్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీ పసునూరి

కాంగ్రెస్‌లోకి దానం!
వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కూడా..
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇరువురి భేటీ
18న పార్టీలో చేరే అవకాశం 12

రేవంత్ పాలనపై ప్రజల్లో సంతృప్తి
బీఆర్ఎస్‌లో సంస్థాగత నిర్మాణ లోపం
శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి జితేందర్ రెడ్డి
బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
ప్రభుత్వ సలహాదారు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకం

బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్
బీఆర్ఎస్-బీఎస్పీ మధ్య పొత్తుపై స్పష్టత

నంబర్లను వెల్లడించలేదేం?

ఎలక్టోరల్ బాండ్ల పూర్తి వివరాల్ని ఎందుకు తెలియజేయలేదు?
బాండ్ తేదీ, విలువ, కొనుగోలుదారు వివరాలతోపాటు నంబరూ చెప్పాలి
ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు
18వ తేదీకి విచారణ వాయిదా
కోర్టుకు ఈసీ సమర్పించిన పత్రాలను వెనక్కి ఇవ్వాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం



న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల తాలూకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించినా కూడా వాటిని ఎందుకు సమర్పించలేదని ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాండ్లను కొన్న తేదీ, బాండ్ విలువ, కొన్న వారెవరు వంటి మొత్తం వివరాలను వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన యూనిక్ ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను తెలియజేయాలని పేర్కొంది. యూనిక్ ఆల్ఫా న్యూమరిక్ నంబర్ల ద్వారా బాండ్ల రూపంలో ఏ పార్టీకి ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది తెలుస్తుంది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ ఎన్నికల సంఘానికి (ఈసీకి) అందించాలని, వాటిని ఈసీ తమ వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలని ఈ నెల 11వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. అదే తీర్పులో.. రాజకీయ పార్టీలకు లభించిన విరాళాలకు సంబంధించి

మిగతా 2వ పేజీలో...

ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీ
బాండ్ల సొమ్ముతో పార్టీలను చీల్చారు
ప్రభుత్వాలను కూల్చారు: రాహుల్
బాండ్లతో బీజేపీ 'క్విడ్ ప్రోకో': ఖర్గే

మార్టిన్ మోసగాడు.. జాగ్రత్త
2019 సెప్టెంబరులో కేంద్రం హెచ్చరిక
అత్యధికంగా రూ.1,368 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ కొన్నది ఇతడే

భారీ విరాళాలిచ్చింది వీళ్లే
గనులు, విద్యుత్, ఇన్‌ఫ్రా సంస్థలే టాప్
విరివిగా నిధులిచ్చిన హైదరాబాద్ మౌలిక, ఫార్మారంగ కంపెనీలు
రాజధాని 'రియల్' కంపెనీల నుంచీ..

విరాళాలకు, ఈడీ దాడులకు సంబంధమే లేదు: నిర్మల 2

నంబర్లను వెల్లడించలేదేం?



(మొదటి పేజీ తరువాయి)

గతంలో కోర్టుకు సమర్పించిన వివరాలను ఈసీ భద్రపరచాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు గురువారం తమ వెబ్‌సైట్‌లో బాండ్ల వివరాలను అప్‌లోడ్ చేసిన ఈసీ.. విరాళాల తాలూకు పత్రాలు కోర్టు వద్దే ఉన్నాయని, వాటిని తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఈ మేరకు ఇటీవలి తీర్పు అమలుకు సంబంధించి స్వల్ప సవరణలు కోరుతూ దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీ వై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ ఎస్బీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎస్బీఐ తరఫున ఎవరు వాదనలు వినిపిస్తున్నారు? ఇంతకుముందు మేం ఇచ్చిన తీర్పులో.. బాండ్లను కొన్న వారెవరు? బాండ్ విలువ ఎంత? ఏ రోజున కొన్నారు? వంటి అన్ని వివరాలను వెల్లడించాలని స్పష్టంగా పేర్కొన్నాం. కానీ, ఆ వివరాలేమీ తెలియజేయలేదు. బాండ్ల నెంబర్లను కూడా వెల్లడించలేదు' అని పేర్కొన్నారు. ఈ వివరాలన్నింటినీ తెలియజేయాల్సిందేనని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయపార్టీలకు విరాళాలకు సంబంధించిన వివరాల సీల్డ్ కవర్లను సుప్రీంకోర్టుకు గతంలో సమర్పించామని, వాటి తాలూకు మరొక కాపీ తమ వద్ద లేదని తెలిపారు. ఈ పత్రాలను భద్రపర్చాలని సుప్రీంకోర్టు మార్చి 11 నాటి తీర్పులో తమను ఆదేశించినందున, ఆ సీల్డ్ కవర్ పత్రాలను తమకు తిరిగి అప్పగించాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సదరు పత్రాల కాపీలు ఈసీ వద్ద ఉన్నాయని భావించి, వాటిని భద్రపరచమని ఆదేశించామని పేర్కొంది. ఆ పత్రాలను స్కాన్ చేసి డిజిటైజ్ చేయాలని, అనంతరం ఒరిజినల్ పత్రాలతోపాటు ఒక డిజిటల్ ఫైల్ కాపీని కూడా ఈసీకి అందజేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ పని శనివారం సాయంత్రం ఐదు గంటల లోపు జరగాలని, అదే రోజుగానీ మరుసటి రోజుగానీ ఆ పత్రాలను కూడా ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాను కేంద్రం తరఫున మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నానని, ఎస్బీఐ తరఫున కాదని ధర్మాసనానికి విన్నవించగా.. విచారణ జరుగుతున్న సమయంలో వారు (ఎస్బీఐ తరఫు న్యాయవాదులు) కూడా ఇక్కడ ఉండాలి అని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఎస్బీఐకి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

నేపథ్యం ఇదీ..

రాజకీయపార్టీలు తమకు అందే విరాళాల గురించి పూర్తి వివరాలను ఈసీకి సీల్డ్ కవర్‌లో అందజేయాలని సుప్రీంకోర్టు 2019 ఏప్రిల్ 12న మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. గత ఏడాది నవంబరు 2వ తేదీన కూడా ఇదే కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు.. ఈసీ సీల్డ్ కవర్లు, సీల్డ్ బాక్సులను సుప్రీంకోర్టుకు గతంలో అందజేసింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.3	17.7
నల్లగొండ	37.0	24.4
నిజామాబాద్	37.0	22.4
వరంగల్	36.0	23.5
ఖమ్మం	36.0	24.0
సంగారెడ్డి	36.0	26.0
హైదరాబాద్	35.8	24.1

విరాళాలకు, ఈడీ దాడులకు
సంబంధమే లేదు
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 15: అధికార పార్టీకి అందే ఎన్నికల విరాళాలకు, కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే దాడులకూ ఎలాంటి సంబంధం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు కేవలం ఊహాగానాలేనని చెప్పారు. "ఈడీ వెళ్లి కంపెనీలపై దాడులు చేస్తే, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయనుకోవడం పూర్తిగా ఊహాగానమే. ఎన్నికల బాండ్లు కొన్న తర్వాత కూడా ఈడీ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి కదా! మరి దాన్నేమంటారు?" అని ఆమె ప్రశ్నించారు. ఇక ఎలక్టోరల్ బాండ్లన్నీ అధికార బీజేపీకే వచ్చాయని చాలా మంది ప్రచారం చేస్తున్నారని.. అది కూడా తప్పని చెప్పారు. కంపెనీలు ప్రాంతీయ పార్టీలకు కూడా విరాళాలు ఇస్తాయని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. గతంలో కంటే ఇది మెరుగైన విధానమేనని పేర్కొన్నారు. గత వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయి కదా? అని నిర్మల ప్రశ్నించారు. గతంలో కంటే మెరుగైనదిగా భావించే మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు.

ఎలక్టోరల్ బాండ్లతో
బీజేపీ 'క్విడ్ ప్రో కో'
స్వతంత్ర భారత్‌లో అతిపెద్ద కుంభకోణం

» బీజేపీ అవినీతి వ్యూహాలు బహిర్గతం: కాంగ్రెస్

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 15: ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బీజేపీ అనుసరిస్తున్న అవినీతి వ్యూహాలను బహిర్గతం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. స్వతంత్ర భారతదేశంలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అప్పటివరకు కాషాయ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని పేర్కొంది. "అవినీతికి పాల్పడం, పాల్పడనివ్వం.. అని ప్రధాని మోదీ చెబుతారు. కానీ, ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ నిధులను ఎలా సేకరిస్తోందనే విషయం సుప్రీంకోర్టు బయటపెట్టింది. బడా వ్యాపారవేత్తలు అంత మొత్తంలో ఆ పార్టీకి నిధులు ఎలా సమకూర్చారు? విరాళాలు ఇచ్చిన వారిలో ఎక్కువగా ఈడీ, ఐటీ దాడులను ఎదుర్కొన్నవారే" అని శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బీజేపీకి వచ్చిన విరాళాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని, అప్పటివరకు ఆ పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు. 'స్వతంత్ర భారతంలో ఇది అతిపెద్ద కుంభకోణం. సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం మాకు ఉంది. ప్రజా కోర్టుకు వెళ్తాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. చాలా కంపెనీలు బీజేపీకి ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాయని ఆరోపించారు. టార్గెట్ చేసుకున్న కంపెనీలపై ముందు ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరిపిస్తారని.. ఆ తర్వాత వసూళ్లు (ఎన్నికల బాండ్లు) చేపడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల బాండ్లు చట్టవిరుద్ధమైన పథకమని, ఇందులో 'క్విడ్ ప్రో కో' ఉందని కపిల్ సిబల్ ఆరోపించారు.

ఎస్‌బీఐ 'జాబితా' వెనుక కేంద్ర పెద్దలు



న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఒక్కో రాజకీయ పార్టీకి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన వివరాలను సవివరంగా వెల్లడించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఎస్‌బీఐ వెలువరించిన జాబితా వెనుక కేంద్ర పెద్దలున్నారని ఆరోపించారు. దొంగలను కాపాడేందుకే ఎస్‌బీఐ వివరాలు సరిగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కార్పొరేట్ కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా క్విడ్ ప్రో కోకు పాల్పడ్డాయని ఆరోపించారు.

కొనుగోలు చేసిన బాండ్లు వర్సెస్ నికర లాభాలు

కంపెనీ పేరు	కొనుగోలు చేసిన బాండ్లు (రూ.కోట్లలో)	2019-20 నుంచి 2022-23 వరకు నికర లాభం (రూ.కోట్లలో)
ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్	1368	215
మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	966	7509
క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్	410	109
వేదాంత లిమిటెడ్	400	48372
హల్దియా ఎనర్జీ లిమిటెడ్	377	1274
ఎస్సెల్ మైనింగ్ అండ్ ఐఎన్‌డీఎస్	224	3700
ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్	192	58
మదన్‌లాల్ లిమిటెడ్	185	10
భారతీ ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్	183	253
ఉత్కల్ అల్యూమినియా ఇంటర్నేషనల్	145	3713
జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్	123	18482
టొరెంట్ పవర్ లిమిటెడ్	106	5076
ఐఎఫ్‌బీ ఆగ్రో ఐఎన్‌డీఎస్ లిమిటెడ్	92	175

భారీగా విరాళాలిచ్చింది వీళ్లే

గనులు, విద్యుత్, ఇన్‌ఫ్రా సంస్థలదే అగ్రస్థానం.. విరివిగా నిధులిచ్చిన హైదరాబాద్ మౌలిక, ఫార్మారంగం



న్యూఢిల్లీ, మార్చి 15: రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చిన సంస్థల్లో మౌలిక సదుపాయాలు, గనులు, విద్యుత్ కర్మాగారాల సంస్థలే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అయిదేళ్ల వ్యవధిలో రూ.16,500 కోట్లకు పైగా విరాళాలు కంపెనీలు అందజేయగా, హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా, ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీలు అందులో తమవంతు పాత్ర పోషించాయి. అయితే, అగ్రస్థానంలో ఉన్న పది కంపెనీల్లో హైదరాబాద్ కంపెనీ మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే ఉంది.

1) ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్: కోయంబత్తూరు రిజిస్టర్డ్ సంస్థ. ఏకంగా 1,368 కోట్ల రూపాయల బాండ్లు కొన్నారు. ఈడీ కేసులున్నాయి. మార్టిన్ లాటరీ ఏజెన్సీస్ అనే పేరుతో కొన్నాళ్లు నడిచింది. యజమాని మార్టిన్ చాలాకాలంలో దేశంలో కెల్లా అత్యధిక పన్ను చెల్లింపుదారుగా ఉన్నారు. నిర్మాణం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీ వార్షికాదాయం 16,500 కోట్లు.

2) మేఘా ఇంజనీరింగ్: హైదరాబాద్ కంపెనీ. 966 కోట్ల విరాళాలు ఇచ్చింది. దాని అనుబంధ సంస్థ టాప్ -10లో ఏడో స్థానంలో ఉన్న వెస్టర్న్ యూపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరో 220 కోట్లు ఇచ్చింది. టన్నెళ్లు, రైల్వే మౌలిక సదుపాయాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణంలో ప్రసిద్ధి. హిమాలయాల్లో జోజిల్లా రోడ్ టన్నెల్ నిర్మాణం చేస్తోంది.

3) క్విక్ సప్లయి చైన్: ఇది ముంబైకి చెందిన లాజిస్టిక్స్ కంపెనీ. ఏకంగా 410 కోట్లు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చింది. 2000 సంవత్సరంలో 130 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేశారు. గోదాములతో పాటు మానవ వనరుల నిర్వహణ కూడా చేస్తోంది. 2021-22లో కేవలం రూ.21 కోట్ల ఆదాయం ఉన్న ఈ సంస్థ ఆ సంవత్సరం ఏకంగా 360 కోట్ల విరాళం ఇచ్చింది. దీని కేంద్ర కార్యాలయం నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జి పార్క్‌లో ఉంది. దాని డైరెక్టర్లు కూడా రిలయన్స్ ఇతర కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. పైగా, దేశంలోని అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన రిలయన్స్ ఎలాంటి విరాళాలు ఇవ్వలేదు. 410 కోట్లు రిలయన్స్ విరాళాలేనని వార్తలు వచ్చిన నేపథ్యంలో క్విక్ సప్లయి చైన్ తమ అనుబంధ సంస్థ కాదని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది.

4) వేదాంత: అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత 401 కోట్లు ఇచ్చింది. పలు రకాల గనుల వ్యాపారం ఉంది. బ్రిటన్ సంస్థకు అనుబంధ సంస్థ. గ్రూప్‌ను ఆరు భాగాలుగా విభజించే క్రమంలో ఉంది.

5) హల్దియా ఎనర్జీ: బెంగాల్లోని హల్దియాలో భారీ థర్మల్ విద్యుత్ కర్మాగారాలు నిర్వహిస్తున్న హల్దియా గ్రూపు 377 కోట్ల విరాళాలు ఇచ్చింది. గోయంకా కుటుంబానికి చెందిన ఈ సంస్థకు మోహన్ బగాన్ ఫుట్‌బాల్ జట్టు, ఐపీఎల్ లఖ్‌నవూ జట్టు ఉన్నాయి. ఇ

6) ఎస్సెల్ మైనింగ్: దేశంలో అతిపెద్ద ప్రైవేటు బొగ్గు గనుల సంస్థ. 225 కోట్లు విరాళాలుగా ఇచ్చింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది.

7) వెస్టర్న్ యూపీ పవర్: దేశంలో అతిపెద్ద విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. 220 కోట్ల విరాళం ఇచ్చింది. ఇది మేఘా అనుబంధ సంస్థ.

8) భారతి ఎయిర్‌టెల్: జియో తర్వాత దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ. 198 కోట్ల విరాళాలు ఇచ్చింది.

9) కెవ్వెంటర్ ఫుడ్ పార్క్: బెంగాల్లో ఆహారం, పాల ఉత్పత్తుల ఎగుమతుల వ్యాపారం ఉంది. 195 కోట్ల విరాళం ఇచ్చింది.

10) ఎంకేజీ ఎంటర్‌ప్రైజెస్: బెంగాల్ సంస్థ. స్టీల్ వ్యాపారంలో ఉంది. 192 కోట్లు ఇచ్చింది.

162 కోట్లు ఇచ్చింది ఎవరు?

పన్నెండవ స్థానంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉంది. ఏకంగా రూ.162 కోట్ల విరాళం ఇచ్చింది. అయితే, ఘాజియాబాద్‌లోని యశోద, హైదరాబాద్‌లోని యశోద రెండూ ఆ విరాళాలు తమవి కాదని స్పష్టం చేశాయి. యశోద హాస్పిటల్స్ పేరుతో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిందెవరనేది తేలాల్సి ఉంది. మరోపక్క ఈడీ దాడులకు గురయిన కంపెనీలే బీజేపీకి భారీగా విరాళాలు ఇచ్చాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. తప్పని నిరూపించ దలచుకుంటే విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేసింది.

తెలుగు కంపెనీలు

తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్న కొన్ని కంపెనీలు కూడా భారీగానే విరాళాలు ఇచ్చాయి. రెడ్డి ల్యాబ్స్ రూ.80 కోట్లు, నాట్కో ఫార్మా రూ.69 కోట్లు, ఎన్‌సీసీ రూ.60 కోట్లు, దివి ల్యాబ్స్ రూ.55 కోట్లు, నవయుగ రూ.55 కోట్లు, రామ్‌కో సిమెంట్స్ రూ.54 కోట్లు, అరబిందో ఫార్మా రూ.52 కోట్లు, రిత్విక్ ప్రాజెక్టు రూ.45 కోట్లు, అపర్ణ ఎస్టేట్స్ రూ.30 కోట్లు, సన్ ఫార్మా 31 కోట్లు, హెటిరో డ్రగ్స్ రూ.30 కోట్లు, హెటిరో ల్యాబ్స్ రూ.25 కోట్లు, హెటిరో బయో ఫార్మా 5 కోట్లు, హానర్ ల్యాబ్స్ రూ.25 కోట్లు, నూజివీడు సీడ్స్, ప్రభాకర్‌రావు కలిపి రూ.27 కోట్లు, మైహోం రూ.15 కోట్లు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ రూ.10 కోట్లు, సంధ్య కన్‌స్ట్రక్షన్స్ 13 కోట్లు, నగ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ.10 కోట్లు, మైహోం ఇన్‌ఫ్రా రూ.10 కోట్లు, భారత్ బయోటెక్ రూ.10 కోట్లు, వంశీరాం బిల్డర్స్ 7 కోట్లు, శ్రీచైతన్య 5 కోట్లు, రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చాయి. ఫార్మ, హెల్త్‌కేర్ రంగాలే ఏకంగా రూ.900 కోట్ల విరాళాలు ఇచ్చాయి.

మార్టిన్ మోసగాడు.. జాగ్రత్త



» 2019 సెప్టెంబరులో కేంద్రం హెచ్చరిక
» అత్యధికంగా రూ.1,368కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ కొన్న లాటరీ కింగ్ మార్టిన్
» కూలీ నుంచి రూ.వేల కోట్లకు అధిపతి

చెన్నై, మార్చి 15: "అతడు మోసగాడు.. జాగ్రత్త..!" ఇది ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి శాంటియాగో మార్టిన్ కార్యకలాపాల గురించి 2019 సెప్టెంబరు 23న కేంద్ర హోం శాఖ పలు రాష్ట్రాలకు చేసిన హెచ్చరిక. ఆ వెంటనే కేవలం 10 రోజుల్లోనే మార్టిన్ వరుసగా ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలు మొదలుపెట్టాడు. ఆ నెలలో ఏకంగా రూ.190 కోట్ల బాండ్లను కొనుగోలు చేశాడు. అప్పటినుంచి ఈ జనవరి దాక రూ.1,368 కోట్ల బాండ్లతో అత్యధికంగా బాండ్స్ కొన్న వ్యక్తిగా నిలిచాడు. మార్టిన్, అతడి సంస్థలపై పన్ను ఎగవేతలు, మనీ ల్యాండరింగ్, మోసం ఆరోపణలు రావడంతో 2011 నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను (ఐటీ) శాఖలు దృష్టిసారించాయి. కోయంబత్తూర్‌లో భూ ఆక్రమణలు, మోసానికి పాల్పడినందుకు కేసులు నమోదయ్యాయి. కేరళలో లాటరీల్లో అక్రమాలను అక్కడి ప్రభుత్వం కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో కేరళలో అతడి సిక్కిం స్టేట్ లాటరీ కార్యకలాపాలపై నిషేధం విధించింది. మార్టిన్‌పై సీబీఐ కేసులు కూడా ఉన్నాయి. బహుమతి మొత్తాన్ని పెంచి చూపి రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమంగా ఆర్జించారనే కేసు వీటిలో ఒకటి. ఈడీ 2019 ప్రారంభంలోనే ఫ్యూచర్ గేమింగ్ సంస్థపై విచారణ మొదలుపెట్టింది. ఆ ఏడాది జూలైలో రూ.250 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. 2022 ఏప్రిల్ 2న ఇదే కేసులో మరో రూ.409 కోట్ల చరాస్తులనూ ఫ్రీజ్ చేసింది. ఆ తర్వాత ఐదు రోజుల్లోనే మార్టిన్ సంస్థ ఏకంగా రూ.100 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం గమనార్హం.

కాగితాలపైనే కార్యాలయాలు

రూ.వేల కోట్ల లావాదేవీలు సాగిస్తూ అంతేస్థాయి విరాళాలు ఇచ్చిన మార్టిన్ వ్యాపార కార్యాలయాన్నీ కాగితాలపైనే అని ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో ఉన్న ప్రకారం పంజాబ్‌లోని లూథియానాలో ఉన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ కార్యాలయ చిరునామాకు వెళ్లగా అక్కడసలు కార్యాలయమే లేదని తేలింది.

ఆదాయం రూ.215 కోట్లే..

2019-23 మధ్య ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఆదాయం రూ.215 కోట్లే. కానీ, రూ.1,368 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లో ఖాతాలు ఫ్రీజ్ చేసినా 2023లో రూ.100 కోట్లను విరాళం ఇచ్చింది. నిరుడు జూలై 6వ తేదీన రూ.100 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లోనే రూ.400 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేయగా.. ఖాతాలు ఎలా నిర్వహించింది? విరాళాలు ఎలా ఇచ్చిందనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఇంతకూ ఎవరీ మార్టిన్?

ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి, లాటరీ కింగ్‌గా పేరుగాంచిన మార్టిన్ తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందినవాడు. తొలుత మయన్మార్ రాజధాని యాంగూన్‌లో కూలీగా పనిచేశాడు. 13 ఏళ్ల వయసుకే 'లాటరీ' వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. 1988లో భారత్‌కు తిరిగొచ్చి తమిళనాడులో కార్యకలాపాలు మొదలుపెట్టాడు. కర్ణాటక, కేరళ, బెంగాల్, పంజాబ్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాలకు మార్చి నేపాల్, భూటాన్ దేశాలకూ విస్తరించాడు.

కేరళలో కమల వికాసం ఖాయం

పతనంతిట్ట(కేరళ): ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాల అవినీతి, అసమర్థ పాలనలో కేరళ ప్రజలు ఎన్నో కష్టాలు భరించారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన దక్షిణ కేరళలోని పతనంతిట్ట జిల్లాలో గణనీయ ప్రాబల్యం ఉన్న క్రైస్తవ కమ్యూనిటీతో భేటీ అయ్యారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'గత ఎన్నికల్లో కేరళ ప్రజలు మమ్మల్ని రెండంకెల ఓట్ల శాతం కలిగిన పార్టీని చేశారు. ఇక్కడ మేం రెండంకెల సీట్ల లక్ష్యాన్ని సాధించే రోజు ఎంతో దూరంలో లేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కమలం వికసించడం ఖాయం" అని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, మాజీ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ కె. ఆంటోనీని యువతకు ప్రతినిధిగా మోదీ అభివర్ణించారు. గతేడాది కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన అనిల్ ఆంటోనీ రాబోయే ఎన్నికల్లో పతనంతిట్ట లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళనాడులోని కోయంబత్తూరులో ప్రధాని మోదీ పాల్గొనే రోడ్‌షోకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆర్ఎస్ పురంలో ప్రధాని మోదీ ఈ నెల 18న బీజేపీ నిర్వహించే రోడ్ షోలో పాల్గొనాల్సి ఉంది. అయితే.. ఇక్కడ 1998లో బాంబు పేలుళ్లు జరిగాయి. ఇక్కడ భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కోయంబత్తూరు జిల్లా పోలీసులు రోడ్‌షోకు అనుమతించలేదు. అయితే, 4 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించుకునేందుకు మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చింది.



కన్యాకుమారిలో ఓ సభలో మోదీ, నటి రాధిక, శరత్‌కుమార్

నేడే ఎన్నికల భేరి



(మొదటి పేజీ తరువాయి)

తేదీలను వెల్లడిస్తుంది. ఆంధ్ర, తెలంగాణల్లో ఏప్రిల్ నెలాఖరులో పోలింగ్ జరగొచ్చని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 97 కోట్ల మంది అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం 12 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4-5 దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశముంది. ఆంధ్ర, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయంటున్నారు. నక్సల్స్ ప్రభావం కారణంగా ఒడిసాలో గత ఎన్నికల మాదిరిగా నాలుగు దశల్లో జరిగే వీలుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303, కాంగ్రెస్ 52, డీఎంకే 24, టీఎంసీ 22, వైసీపీ 22, శివసేన 18, జేడీయూ 16, బీజేడీ 12, బీఎస్పీ 10, టీఆర్ఎస్ 9 సీట్లు గెలిచాయి. ఈ దఫా లోక్‌సభ ఎన్నికలు విపక్ష ఇండియా కూటమికి జీవన్మరణ సమస్యగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వివిధ సర్వేలు ఎన్డీయే హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, బీజేపీ సొంతంగా 350 స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేయడంతో అధికార కూటమి సమరోత్సాహంతో ఉంది. కాగా, బీజేపీ ఇప్పటికే 267 మంది అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ కూడా 82 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. టీఎంసీ బెంగాల్, అసోంలలో పోటీచేసే 47 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్, ఎస్పీ కూడా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి.

కమిషనర్ల నియామకాలపై స్టేకు నో

సీజేఐని సెలెక్ట్ ప్యానెల్ నుంచి తప్పించి అందులో ఒక కేంద్ర మంత్రిని నియమించేలా 2023లో చేసిన చట్టం ఆధారంగా జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలను కొత్త ఎన్నికల కమిషనర్లుగా నియమించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సాధారణంగా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఏ చట్టాన్నీ కోర్టు నిలిపివేయదని వ్యాఖ్యానించింది. కొత్త కమిషనర్ల నియామక చట్టాన్ని, జ్ఞానేశ్, సంధూల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కొత్త కమిషనర్ల నియామకం కోసం సెలెక్ట్ కమిటీ సమావేశాన్ని ముందుకు జరిపారని పిటిషనర్లలో ఒకరైన జయా ఠాకూర్ తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ ప్రస్తావించారు. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

యడియూరప్పపై పోక్సో కేసు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పపై బెంగళూరు నగరం సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ అయిన తన కూతురుపై ఫిబ్రవరి 2న యడియూరప్ప లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని బాలిక తల్లి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయం కోసం కూతురుతో కలిసి వెళ్లానని, యడియూరప్ప తమతో 9 నిమిషాలపాటు మాట్లాడారని, ఆ తర్వాత బాలికను గదిలోకి తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. గది నుంచి బయటకు వచ్చిన యడియూరప్ప క్షమాపణలు చెప్పారని, ఎవరికీ చెప్పవద్దని భయపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు పోక్సో చట్టం 8, ఐపీసీ సెక్షన్ 354(ఎ) కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై యడియూరప్ప శుక్రవారం బెంగళూరులో స్పందించారు. తమకు అన్యాయం జరిగిందని తల్లీకూతుళ్లు నెలన్నర కిందట తన ఇంటికి వచ్చి కన్నీరు పెట్టుకున్నారని, కొంత ఆర్థిక సాయం చేసి, నగర పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేసి వారికి న్యాయం చేయాలని సూచించానని అన్నారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని, అంతకు మించి మాట్లాడేది ఏమీ లేదని అన్నారు. కాగా ఈ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీజీపీ అలోక్‌మోహన్ తెలిపారు.

సీఏఏపై 19న సుప్రీం కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టంపై (సీఏఏ) దాఖలైన పిటిషన్లను ఈ నెల 19న విచారించనున్నట్టు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. సీఏఏ అమలుపై స్టే విధించాలంటూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఈ నెల 12న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా.. "2019 నుంచి ఇప్పటి వరకు సుమారు 195 పిటిషన్లు వచ్చాయి. మంగళవారం దీనిపై వాదనలు వింటాం. అన్నింటినీ కలిపి విచారిస్తాం" అని ధర్మాసనం తెలిపింది. సీఏఏను వ్యతిరేకిస్తున్న ఇండియా కూటమి నేతల వైఖరికి నిరసనగా ఢిల్లీలో మొదలైన ఆందోళనలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి.

'ఫ్రీ సింబల్'పై ఈసీ విధానాన్ని పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, మార్చి 15: గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చే 'ఫ్రీ సింబల్(ఎన్నికల గుర్తు) విధానాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. 'ఎవరు ముందు వస్తే వారికి ముందు' అనే విధానంలో గుర్తింపు పొందని పార్టీలకు ఈసీ ఎన్నికల గుర్తులు కేటాయిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ తమిళనాడుకు చెందిన గుర్తింపు పొందని పార్టీ 'నామ్ తమిళర్ కట్చి' సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారణకు స్వీకరించిన కోర్టు... దీనిపై స్పందించాలని కోరుతూ శుక్రవారం ఈసీకి నోటీసులు జారీ చేసింది.


కంటి నిండా కునుకుండట్లే..!!

» దేశంలో పెరుగుతున్న నిద్రలేమి సమస్య
» తగినంత నిద్రపోయేది 27% మందే
» రెస్‌మెడ్ స్లీప్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన విధానాలు, పెరుగుతున్న సమస్యలు మనిషికి కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నాయి. తగినంత నిద్ర లేకపోవడం అనేది శరీరంపై తీవ్ర ప్రభావమే చూపుతుంది. అనేక శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతుంది. ఈ నిద్రలేమితో బాధపడుతున్న వారి సంఖ్య దేశంలో నానాటికి అధికమవుతోంది. మన దేశంలో కేవలం 27 శాతం మంది మాత్రమే ప్రతి రోజు రాత్రి వేళ సరిపడా (కనీసం 6 నుంచి 8 గంటలు) నిద్రపోతున్నారు. ప్రపంచ నిద్రా దినోత్సవం సందర్భంగా రెస్‌మెడ్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన రెస్‌మెడ్ స్లీప్ సర్వే-2024లో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా 36వేల మందిపై ఈ సర్వే చేశారు. ఇదే సంస్థ 2023లో నిర్వహించిన సర్వేలో సుమారు 80 శాతం మంది తగినంత నిద్రపోతున్నట్లు తేలింది. తాజా గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడం దేశంలో నిద్రలేమి సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. కాగా, పని ఒత్తిడి వల్లే తమకు నిద్ర ఉండడం లేదని సర్వేలో పాల్గొన్నవారిలో 42 శాతం మంది వెల్లడించడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాల్లో 38 శాతం మంది పని ఒత్తిడి వల్ల రాత్రిళ్లు తగినంత సేపు నిద్రపోవడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇది 42 శాతంగా ఉంది. నిద్రలేమి వల్ల పని ప్రదేశంలో పూర్తి సామర్థ్యం మేరకు పని చేయలేకపోతున్నామని సర్వేలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది చెప్పారు. కాగా, రాత్రి మంచం ఎక్కిన తర్వాత సెల్‌ఫోన్ చూడడమనేది చాలా మందికి అలవాటుగా మారిందని, నిద్రలేమికి ఇది ప్రధాన కారణమని భావిస్తున్నారు.

భారత నేవీ మాజీ చీఫ్ రాందాస్ ఇకలేరు

» నేడు తిరుమలగిరిలో అంత్యక్రియలు.. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్(రిటైర్డ్) లక్ష్మీనారాయణ్ రాందాస్ (90)ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. 1933 సెప్టెంబరు5న ముంబైలో జన్మించిన రాందాస్.. 1953 నుంచి 1993 వరకు భారత నౌకా దళంలో వివిధ హోదాలో విశిష్ట సేవలందించారు. 1971లో భారత్-పాక్ యుద్ధంలోనూ నౌకాదళ అధికారిగా రాందాస్ ముఖ్య పాత్ర పోషించారు. అందుకుగాను ఆయన్ను భారత ప్రభుత్వం వీర్ చక్ర అవార్డుతో సత్కరించింది. 1990 జనవరి 30న 13వ భారత నౌకాదళ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన రాందాస్.. పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నౌకాదళంలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించి చరిత్రలో నిలిచారు. రాందాస్ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గ వాటికలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

రక్తంతో మునిగిన వైసీపీ పునాదులు

న్యాయంకోసం నిలబడిన ఆడబిడ్డ ఒకవైపు.. హంతకులను రక్షిస్తున్న ప్రభుత్వం మరో వైపు

- జనం ఎటువైపో తేల్చుకోవాల్సిన తరుణం ఇదే..
- మేమే చంపించామని 'సాక్షి'లో తప్పుడు రాతలు
- చనిపోయే దాకా జగన్ కోసమే వివేక పనిచేశారు
- ఆయన జయంతికి గానీ, వర్ధంతికి గానీ రాలేరా?
- వివేకానందరెడ్డి వర్ధంతి సభలో సునీత వ్యాఖ్యలు

సొంత అన్నయ్యే.. హంతకులను కాపాడుతున్నాడు

- 'సాక్షి'లో వివేకానంద వ్యక్తిత్వ హననానికి యత్నం
- మీరు మనుషులేనా? మన స్సాక్షి అనేది లేదా మీకు?
- న్యాయం, నిజం వైపు ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిలబడాలి
- సునీత పోరాటంలో నేను ఆయుధం అవుతా: షర్మిల



వైఎస్ వివేకా వర్ధంతి సభలో మాట్లాడుతున్న సునీత, షర్మిల



కడప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రిగా అంతఃకరణ శుద్ధితో పని చేస్తానని ప్రమాణం చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి.. ఆ మాటకు అర్థం తెలుసా అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ పునాదులు వివేకానంద రెడ్డి రక్తం, కోడికత్తి శ్రీను రక్తంతో మునిగి ఉన్నాయన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా కడపలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సభలో సునీత ఆవేదన నిండిన స్వరంతో మాట్లాడారు. "వివేకా హత్య గురించి అనేక ఆరోపణలు చేస్తున్నారు. నేను, నా కుటుంబం ఏదో చేశామని ఫిర్యాదులు చేస్తున్నారు. మీరు (జగన్‌ను ఉద్దేశించి) ప్రభుత్వంలో ఉన్నారు. మీరు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నారా? లేక ప్రజలకు ఫిర్యాదు చేస్తున్నారా? ప్రభుత్వంలో ఉన్న మీకు ఇది తప్పు అనిపించడం లేదా? 'సాక్షి'లో రకరకాల కథనాలు వేస్తున్నారు. 'సాక్షి' చైర్మన్ భారతికి నాదో విన్నపం.. వివేకా హత్య గురించి సమాచారం అందిస్తే రూ.5లక్షల రివార్డు ఇస్తామని సీబీఐ వాళ్లు ప్రకటించారు. మీ దగ్గర ఆధారాలుంటే, వాటిని దయచేసి దర్యాప్తు సంస్థకు అప్పగించండి. వారి మీద నమ్మకం లేకుంటే కోర్టుకు వెళ్లండి. ఆ రోజు రాత్రి చనిపోయే వరకు, అంటే రాత్రి 11గంటల వరకు వైసీపీ కోసమే వివేకా ప్రచారం చేశారని మీరే అన్నారు కదా! మరి మీకోసం అంత కష్టపడిన వ్యక్తి హత్యకు గురైతే.. ఆ హత్య వెనుక కుట్ర కోణాలు బయటపెట్టాల్సిన బాధ్యత మీకు లేదా? మీకోసం ఆయన పదవిని కూడా త్యాగం చేశారు కదా! మరి ఆ మహానుభావుడిని మరచిపోయారా? ఆయన చనిపోయి ఇన్నాళ్లయినా ఒక్కసారి అయిన ఆయన జయంతికి గానీ ఆయన వర్ధంతికి గానీ ఆయన సమాధి వద్దకు ఒక్కసారి అయినా వచ్చారా? పదవులు త్యాగం చేసిన చిన్నాన్నకు, అన్న కోసం పగలనక రాత్రనక తిరిగిన చెల్లికి వారు ఇచ్చిన కానుకలు చూశాం. వైసీపీ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, నాయకులకు ఒక సలహా ఇస్తున్నా! మీ భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వం నుంచి బయటకు రండి. లేకపోతే ఈ పాపం మీకు కూడా చుట్టుకుంటుంది. ఆయనతో పాటు మిమ్మల్ని కూడా ఊబిలోకి తీసుకెళ్తాడు. న్యాయం కోసం పోరాడుతున్న ఆడ కూతురు ఒకవైపు.. హంతకులను రక్షిస్తున్న ప్రభుత్వం మరోవైపు ఉంది.. ఎటువైపు నిలబడాలో ప్రజలే నిర్ణయించుకోవాలి. దయచేసి మా అన్న పార్టీకి ఓటు వేయవద్దు.. ఈ ప్రభుత్వం దిగితే ప్రజా కోర్టులో న్యాయం జరుగుతుంది. అదిచూసి న్యాయస్థానంలో త్వరగా తీర్పు రావచ్చు. హంతకులకు ఓటు వేయవద్దు. పార్టీ ముఖ్యం కాదు, నేను నిల్చున్నా నిల్చోకపోయినా మన చేతిలోని అస్త్రం ఓటు.. దానిని అందరూ వినియోగించుకోవాలి" అని అన్నారు.

మీకు మనస్సాక్షి లేదా?

"గూగుల్ మ్యాప్‌లు అయితేనేవి), కాల్ రికార్డులు అయితేనేమి, వాంగ్మూలాలు అయితేనేమి...అవన్నీ హత్య చేసింది వీళ్లేనని వేలెత్తి చూపుతున్నా, ఈరోజు వరకు కూడా హత్య చేసినవాళ్లకు, హత్య చేయించిన వాళ్లకు శిక్షలు పడలేదు. కేసు కొలిక్కి రాలేదు. కేసు అసలు ముందడుగు వేయలేదు. ఎందుకని? ఎందుకంటే అన్నా అని పిలిపించుకున్నవాడే ఈరోజు హంతకులకు రక్షణ కల్పిస్తున్నాడు. ఒక సారి అద్దం ముందు నిల్చొని హత్య చేసింది సునీత కుటుంబమా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. అద్దం ఏం సమాధానం చెబుతుందో, మీ మనస్సాక్షి ఏం సమాధానం చెబుతుందో ఒక్కసారి మీ మనసు పెట్టి వినండి" అని సీఎం జగన్‌ను ఉద్దేశించి ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆత్మీయ సభలో ఆమె మాట్లాడారు. "ఆఖరుకు ఇంతగా దిగజారతారని ఎవరూ ఊహించలేదు. 'సాక్షి'లో పైన రాజశేఖర్‌రెడ్డి ఫొటో.. కింద రాజశేఖరరెడ్డి నమ్మిన, ఆయన కోసం పనిచేసిన తమ్ముడి వ్యక్తిత్వ హననం. ఇది న్యాయమేనా? మీ కోసం పనిచేసినపుడు కనిపించలేదా వివేకానందరెడ్డి కేరెక్టర్? ఆఖరి నిమిషం వరకు, చనిపోయే రోజు రాత్రి వరకు వైసీపీ కోసమే చిన్నాన్న క్యాంపెయిన్ చేశారు కదా! వైసీపీ నిలబెట్టిన అభ్యర్థులను ఆయన అంగీకరించకపోయినా జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని నమ్మి అదే వైసీపీ కోసం క్యాంపెయిన్ చేశారు. అలాంటి వ్యక్తి హననానికి 'సాక్షి'లో పూనుకొంటారా? మీరు మనుషులేనా? సునీతకు మాటిస్తున్నా....చిన్నమ్మకు మాటిస్తున్నా.. ఎవరు నిలబడినా నిలబడకపోయినా రాజశేఖర్‌రెడ్డి బిడ్డ మీకు అండగా ఉంటుంది.. సునీత చేస్తున్న పోరాటంలో బలమవుతా.. హత్య చేసినవారికి శిక్ష పడాలని సునీత చేస్తున్న న్యాయ, ధర్మ పోరాటంలో నేను ఒక ఆయుధం అవుతా. యావత్ ఏపీ ప్రజలందరు ఒక నిర్ణయం తీసుకొని, న్యాయం పక్షాన నిలబడాలి, నిజం పక్కన నిలబడాలి" అని అన్నారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో 8వ నిందితుడిగా ఉన్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి (ఏ4) పిటిషన్ వేసిన నేపథ్యంలో.. గతంలో ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను ఎందుకు రద్దు చేయరాదో వివరించాలని పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని అవినాశ్‌రెడ్డితో పాటు ప్రతివాదులైన సీబీఐ, వివేకా కుమార్తె సునీతారెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ షరతులను నిందితుడు అవినాశ్ ఉల్లంఘించాడని.. తనను సాక్ష్యం చెప్పకుండా బెదిరించేందుకు కుటుంబీకులపై దాడులు చేయిస్తున్నాడని.. ప్రలోభాలకు గురిచేశారని దస్తగిరి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రవణ్ వాదనలు వినిపిస్తూ.. బెయిల్ షరతుల ఉల్లంఘనకు పాల్పడిన అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరారు. ఇటు ఈ కేసులో బెయిల్ కోరుతూ ఏ6, ఏ7గా ఉన్న ఉదయ్‌కుమార్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి వేసిన పిటిషన్లనూ కోర్టు విచారించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన సీబీఐ, సునీతారెడ్డికి నోటీసులు జారీ చేస్తూ విచారణ వాయిదా వేసింది.

ధాన్యం టెండర్లతో 1,110.51 కోట్ల లాభం!

- తక్కువ ధరకే కట్టబెట్టేందుకు గత ప్రభుత్వ యత్నం
- తాజాగా పిలిచిన టెండర్లతో ఖజానాకు లాభం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పిలిచిన ధాన్యం టెండర్లను రద్దుచేసి.. కొత్తగా ఇటీవల పిలిచిన టెండర్లతో... రూ. 1,110.51 కోట్ల లాభం వచ్చినట్లు శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ వెల్లడించింది. నిరుడు యాసంగిలో సేకరించిన సుమారు 35 లక్షల టన్నుల ధాన్యాన్ని దాదాపు వెయ్యి కోట్లు నష్టం వాటిల్లేలా టెండర్లు కట్టబెట్టేందుకు ప్రయత్నించిందని తెలిపింది. పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవగా... గతం కన్నా ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ. 3 వేలు అదనంగా బిడ్డింగ్‌లు దాఖలు కావటంతో... అదనపు ఆదాయం సమకూరిందని వెల్లడించింది. కనీస మద్దతు ధర ప్రకారం టన్ను ధాన్యం ధర రూ. 20,600 ఉండగా... గత ప్రభుత్వ హయాంలో టన్నుకు రూ. 17,015-19 పైసలకే టెండర్లు ఖరారు చేశారని.. తద్వారా 34.59 లక్షల టన్నుల ధాన్యానికి రూ. 5,885.55 కోట్ల ఆదాయం రావాల్సి ఉందని, ఎమ్మెస్పీ ప్రకారం చూస్తే రూ. 1,239.99 కోట్లు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. తక్కువ ధరకు టెండర్లు దక్కించుకున్నప్పటికీ... కొనుగోలుదారులు ఆ మొత్తం చెల్లించేందుకు ముందుకు రాలేదని.. తాజా టెండర్లలో టన్నుకు సగటున రూ. 20,225.67కు టెండర్ బిడ్డింగ్ దాఖలయ్యాయని వివరించారు. ఈ లెక్కన మొత్తం 34.59 లక్షల టన్నుల ధాన్యానికి తాజా టెండర్ల ప్రకారం... రూ. 6,996.06 కోట్ల ఆదాయం సమకూరనుందని వెల్లడించింది.

కెనడాలో భారత సంతతి కుటుంబం బలి!

- అనుమానాస్పద స్థితిలో చెలరేగిన మంటల్లో చిక్కుకొని భార్యాభర్తలు.. వారి కుమార్తె దుర్మరణం

ఒట్టావా, మార్చి 15: కెనడాలో విషాద ఘటన జరిగింది. భారత సంతతికి చెందిన దంపతులు, వారి కుమార్తె 'అనుమానాస్పద స్థితి'లో చెలరేగిన మంటల్లో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. మృతులను రాజీవ్ వరికూ (51), ఆయన భార్య శిల్పా కొత్త (47), వీరి కుమార్తె మెహక్ వరికూ (16)గా గుర్తించారు. గత వారం కెనడాలోని ఒంటారియో ప్రావిన్సు బ్రాంప్టన్‌లోని రాజీవ్ నివాసంలోనే ఈ ఘటన జరిగింది. ఘటనపై అక్కడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుట్టపై మళ్లీ 'నిద్ర మొక్కు'

యాదగిరిగుట్టపై భక్తుల కోసం డార్మిటరీ హాల్ ప్రారంభం.. 1000 మంది నిద్రించేందుకు వీలుగా ఏర్పాట్లు

- ఆలయ విస్తరణలో తెరమరుగైన ఈ సంప్రదాయం
- మళ్లీ అందుబాటులోకి తెచ్చిన కాంగ్రెస్ సర్కారు
- మురళీకృష్ణుడిగా నారసింహుడి దర్శనం

యాదాద్రి, యాదగిరిగుట్ట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనృసింహుడు కొలువైన యాదగిరిగుట్టపై నిద్ర మొక్కు (గుడి నిద్ర మొక్కు)ను చెల్లించుకోవాలనుకుంటున్నారా? ఆలయ విస్తరణకు ముందు దాకా కొనసాగిన గొప్ప ప్రాశస్త్యం కలిగిన ఈ సంప్రదాయం భక్తుల కోసం మళ్లీ అందుబాటులోకొచ్చింది. ఈ మేరకు దర్శన క్యూ కాంప్లెక్స్‌లోని నాలుగో అంతస్తులో డార్మిటరీ హాల్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. అలాగే దర్శనానంతరం భక్తులు సేదతీరేందుకు వీలుగా ఉత్తర తిరుమాడ వీధిలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా డార్మిటరీ హాల్‌లో 1000 మంది భక్తులు నిద్ర చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసే భక్తులు నిద్రల మొక్కు చెల్లించుకునేందుకు ప్రధానాలయ ఈశాన్య దిశలోని మెట్ల మార్గం గుండా డార్మిటరీ హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. యాదగిరీశుడి ఆలయ పునర్నిర్మాణం, విస్తరణతో కొండపైన బస చేసేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవవడంతో నిద్ర మొక్కుల సంప్రదాయానికి తెరపడినట్లయింది. ఆలయ ఉద్ఘాటన జరిగాక క్షేత్ర సందర్శనకు విచ్చేసే భక్తులు, స్థానికులు కొండపైన వసతి గదుల సదుపాయాలు ఉండాలని, కనీసం డార్మిటరీ హాల్‌నైనా నిర్మించి నిద్ర చేసే అవకాశం కల్పించాలని అధికారులను కోరుతూ వచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాలతో భక్తుల కోసం నిద్రల మొక్కు సంప్రదాయం కోసం అధికారులు చర్యలు తీసుకున్నారు.

పాత సంప్రదాయాల పునరుద్ధరణ: బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్టలో పాత సంప్రదాయాలు, ఆచారాలను పునరుద్ధరించనున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. కొండపైన గతంలోని సంప్రదాయాలు, ఆచారాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పేరుతో నామరూపాల్లేకుండా చేసిందని విమర్శించారు. లక్ష్మీనృసింహుడి ఆశీస్సులతో తాను ఒక్కొక్కటిగా భక్తులకు అందుబాటులోనికి తెస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కొండపైన కొబ్బరికాయలు కొట్టే స్థలంతో పాటు కొండపైకి ఆటోలను అనుమతించామని పేర్కొన్నారు.



మురళీకృష్ణుడి అలంకారంలో స్వామివారు

మురళీకృష్ణుడిగా నారసింహుడు

యాదగిరిగుట్ట నృసింహుడు మురళీకృష్ణుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం తిరుకల్యాణ వేడుకల్లో పెళ్లి కొడుకుగా ముస్తాబైన స్వామివారు శ్రీ కృష్ణాలంకారంలో విశేషసేవలు అందుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారు పొన్న వాహనసేవలో సింహ వాహనంపై దర్శనమిచ్చారు.

గుట్టపై స్నానాల పుష్కరిణి రానుందా?

ఆలయ పునరుద్ధరణకు మునుపు యాదగిరి గుట్టపై భక్తుల కోసం ప్రత్యేక పుష్కరిణి (గుండం) ఉండేది. ఆ గుండంలో స్నానం చేసినా, అందులోని నీళ్లను తలపై చల్లుకున్నా కోరిన కోరికలు ఈడేరుతాయని భక్తులు విశ్వసించేవారు. అయితే ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ గుండాన్ని అప్పటి ప్రభుత్వం తొలగించింది. భక్తుల కోసం గుట్ట కిందనే లక్ష్మీ పుష్కరిణి పేరుతో ప్రత్యేకంగా గుండాన్ని నిర్మించింది. కొండపైన ఉన్న గుండానికి విష్ణుపుష్కరిణిగా నామకరణం చేసింది. ఈ పుష్కరిణిని స్వామివారి చక్రతీర్థం కోసం వాడుతున్నారు. సత్యనారాయణస్వామివ్రతం, కల్యాణకట్ట, అన్నదానం, తదితర సేవలన్నీ కూడా కొండకిందనే ఏర్పాటుచేశారు. అయితే ఆలయ పునరుద్ధరణకు ముందు ఉన్న ఆచారాలన్నింటినీ మళ్లీ అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రకటించడంతో ఇవన్నీ కూడా మళ్లీ గుట్టపైనే అందుబాటులోకి రానున్నాయా? అని భక్తుల్లో చర్చ జరుగుతోంది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ) బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ జిల్లా పోలీసులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీజాపూర్ జిల్లా బెద్రె పోలీస్ స్టేషన్ పరిధిలోని హింగ్ మెట్టాలంక అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. చనిపోయిన వారిలో ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన ప్లాటూన్ నంబర్ 16 కమాండర్ మల్లేష్, మాడ్ డివిజన్ కంపెనీ నెంబర్ 1 కమాండర్ అరుణ్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. - చర్ల



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాండు బంధాలు

ఎలక్టోరల్ బాండ్ల విషయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చివరి దోబూచులాటకు కూడా తెరపడింది. బాండ్లు ఖరీదు చేసినవారి జాబితా, బాండ్లు పొందిన పార్టీల జాబితా వేర్వేరుగా ఇచ్చి చేతులు దులుపుకుందామని చూసిన ఎస్‌బిఐకి, ఏ బాండ్లు ఏ పార్టీలు సొమ్ము చేసుకున్నాయో తెలిపే లింకు వివరాలను కూడా ఇవ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం నాడు స్పష్టం చేసింది. 2018లో ప్రవేశపెట్టిన బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలు అందించే పద్ధతిని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గత నెల 15వ తేదీన కొట్టివేసింది. ఇప్పటి దాకా వివిధ పార్టీలకు అందిన బాండ్ల వివరాలన్నిటిని మార్చి 6 నాటికి భారత ఎన్నికల కమిషన్‌కు అందించాలని ఆదేశించింది. సుమారు ఇరవైరోజుల పాటు కాలయాపన చేసి, రెండు రోజుల ముందు మూడు నెలల గడువు కావాలని స్టేట్ బ్యాంకు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మార్చి పదకొండో తేదీన సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను తోసిపుచ్చి, మరునాడే వివరాలను సమర్పించాలని, ఎన్నికల కమిషన్ 15వ తేదీలోగా వాటిని బహిరంగ పరచాలని ఆదేశించింది. పన్నెండునాడు వివరాలను అందుకున్న ఎన్నికల సంఘం గడువుకు ఒకరోజు ముందుగానే వెబ్‌సైట్‌లో ప్రచురించింది కానీ, అందులో కీలకమయిన లింకు వివరాలు లేవు.

ఈ మొత్తం వ్యవహారంలో స్టేట్ బ్యాంకు వ్యవహారసరళి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎటువంటి ఒత్తిడులూ లేకుండా తనంతట తనే అత్యున్నత న్యాయస్థానంతో బ్యాంకు చెలగాటమాడుతుందని అనుకోలేము. చివరి దాకా, ప్రజలకు చేరవలసిన సమాచారాన్ని నిరోధించడానికే ప్రయత్నం జరిగింది. మొత్తంగా బాండ్ల రూపంలో ఎంత సొమ్ము సమీకృతమయింది స్పష్టంగానే ఉంది. ఏ యే పార్టీలు ఎంతెంత సొమ్ముచేసుకున్నాయి, స్థూలంగా ఒక అంచనాకు రావడం కష్టమేమీ కాదు. బాండ్ల వివరాలు రాక ముందే, కొన్ని వార్తాసంస్థలు డేటాను ఎట్లా అర్థం చేసుకోవచ్చో సూచనలు చేశాయి. ఎంతగా మభ్యపెడదామనుకున్నా, దాచిపెడదామనుకున్నా, కార్పొరేట్ రంగానికి రాజకీయ రంగానికి మధ్య ఉన్న ధనానుబంధం బట్ట బయలయింది, లింకు వివరాలు కూడా తెలిసిపోయాక, మరెన్నో రహస్యానుబంధాలు, తెరవెనుక వాస్తవాలు బయటకు వస్తాయి. దుర దృష్టవశాత్తూ, జాతీయ మీడియా ఒకవైపు పూర్తిగా ఒరిగి ఉంది కాబట్టి, ఈ అంశాన్ని అప్రధానంగా పరిగణిస్తున్నది. మరోవైపు ప్రజల దృష్టి మళ్లించడానికి ఇతర సంచలనాత్మక పరిణామాలను కూడా కల్పిస్తున్నారు.

ఇంతకూ బాండ్లలో అంతటి తప్పు ఏమున్నది? అసలు ఆ పద్ధతే రాజ్యాంగబద్ధం కాదు అని సుప్రీంకోర్టు అన్నదంటే, అందుకు ప్రధాన కారణం అందులోని దాపరికమే. రహస్యంగా రాజకీయ పార్టీలకు విరాళా లిచ్చే అవకాశం ఇవ్వడం అంటే రాజ్యాంగంలోని 19(1)(ఎ)ని ఉల్లంఘిం చడమేనని, తెలుసుకునే హక్కును ప్రజలకు నిరాకరించడమేనని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. ఏ విలువను కాపాడడానికి ఎన్నికల బాండ్ల పద్ధతిని తప్పని కోర్టు అన్నదో, ఆ విలువను బేఖాతరు చేయడానికి స్టేట్ బ్యాంక్ ద్వారా ప్రయత్నం జరిగింది. ప్రజలకు సమాచార హక్కు నెరవేరకుండా చూడడానికి చివరి నిమిషం దాకా అక్ర మార్కులు పట్టువిడువలేదు.

రాజకీయ పార్టీలకు ప్రజల నుంచి, సంస్థల నుంచి, కంపెనీల నుంచి విరాళాలు అందడంలో తప్పేమీ లేదు. కానీ, రాజకీయ పార్టీలు కానీ, ఆయా వ్యక్తులూ సంస్థలూ కానీ సమాజానికి జవాబుదారీగా ఉండాలి. పరస్పర వాయనాలు ఏమీ ఉండకూడదు. ప్రలోభాలు, అధికార ప్రదర్శనలూ ఉండకూడదు. అధికార పార్టీకి బాండ్ల రూపంలో విరాళం ఇవ్వడానికి ముందుకు రాని కంపెనీల మీద ఆదాయపు పన్ను సంస్థలనో, ఈడీ సీబీఐ వంటి వ్యవస్థలనో ఉసిగొల్పడం ఎటువంటి ధోరణి? కొన్ని కంపెనీల మీద ఐటీదాడులు, ఆ వెనువెంటనే ఆ కంపెనీల ద్వారా బాండ్ల కొనుగోలు జరిగిన ఉదాహరణలను స్వతంత్ర పరిశోధక సంస్థలు చెబుతు న్నాయి. అట్లాగే, ఎన్నికల బాండ్లు పెద్దమొత్తంలో కొనుగోలు చేసిన సంస్థ లకు ఆ తరువాత కొద్దిరోజులకే లాభదాయకమైన విధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకున్న ఉదంతాలు కూడా వారు పేర్కొంటున్నారు. బెదిరింపు, లాలింపు ఈ రెండు పద్ధతుల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేసి రాజకీయ ధనాన్ని పొందడం ఏమి నైతికత? అధి కారంలో ఉన్న పార్టీలు తప్ప ఇటువంటి అవినీతికి ఎవరు పాల్పడగలరు? కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, ఆ అధికార పార్టీ ఎంత బాధ్యతగా ఉండాలి? ధర్మం పేరుతో రాజకీయాలు చేసేవారు, రాజకీయాలలో ధర్మంగా ఉండాలి కదా?

భారత రాజకీయ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి అవమానకరమైన ఈ బాండ్ల వ్యవహారం లోగుట్టు అంతా ప్రజలకు తెలిసిపోవాలి. తెలిసిన తరువాత కూడా ఇది పెద్ద విషయం కాదని భారత సమాజం భావిస్తే, అది సామాజిక విలువల పతనంగా నిర్ధారించుకోవాలి. ఎంత కడిగినా తొలగని మురికిలో కూరుకుపోయామని గ్రహించాలి.

మరోసారి మోదీ ఎందుకో తెలుసా?

లోక్‌సభ ఎన్నికల సమరం వేగం పుంజుకుంటున్న వేళ కేంద్రంలో రెండు దఫాలుగా అధికారాన్ని చెలాయిస్తూ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ 'ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్' నినాదంతో ముందుకు వెళ్తోంది. దేశ విదేశ సర్వే సంస్థలెన్నో కూడా కేంద్రంలో మోదీ సర్కారే తిరిగి అధికారంలోకి వస్తుందని ఘంటాపథంగా చెబుతున్నాయి. అయినా సరే మళ్ళీ బీజేపీ సర్కారే ఎందుకు రావాలి అని ప్రశ్నించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉంది. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ పాలనతో– బీజేపీ ఏలుబడిలో వాజపేయి ప్రభుత్వ పాలనను, 2014 నుంచి పాలిస్తున్న మోదీ ప్రభుత్వ పాలనను పోల్చుకొని తగిన నిర్ణయం తీసుకోవాలి.

కాంగ్రెస్ పాలనలో మన దేశం ఏ విషయంలోనూ స్వయం సమృద్ధి సాధించలేక పోయింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్'ల పేరుతో చేపట్టిన ఉద్యమం సత్ఫలితాలు ఇస్తోందని చెప్పవచ్చు. ఇటీవల ప్రపంచాన్నే కుదుపేసిన కరోనా వైరస్ వ్యాప్తి సందర్భంగా దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో కనీసం పీపీఈ కిట్ కూడా సొంతంగా తయారు చేసుకోలేకపోయిన దుస్థితి. రాబోయే విపత్తును సరిగ్గా అంచనా వేసిన మోదీ ప్రభుత్వం వెంటనే దేశ వైద్య రంగాన్ని ముఖ్యంగా శాస్త్రవేత్తలను అప్రమత్తం చేసి సొంతంగా కరోనా నివారణ వ్యాక్సిన్‌ల తయారీకి చర్యలు చేపట్టింది. వైరస్ వ్యాప్తి చెందకుండా మోదీ స్వయంగా ప్రజలను జాగరూకులను చేసి, స్వల్పకాలంలో 140 కోట్ల మంది దేశ ప్రజలకి ఉచితంగా వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణాలు కాపాడగలిగారు. ఈ కష్ట కాలంలో కూడా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదే శాలకు చెందిన ఫైజర్ లేదా చైనా వాక్సిన్లు వాడాలని ఒత్తిడి చేసి రాజకీయం చేసే ప్రయత్నం చేయడం శోచనీయం.



స్వాతంత్ర్య అనంతరం దేశాన్ని ఇంత ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రధానిని, ఇంత పారదర్శక పాలనను అందిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో గతంలో దేశాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా అలయన్స్ కావాలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రావాలో తేల్చుకోవలసిన అవసరం మాత్రం ప్రతి ఒక్క ఓటరుపై ఉంది.

ప్రజల వైద్య అవసరాలు తీర్చేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో వైద్య ఖర్చుల కోసం రూ.5లక్షల దాకా ఆర్థిక సాయం అందిస్తోంది. కానీ దురదృష్ట వశాత్తు దీనిని రాజకీయ స్వార్థంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో నిరుపేదలు ఎందరో తీవ్రంగా నష్టపోయారు.

రైతుల విషయాన్నే తీసుకుంటే ఒక బస్తా యూరియా తదితర ఎరువుల కోసం రోజుల తరబడి లైన్లో ఎదురు చూస్తూ రైతులు అక్కడే చనిపోయిన సందర్భాలు కాంగ్రెస్ హయాంలో కోకొల్లలు. సమయానికి రుణాలు అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి బయట పడలేక; పండిన పంటకు గిట్టు బాటు ధరలేక; అతివృష్టి, అనావృష్టిలతో నష్టపోయిన పంటకు పరిహారం అందక ఏటా వేలాదిమంది రైతులు ఆత్మహత్య లకు పాల్పడేవారు. మోదీ ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను బ్లాక్ మార్కెట్లోకి పోనీయకుండా నీమ్ కోటెడ్ యూరియా తోపాటు ఇతర ఎరువుల ఉత్పత్తి కూడా పెంచి రైతుల కష్టాలు తీర్చింది. బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు అందుతు న్నాయి. ఫసల్ బీమా యోజన ద్వారా నష్టపోయిన పంటకు పరిహారం కూడా అందుతుంది. అంతేకాకుండా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పేరుతో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.6వేలు రైతులకు పంట సాయం కూడా అందిస్తోంది. దీని ద్వారా 2023–24లో ఏప్రిల్ – జూలై నెలలకుగాను 9,60,05,019 మందికి, ఆగస్ట్–నవంబర్ నెలలకు గాను 9,07,50,086 మంది రైతులకు నగదు రూపంలో పంట సాయం అందింది.

దేశానికి ప్రధానమైన రక్షణ రంగాన్ని తీసుకుంటే గతంలోని కాంగ్రెస్ హయాంలో అప్పటి రక్షణ మంత్రి పార్లమెంట్ సాక్షిగా ఆయుధాల కొనుగోలుకు నిధులులేవని దేశ భద్రతను గాలికొదిలేశారు. దీంతో పాకిస్థాన్ చైనా అండ చూసుకొని భారత్‌లో తీవ్ర వాదాన్ని పెంచిపోషించేది. ఇందిరాగాంధీ హయాంలో జరిగిన యుద్ధంలో భారత్‌కు పట్టుబడిన వేలాది మంది పాకిస్థాన్ సైనికులను ప్రాణాలతో విడిచిపెట్టినా ఆ దేశానికి యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన కొద్దిపాటి భారతీయ సైనికుల్లో కనీసం ఒక్కరిని కూడా భారత ప్రభుత్వం కాపాడలేకపోవడంతో వారంతా పాకిస్థాన్ జైళ్ళలో చిత్రవధలకు గురై ప్రాణాలు కోల్పోయారు. అదే మోదీ హయాంలో పొరపాటున పాకిస్థాన్‌కు చిక్కిన అభినందన్‌ను గంటల వ్యవధిలో పాకిస్థాన్ బేషరతుగా భారత్‌కు అప్పజెప్పడం మోదీ ప్రభుత్వ ఘనత కాక మరేమిటి? యెమెన్, సౌదీ అరేబియా మధ్య, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల్ని సైతం ఆపించి ఆ దేశాల్లోని భారతీయులను సురక్షితంగా తీసుకురాగలిగిన సత్తా నేటి భారత ప్రభుత్వానిది. ఆయుధాలపరంగా చూసినా ఇప్పుడు అత్యాధునిక ఆయుధ సంపత్తితో తులతూగుతుంది.

గతంలో భారత్‌ను లెక్క చేయని, మోదీకి వీసా ఇవ్వబోమని ప్రకటించిన అమెరికా సైతం అదే మోదీని ఘనంగా ఆహ్వానిస్తోంది. ఆ దేశ అధ్యక్షుడు సైతం మోదీ కోసం అప్పటికప్పుడు తన షెడ్యూల్ మార్చుకుంటున్నారంటే అది భారత్ సాధించిన ఘనత కాక మరేమిటి? మోదీ లాంటి నాయకుడు తమ దేశాలకు కూడా కావాలని పాకిస్థాన్ ప్రజలతోపాటు అమెరికన్లు సైతం కోరుకోవడం, ఆస్ట్రేలియా అధ్యక్షుడు బహిరంగ సభలో 'మోదీ ఈజ్ ఎ బాస్' అని ప్రశంసించడం భారతీయులందరికీ గర్వకారణమే.

స్వాతంత్ర్య అనంతరం దేశాన్ని ఇంత ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రధానిని, ఇంత పారదర్శక పాలనను అందిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజీ పడకుండా చెప్పింది చేసి చూపిస్తుందని అయోధ్యలో రామాలయ నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ముస్లిం మహిళల క్షేమం కోసం ట్రిపుల్ తలాక్ రద్దు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేయడం వంటి నిర్ణయాలు నిరూపించాయి. ఈ పరిస్థితుల్లో గతంలో దేశాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా అలయన్స్ కావాలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రావాలో తేల్చుకోవలసిన అవసరం మాత్రం ప్రతి ఒక్క ఓటరుపై ఉంది.

■ శ్యామ్‌సుందర్ వరయోగి
సీనియర్ జర్నలిస్ట్

లోకమంతా గమనిస్తున్న ఎన్నికలు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఒక జాతీయ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి జరిగే ఎన్నికలు ఆదర్శప్రాయంగా ఉండాలి. ఒక ఉమ్మడి జాతీయ లక్ష్యం వెనుక దేశ ప్రజలు అందరినీ సంఘటిత పరిచేలా ఆ ఎన్నికలు ఉండాలి. ప్రజలు తమ ఓట్లను పార్టీ 'ఏ' లేదా పార్టీ 'బి' కి (కొన్నిసార్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ పార్టీలకు) వేయవచ్చుగానీ ఆ ప్రజాస్వామిక పోరులో పాల్గొనడంలో వారందరి లక్ష్యం ఒకటే అయివుండాలి. ఓటింగ్ విషయంలో ప్రజల మధ్య అటువంటి విభజన స్వతస్సిద్ధమైనదీ, ఆరోగ్యకరమైనది అనడంలో సందేహం లేదు. ఆ విభజన, దాని పర్యవసానాలు కలిగించే మనస్తాపాలు శాశ్వతంగా ఉండవు.

భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం (రిపబ్లిక్ ఆఫ్ ఇండియా) తొలి దశకాలలో కొన్ని ఎన్నికల పోటీల్లో సమతూకం స్పష్టంగా లోపించింది. ప్రజాభిప్రాయం పూర్తిగా ఒకే పక్షం వైపు మొగ్గిన ఎన్నికలవి. కోటానుకోట్ల ఓటర్ల మద్దతును అలా కూడట్టుకున్న పార్టీ భారత జాతీయ కాంగ్రెస్. అవును, కాంగ్రెస్ పార్టీ ఒక మహా సంస్థ. అదొక సుసంఘటిత రాజకీయ పక్షం. ఆ పార్టీకి నేతృత్వం వహించిన జవహర్‌లాల్ నెహ్రూ (1889–1964) మహా నాయకుడు మాత్రమే కాదు, మహా మనీషి కూడ. మహోన్నత జాతి నిర్మాత. తిరుగులేని ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ ఒక తిరుగులేని మహా శక్తిగా వెలుగొందింది. దానిని ప్రతిఘటించగల రాజకీయ దీక్షాదక్షతలు ఆనాడు మరే పార్టీకి లేవు. కనుకనే నెహ్రూ సారథ్యంలో మొదటి మూడు సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ జైత్రయాత్ర అప్రతిహతంగా సాగింది.

రెండు సమస్థాయి ప్రత్యర్థి పక్షాల మధ్య మొట్టమొదటి నిజమైన ఎన్నికలు 1977లో జరిగాయి. నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దురాగతాలను యావత్ ప్రజలు ముక్తకంఠంతో నిరసిస్తున్న తరుణంలో జరిగిన ఎన్నికలవి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా భావజాలాలకు అతీతంగా ప్రతిపక్షాలు అన్నిటినీ జనతా పార్టీగా సమైక్య పరిచారు. జనతా పార్టీ ఘన విజయం సాధించింది. అది నిర్ణయాత్మక విజయం. అయితే అది భారతీయులను విడదీసింది. ఉత్తరాది రాష్ట్రాల ఓటర్లు జనతా పార్టీకి ఓటు వేయగా దక్షిణాది రాష్ట్రాల ఓటర్లు అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలబడ్డారు. ఉత్తర భారతావని, దక్షిణ భారతం మధ్య ఈ రాజకీయ విభజన 1977 సార్వత్రిక ఎన్నికలకే పరిమితం కాలేదు. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. దరిమిలా అన్ని సార్వత్రిక ఎన్నికలలోను (కొన్ని మినహాయింపులతో) ఉత్తరాది రాష్ట్రాల వారు ఓటు వేస్తున్న తీరుకు విరుద్ధంగా దక్షిణాది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పరిపాటిగా వస్తోంది. హిందీ భాష మాట్లాడే, హిందీ భాష బాగా తెలిసిన ఉత్తరాది రాష్ట్రాలలో ఈ స్పర్ధ చాలావరకు కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉండేది. బీజేపీ నిదానంగా ఆధిక్యత సాధించింది.

భారతదేశ ఎన్నికలకు సంబంధించిన మరో విశేషాన్ని కూడా ప్రస్తావించి తీరాలి. 1977 అనంతరం జరిగిన ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను సవాల్ చేశాయి. తమిళనాడులో డిఎంకె, అన్నా డిఎంకె, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వైసీపీ, తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర సమితి, కర్ణాటకలో జనతాదళ్ (సెక్యులర్), కేరళలో మార్క్సిస్టుల నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ కాంగ్రెస్‌ను సవాల్ చేసి విజయం సాధించాయి. ప్రాంతీయ పార్టీలతో నిండిన ఈ సమరరంగంలోకి బీజేపీ ప్రవేశించలేక పోయింది. కర్ణాటకలో ప్రాంతీయ పార్టీలతో తలపడినప్పటికీ మిశ్రమ ఫలితాలను మాత్రమే సాధించగలిగింది.

ప్రాంతీయ పార్టీల జైత్రయాత్రలు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ దూరాన్ని మరింతగా పెంచాయి. దక్షిణాది రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీ పట్ల పలు అంశాలలో తీవ్ర అపనమ్మకంతో ఉండేవి. ఈ కారణంగానే అవి, బీజేపీపై హిందీ, హిందూ, హిందుత్వ పార్టీ అనే ముద్రను కాంగ్రెస్ కంటే ఎక్కువగా వేశాయి. దక్షిణాది భాషల సాంస్కృతిక విలక్షణత, అన్ని మతాల వారిపట్ల సమభావం, సంఘ సంస్కర్తల ప్రభావం దక్షిణాది ప్రజలకు తమదైన ప్రత్యేక రాజకీయ పథాన్ని నిర్దేశించాయి. ఆర్థిక వనరుల పంపకంలో వివక్ష, ప్రాంతీయ భాషలపై హిందీ ఆధిపత్యం ఆహార అలవాట్లు, వస్త్ర ధారణ, సాంస్కృతిక విషయాలలో ఏకపక్ష నిర్ణయాలను రుద్దడం, మైనారిటీ మత వర్గాల వారి మనోభావాలను ఉపేక్షించడం మొదలైన కారణాలు బీజేపీ పట్ల ప్రాంతీయ పార్టీల అనుమానాలను మరింతగా బలపరిచాయి. అంతే కాకుండా కేంద్ర–రాష్ట్ర సంబంధాలలో అధికార కేంద్రీకరణకు ప్రాధాన్యమివ్వడం, వివిధ కొత్త చట్టాలను తీసుకురావడం ద్వారా రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని హరించివేయడానికి చేస్తున్న ప్రయత్నాలు కూడా బీజేపీ పట్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజలలోను, ప్రాంతీయ పార్టీలలోను వ్యతిరేకతకు ఎంతైనా దోహదం చేశాయి. ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకోవడానికి, అంతేకాకుండా వాటిని పూర్తిగా రూపుమాపేందుకు కూడా వివిధ చట్టాలను కేంద్రంలోని బీజేపీ పాలకులు ఉపయోగించుకోవడం జరుగుతోంది. తత్ఫలితంగా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ దూరం మరింతగా పెరిగింది. ఈ పరిణామం చాలా శోచనీయమని మరి చెప్పనవసరం లేదు.

కాంగ్రెస్ పట్ల బీజేపీ దృక్పథమేమిటో అందరికీ తెలుసు: కాంగ్రెస్–ముక్త్ భారత్‌ను బీజేపీ కోరుకొంటోంది. ఒక రాజకీయ పార్టీగా కాంగ్రెస్‌కు మనుగడ ఉండని భారత దేశాన్ని నిర్మించాలని బీజేపీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది. సరే, కాంగ్రెసేతర రాజకీయ పక్షాల పట్ల కూడా బీజేపీ వైఖరి అందుకు భిన్నమైనది కాదు సుమా! ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ కొంతకాలం బీజేపీకి మిత్రపక్షంగా ఉంటుంది. అయితే అంతిమంగా ఆ ప్రాంతీయ పార్టీని పూర్తిగా రూపుమాపడమే బీజేపీ అసలు లక్ష్యం. జనతా పార్టీ, అకాలీళ్, ఐఎన్ఎల్‌డి, జనతాదళ్(ఎస్) మొదలైన పార్టీలకు పట్టిన గతే అందుకు నిదర్శనం. ఈశాన్య భారత రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల ప్రత్యేక అస్తిత్వాలను పూర్తిగా తుడిచిపెట్టిన చరిత్ర బీజేపీకే సొంతం. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, వైసీపీ, టీఆర్ఎస్‌లతో బీజేపీ ఒక దశలో చెట్టపట్టాల్ వేసుకుంది. అయితే పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి వరుసగా ఆ పార్టీలను నిర్మూలించడమే బీజేపీ అసలు లక్ష్యం. మహారాష్ట్ర, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, హర్యానాలలో కూడా బీజేపీకి అటువంటి లక్ష్యమే ఉన్నది. కాగా తమిళనాడులో డిఎంకె, అన్నా డిఎంకెలు సకాలంలో మేల్కొన్నాయి. శివసేన, ఎన్‌సిపి, జేజేపీలు మేల్కోవడంలో జాప్యం జరిగింది. కేంద్ర ప్రభుత్వంలో బీజేపీ పాదుకుపోతే తమకు ఎటువంటి గతి పడుతుందో రాష్ట్రీయ లోక్‌దళ్, బిజూ జనతాదళ్, తెలుగు దేశం పార్టీలు కూడా త్వరలోనే తప్పక గ్రహిస్తాయనడంలో సందేహం లేదు.

త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో తమకు 370 సీట్లు ఇవ్వాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోంది. తన ప్రధాన ఎజెండా లక్ష్యాలను మరింత త్వరితంగా సాధించుకునేందుకే లోక్‌సభలో ఆ సంఖ్యా బలానికి బీజేపీ ఆరాటపడుతోంది. అయోధ్య, కాశీలతో దాని వివాదగ్రస్త హిందూత్వ ఉద్యమం నిలిచిపోదు. హిందూ ఆలయాలకు సమీపంలో ఉన్న మరిన్ని మసీదుల విషయంలో కూడా వివాదాలను సృష్టించడం ఖాయం. మరిన్ని నగరాలకు, రోడ్లకు పునః నామకరణం తప్పక జరుగుతుంది. పౌరసత్వ సవరణ చట్టం–2019ని అమలు పరచడానికి మోదీ సర్కార్ ఇప్పటికే పూనుకున్నది. ఇటీవల ఆ చట్ట నిబంధనలను నోటిఫై చేయడంతో పాటు వివిధ చర్యలను చురుగ్గా చేపడుతోంది. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతిని ప్రయోగాత్మకంగా అమలుపరుస్తున్నారు. పార్లమెంటు ఆమోదించిన ఆ చట్టాన్ని ఇతర రాష్ట్రాలలో కూడ ఆ అమలు పరచడానికి మోదీ ప్రభుత్వం వెనుకాడదు. రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' భావనను రాజ్యాంగంలో పొందుపరుస్తారు సమాఖ్య పాలనా విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మరింతగా హరించుకుపోనున్నాయి. అధికారాలు అన్నీ ఒక వ్యక్తి వద్ద కేంద్రీకృతమయ్యే అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థగా భారత ప్రభుత్వం పరిణమించే అవకాశమున్నది.

దురదృష్టవశాత్తు చాలా మంది ప్రజలు మనఃస్ఫూర్తిగా అధికార కేంద్రీకరణను స్వాగతిస్తున్నారు. ఇదొక కఠోర వాస్తవం. కారణమేమిటి? మన కుటుంబ వ్యవహారాలలోను, సామాజిక వ్యవస్థల్లోను, రాజకీయ కార్యకలాపాలలోను నిజమైన ప్రజాస్వామిక విలువలు అంతర్భాగం కాకపోవడమేనని చెప్పి తీరాలి. అభివృద్ధి పేరుతో సంపన్నులు అపరిమితంగా సంపద్వంతులు కావడాన్ని అంగీకరిస్తాము; అయితే ఆర్థిక అంతస్తులో కింది భాగంలో ఉన్న 50 శాతం మంది జాతి మొత్తం సంపదలో కేవలం 3 శాతం వాటాతో, జాతీయ ఆదాయంలో 13 శాతం వాటాతో సంతృప్తి చెందాలని చెప్పుతున్నాము. సామాజిక, సాంస్కృతిక అధీనత, అణచివేత కొనసాగుతున్నాయి. ఆర్థిక అసమానతలు మరింతగా పెచ్చరిల్లనున్నాయి.

పైన ప్రస్తావితమైన అంశాలు భీతి గొలుపుతున్నాయి కదూ. అయితే వ్యక్తులకు, సమాజాలకు స్వాతంత్ర్యం (పేదరికం నిర్మూలనకు, సంఘ నిర్మాణంతో పాటు చర్చించే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, ఇంకా మత, వాక్, పత్రికా స్వాతంత్ర్యాలు), అభివృద్ధిని తప్పక ఖాయం చేసేది సందర్భానుసారంగా ప్రభుత్వాలను మార్చివేయడమే. అదే జాతి వికాసానికి ఏకైక మార్గమని చరిత్ర మనకు ఘంటాపథంగా బోధించింది. ఈ చరిత్ర పాఠాన్ని యూరోపియన్ దేశాలు బాగా గ్రహించాయి. కనుకనే ఆ దేశాల ప్రజలు తరచు తమ ప్రభుత్వాలను ఓటు హక్కు ద్వారా మార్చి వేస్తుంటారు. అమెరికా తన అత్యున్నత కార్యనిర్వాహక అధినేత పదవీ కాలానికి పరిమితులు (టెర్మ్ లిమిట్స్) విధించింది, దక్షిణ అమెరికా ఖండ దేశాలు, ఆఫ్రికా దేశాలు ఆ విలువైన చరిత్ర పాఠాన్ని అర్థం చేసుకోలేదు, నేర్చుకోలేదు. కనుకనే అవి నిరంకుశ ప్రభుత్వాల పాలనలో కునారిల్లుతూ అనేకానేక కష్టాలు, యాతనలు పడుతున్నాయి.. భారత్‌లో మనం చరిత్ర చెప్పిన పాఠాలను నేర్చుకున్నాం కానీ వాటిని మరచి పోయినట్టుగా కనిపిస్తోంది. ఈ చరిత్ర విస్మరణ పర్యవసానాలు ఎలా ఉంటాయి? చైనా, రష్యా, తుర్కియె, ఇరాన్ ఉదాహరణలు మన ముందున్నాయి. చెప్పవచ్చిన దేమిటంటే భారతదేశ 18వ లోక్‌సభ ఎన్నికల కోసం సమస్త ప్రపంచమూ ఎదురు చూస్తోంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



వ్యక్తులకు స్వాతంత్ర్యాన్ని, సమాజాలకు అభివృద్ధిని తప్పక ఖాయం చేసేది సందర్భాను సారంగా ప్రభుత్వాలను మార్చి వేయడమేనని చరిత్ర ఘంటాపథంగా బోధించింది. ఈ చారిత్రక పాఠాన్ని యూరోపియన్ దేశాలు బాగా అర్థం చేసుకున్నాయి. కనుకనే ఆ దేశాల ప్రజలు తరచు తమ ప్రభుత్వాలను ఓటు హక్కు ద్వారా మార్చివేస్తుంటారు. భారత్‌లో మనం ఆ పాఠాన్ని నేర్చుకున్నాం కానీ దానిని మరచిపోయినట్టుగా కనిపిస్తోంది.

వాక్కు కాలుష్యం ప్రమాదకరం!

పాద నఖ విలాపం
విచక్షణ లుప్తమయినపుడు
విద్వేషం వెర్రితలలు వేసినపుడు
నరం లేని నాలుక స్వరం మార్చి
తాటి మట్టలా చెలరేగుతుంది
అయ్యా! ఘనత వహించిన నాయకులారా!
ఎక్కడబడితే అక్కడ
మీరు కవి చౌడప్ప అవతారమెత్తి
తిట్ల పురాణం వల్లిస్తుంటే
ఆ హీన పదఘట్టనల కింద
తెలుగుభాషామతల్లి కూడా నలిగిపోతుంది
మీరు రగిలించే నిందాగ్ని జ్వాలల్లో
శత్రువు కంటే ముందు
చట్టసభలు దగ్ధమవుతున్నాయి
తమ భూరి అభిషంగమ స్తోత్రాల్లో
బహిరంగసభలు తడిసి ముద్దవుతున్నాయి
మీ దూషణ భాషణల్లో
పురుషాహంకారం బుసలుకొడుతుంది
కులాధిపత్యం కన్నెర్ర జేస్తుంది
రెండు బండరాళ్ళ నడుమ
చిన్న గరికపోచ రక్తసిక్తమయినట్లు
మీ బూతు తుఫాన్‌లో చిక్కి
పశుపక్ష్యాదులు కూడా విలవిలలాడుతున్నాయి
మీ రాజకీయ శత్రువు నాతో సాటిరాదని
తమరు సగర్వంగా సెలవిచ్చినపుడు
ఈ చరాచర సృష్టిలో శత్రుదూషణ కోసం
ఉపమానంగా నేనే దొరికానా? అని
బోరున విలపించాను
ప్రత్యర్థులను విమర్శించడమంటే
నిందల నిఘంటువులను పఠించడం కాదు..
విషయ దిశను మరచి, వాగ్బాణాలు
చివాట్ల చీకటిలోకి దూసుకుపోతే
రేపటి తరం మాటతీరు కలుషితమవుతుంది..
వాయు కాలుష్యం కంటే
వాక్కు కాలుష్యం ప్రమాదకరం
యథా నాయకా.. తథా ప్రజా...

– కోయి కోటేశ్వరరావు

వందరోజుల గందరగోళం

తొలి అడుగులు ఎలా పడ్డాయో గమనిస్తే, ఆ ప్రయాణం గమ్యం దిశగా సాగుతున్నదా? లేదా? చెప్పేయవచ్చు. పడేవి తప్పటడుగులు అయితే, నేర్చుకుంటారని అర్థం చేసుకోవచ్చు. కానీ తప్పుడు అడుగులు వేస్తే మాత్రం భవిష్యత్ అగమ్య గోచరమే అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుతీరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వేసిన తొలి అడుగులు నిశితంగా గమనిస్తే వారి దారి ఎటు పోతున్నదో అర్థం అవుతున్నది. పాలనలో వారి దృక్పథాన్ని, ప్రజా సమస్యల పరిష్కారంలో వారి వైఖరిని, రాష్ట్ర అభివృద్ధి కోసం వారి ప్రణాళికల్ని, ప్రజా సంక్షేమంలో వారి చిత్తశుద్ధిని మొదటి వంద రోజుల్లో తీసుకున్న నిర్ణయాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. ప్రచార ఆర్భాటం, హడావుడి నిర్ణయాలు, ఆగమాగపు మాటలు, తీరూ తెన్నూ లేని విధానాలతో వంద రోజుల పాలన గందరగోళంగా మారింది.

కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, వ్యవసాయ రంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎక్కువ నిధులు ఖర్చు చేసింది. సమాజంలో సగభాగం ఉన్న మహిళల అభ్యున్నతి, స్వయం సమృద్ధి, భద్రత విషయంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక దృష్టి పెట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ మూడు వర్గాల అభ్యున్నతి కోసం జరుగుతున్న కృషిని కొనసాగిస్తుందనే మేము ఆశించాము. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు కానీ, వారు విడుదల చేసిన మానిఫెస్టో గానీ ఈ మూడు వర్గాలకు మేలు చేస్తామనే హామీల తోనే నిండింది. కానీ దురదృష్టవశాత్తూ మొదటి వంద రోజుల్లో ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఈ మూడు వర్గాలను తీవ్ర నిరాశ పరిచాయి. ప్రభుత్వ ప్రాధాన్యాల్లో మహిళలు, రైతులు, పేదలు లేక పోవడం విస్మయానికి గురిచేసింది.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో మొట్టమొదటి హామీ మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందచేయడం. ఈ మొదటి హామీనే ప్రభుత్వం పూర్తిగా ఉపేక్షిస్తున్నట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటింది. నెలకు రూ.2,500 చొప్పున ఒక్కో మహిళకు మొత్తం రూ.7,500 ప్రభుత్వం ఇప్పటికే బకాయి పడింది. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన 90 లక్షల పేద కుటుంబాలున్నాయి. ఒక్కో కుటుంబంలో ఒక్కో మహిళకు ఈ పథకం వర్తింపచేసినా, ఇప్పటి వరకు తెలంగాణలోని మహిళలందరికీ ప్రభుత్వం బకాయి పడిన మొత్తం అక్షరాలా రూ.6,750 కోట్లు. దీనికి ప్రతీ నెలా అదనంగా మరో రూ.2,250 కోట్లు కలుస్తూనే ఉంటాయి. ఈ పథకానికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా ఈ పథకానికి సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదు. అసలు ఈ పథకం అమలు చేస్తారా? లేదా? అనే అనుమానం కలుగుతున్నది. ఈ పథకాన్ని అమలు చేయకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చేసిన అతి పెద్ద మోసంగా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. కల్యాణలక్ష్మి కింద అదనంగా ఒక్కొక్కరికీ తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో చెప్పింది. ఒక్కరికంటే ఒక్కరికి కూడా నేటి వరకు తులం బంగారం ఇవ్వలేదు.

రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ లాంటి పథకాలు తెలంగాణలో వ్యవసాయ దిగుబడులు పెరగడానికి, రైతు సంక్షోభం నుంచి బయటపడి, ఆత్మవిశ్వాసంతో బ్రతకడానికి ఉపయోగ పడ్డాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దానికన్నా చాలా ఎక్కువే తాము రైతుల కోసం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించింది. మేము వస్తే రైతుభరోసా కింద ఎకరానికి రూ.15,000 చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రబీ సీజన్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లే పదివేల చొప్పున అందిస్తున్నారు. అది కూడా ఇంకా అందరికీ అందలేదు. కాంగ్రెస్ పార్టీ పెంచుతామన్న రైతుభరోసా సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఒక సీజన్‌కు ఎకరానికి 5వేల చొప్పున అదనంగా ఇస్తామన్న డబ్బులు ఇంకా ఇయ్యలేదు. రాష్ట్రంలో 58.33 లక్షల మంది రైతులకు చెందిన కోటి 43 లక్షల ఎకరాలకు బీఆర్ఎస్ పదివేల చొప్పున పెట్టుబడి సాయం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం 5 వేలు పెంచుతామని ప్రకటించింది. ఇప్పటికే ఎకరానికి 5 వేల చొప్పున మొత్తం రూ.7,250 కోట్లు రైతులకు ప్రభుత్వం బకాయి పడింది. ఈ బకాయి చెల్లించడంతో పాటు వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి మొత్తం 58.33 లక్షల మంది రైతులకు పెంచిన సాయం అందించాల్సి ఉంది. ఈ విషయంలో కూడా ప్రభుత్వం నేటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే, ఒకేసారి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని, 2023 డిసెంబర్ 9న సోనియాగాంధి జన్మదినం రోజే రుణమాఫీ జరుగుతుందని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు రుణమాఫీ జరగలేదు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి రెండు లక్షల వరకు అప్పులు తీసుకున్న రైతులపై వడ్డీ భారం పెరుగుతున్నది. చేస్తామన్న 2 లక్షల రుణమాఫీతో పాటు, జరిగిన జాప్యం వల్ల పడిన వడ్డీని కూడా ప్రభుత్వమే భరించాల్సి ఉంది. ఆలస్యం అయిన కొద్దీ ఈ భారం మరింత పెరుగుతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో అంత వేగంగా స్పందిస్తున్నట్లు కనిపించడం లేదు. రైతులతో పాటు కౌలురైతులకు కూడా ఎకరానికి రూ.15వేల చొప్పున రైతుభరోసా సాయం ఇస్తామని చెప్పారు. అది కూడా అమలుకావడం లేదు. వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి 12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. కానీ దానికి సంబంధించి కూడా నేటి వరకు విధివిధానాలే రూపొందించలేదు. వరిధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పండిన పంట మార్కెట్‌కు వచ్చింది. కానీ ఎక్కడా ఒక క్వింటాలుకు కూడా బోనస్ ఇచ్చిన దాఖలాలు లేవు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు నాలుగు ప్రధాన హామీలిచ్చింది. 2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరానికి 15,000, వరి ధాన్యానికి 500 బోనస్, వ్యవసాయ కూలీలకు 12వేల సాయం. ఈ నాలుగు హామీల్లో కనీసం ఒక్కటి కూడ అమలు చేయలేదు. రైతులకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేస్తారా? లేదా? అనే విషయంపై అనుమానాలున్నాయి. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వ్యవసాయదారుల నుంచి తిరుగుబాటు ఎదుర్కోక తప్పదు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంత ఖర్చయినా వెనుకాడకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసింది. ఎక్కడా ఒక ఎకరం కూడా ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నది. కానీ కాంగ్రెస్ పార్టీ వచ్చిన మొదటి వంద రోజుల్లోనే రైతులు మళ్లీ కరెంటు కష్టాలు, సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తున్నది. కరెంటు లేక, బోర్లు పోయక పంటలను తగులబెట్టుకోవాల్సిన పాత రోజులు వస్తున్నాయి. వేల రూపాయల ఆర్థిక భారం వహించి, ట్యాంకర్లతో నీరు తెచ్చి పంటలకు తడి ఇవ్వాల్సిన దుస్థితి వచ్చింది. పంటలు ఎండిపోయి రైతులు మళ్ళీ ఆత్మహత్యలు చేసుకోవాల్సిన ఘోరాలు చూడాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వంద రోజుల్లోనే 178 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సి రావడం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లపరుస్తున్నది. అర్థరాత్రి కరెంటు పెట్టబోయి షాక్‌కు గురై మరణించే దుర్ఘటనలు పునరావృతమవుతున్నాయి. తెలంగాణ తెచ్చుకున్న తర్వాత రైతాంగం మోములో చూసిన సంతృప్తి, సంతోషం క్రమేణా తొలగిపోతుండడం బాధాకరమైన విషయం.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు రెండుసార్లు పి.ఆర్‌.సి. ఇచ్చి వారికి గౌరవప్రదమైన వేతనాలు ఇచ్చింది. కాంగ్రెస్ వస్తే అంతకన్నా గొప్పగా ప్రభుత్వ ఉద్యోగులను చూసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రే స్వయంగా వారిని పిలిచి మాట్లాడారు. కానీ నాలుగు డీఏలు పెండింగులో ఉంటే, వాటిని మాత్రం క్లియర్ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం అలవాటే. 2004, 2009 మానిఫెస్టోల్లో కూడా ఇదే విధంగా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించింది. ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు చెప్పాము. ఇప్పుడు కూడా చరిత్ర పునరావృతం అవుతున్నది. 2023లో ఇచ్చిన హామీలను కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కుతున్నది.

మార్పు అంటే మళ్లీ చీకటి రోజులా? మార్పు అంటే మళ్లీ ఎమర్జెన్సీ రోజులా? మార్పు అంటే మళ్లీ అరాచకమా? మార్పు అంటే పథకాలకు పేర్లు మార్చడమా? ప్రజల జీవితాల్లో మార్పు తేవడమా? తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. అధికారం అప్పగించడమంటే అరాచకానికి హక్కులు ఇచ్చినట్లు కాదు. ఎంత గొప్పగా ఆదరించారో, అంతే గట్టిగా తిప్పికొట్టగలరు కూడా. ఇది పాలకులు అర్థం చేసుకోవాలి.

• తన్నీరు హరీశ్‌రావు
మాజీ మంత్రి, శాసనసభ్యులు, సిద్దిపేట

మొత్తంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు నాలుగు ప్రధాన హామీలిచ్చింది. 2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరానికి రూ.15,000, వరి ధాన్యానికి రూ.500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయం. ఈ నాలుగు హామీల్లో కనీసం ఒక్కటి కూడ అమలు చేయలేదు. రైతులకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేస్తారా? లేదా? అనే విషయంపై అనుమానాలున్నాయి. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వ్యవసాయదారుల నుంచి తిరుగుబాటు ఎదుర్కోక తప్పదు.





అభివాదం చేస్తున్న మోదీ



ప్రధాని రాకకోసం ఎదురుచూస్తున్న ప్రజలు

ప్రధాని రోడ్‌షో..
బీజేపీ శ్రేణుల్లో జోష్

ఎన్నికల శంఖారావం పూరించిన మోదీ..



రాజ్‌భవన్‌లో ప్రధానమంత్రి మోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ తమిళి సై సౌందరరాజన్

హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్, చిలకలగూడ, అల్వాల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని రోడ్డుషోతో నగరంలో బీజేపీ ఎన్నికల శంఖారావం పూరించింది. రోడ్డు షో విజయవంతం కావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ పెరిగింది. నాలుగు రోజుల క్రితమే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వచ్చి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఆ వెంటనే ప్రధాని మోదీ రావడం 50 నిమిషాల పాటు రోడ్డు షో చేసి కార్యకర్తల్లో ఉత్తేజం నింపడం.. ఎన్నికల వేళ కమలదళానికి ఉత్సాహం నింపింది. రోడ్ షోలో ప్రధాని నరేంద్ర మోదీ కాషాయ రంగు క్యాప్‌ను ధరించి చిరునవ్వుతో చేతులు ఊపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రసూల్‌పురా జంక్షన్, సీటీవో చౌరస్తా, వైఎంసీఏ జంక్షన్, సంగీత్ చౌరస్తా, ఆలుగడ్డబావి, మెట్టుగూడ చౌరస్తాల వద్ద జనం ఉత్సాహంగా ప్రధాని కోసం ఎదురుచూశారు. మోదీ కాన్వాయ్ చూడగానే ఉత్సాహంతో, మోదీకి వందలాది మంది చేతులు ఊపుతూ తమ అభిమానాన్ని

మిగతా 8వ పేజీలో..





రోడ్ షోకు హాజరైన ప్రజలు

ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు 7



కవిత ఇంటి ముందు హడావుడి

బీఆర్ఎస్‌కు గడ్డుకాలం!

కాంగ్రెస్,బీజేపీ వైపు నేతల చూపు

● కవిత అరెస్ట్‌తో మరో షాక్

గ్రేటర్‌లో బీఆర్ఎస్ గడ్డుకాలం ఎదుర్కొంటోంది. పార్లమెంటు ఎన్నికల వేళ పార్టీకి చెందిన కీలక నేతలు అధికార కాంగ్రెస్, బీజేపీవైపు చూస్తున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్, పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లగా.. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీకి టచ్‌లోకి వెళ్లారు. వీరి బాటలో మరికొందరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేయడంతో మరోషాక్ తగిలింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒకరోజు ముందు జరిగిన అనూహ్యపరిణామంతో బీఆర్ఎస్ నేతలు కంగుతిన్నారు. ఈ పరిణామాలన్నీ పార్టీని తీవ్ర కలవర పెడుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రేటర్‌లోని పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ఒక్క సీటు కూడా దక్కించుకోని కాంగ్రెస్ లోక్‌సభ స్థానాలను దక్కించుకోవడానికి పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా పార్టీలో చేరేందుకు ఆసక్తి ఉన్న ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కీలక నేతలను చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

అభివృద్ధి కోసమేనా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆ పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ వారిని మర్యాదపూర్వకంగా కలిసే వరకే సీఎం పరిమితం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటే గతంలో బీఆర్ఎస్ అవలంబించిన విధానాన్ని అనుసరించినట్లవుతుందని చేరికలకు చెక్ పెట్టారు. గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్‌లో కీలకంగా ఉండి నగర తొలి మేయర్‌గా వ్యవహరించిన బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్నా, తమ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలన్నా అధికార పార్టీలో ఉండడమే ఉత్తమని పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు భావిస్తున్నారు. అందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, లేదంటే ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్ర నేతలను కలుస్తున్నారు.

సీఎంతో టచ్‌లోకి వెళ్లిన నేతలు

సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కలిశారు. ఇటీవల ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సీఎంను మరోసారి ప్రత్యేకంగా కలుస్తానంటూ సభా వేదిక ద్వారా ప్రకటించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే.శివ కుమార్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. ఇలా పలువురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో

మిగతా 8వ పేజీలో..

రాజకీయ కక్షతోనే అరెస్ట్

ఎమ్మెల్సీ కవితను రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కోర్టులో కేసు ఉన్నప్పటికీ నిబంధనలు పాటించకుండా అరెస్ట్ చేయడం సరికాదని ఓ ప్రకటనలో తెలిపారు.

Shaan-e Ramazan
షాన్-ఎ రమజాన్

ఇఫ్తార్: 6:32
(శనివారం సాయంత్రం)
సహర్: 5:01
(ఆదివారం ఉదయం)

రూ. 7కోట్లు కొల్లగొట్టారు..

● రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసం
● ఆకర్షణీయ లాభాలంటూ నమ్మించారు.. ● ఇద్దరి అరెస్ట్

7

అదనపు అంతస్తుకు రూ.1.20 కోట్లు

● డిమాండ్ చేసిన విలేకరి, సెక్షన్ ఆఫీసర్
● పోలీసులను ఆశ్రయించిన నిర్మాణదారుడు.. ఇద్దరి అరెస్టు



రంజాన్ మాసపు తొలి శుక్రవారం సందర్భంగా మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తెల్లవారుజామున 4 గంటల వరకు షాపులకు అనుమతి

బర్కత్‌పుర/రవీంద్రభారతి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల వరకు హోటల్స్, షాపులకు అనుమతి ఇస్తున్నట్లు మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఈ నిర్ణయం తీసుకున్నామని, దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయనున్నదని తెలిపారు. ముస్లింలు షాపింగ్ చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.



నగరానికి తలైవా

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తలైవా అని తమిళులు ముద్దుగా పిలుచుకునే సూపర్‌స్టార్ రజనీకాంత్ శుక్రవారం నగరానికి వచ్చారు. ఉప్పల్ డిపోలో ఎల్అండ్‌టీ మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)ని ఆయన సందర్శించారు.



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

తహసీల్దార్‌పై కబ్జాదారుల దురుసు ప్రవర్తన

● జూబ్లీహిల్స్‌లో రూ.30కోట్ల విలువైన స్థలం కబ్జా 8

బంజారాహిల్స్‌లో మరో స్థలం..

ఎస్ఐబీలో ఏకచ్ఛత్రాధిపత్యం

● ఎనిమిదేళ్లుగా తిష్టవేసిన ప్రణీత్‌రావు
● ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ అయ్యే వరకు అక్కడే
● అప్పటి ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా విధులు..
● చెప్పిన పని చెప్పినట్లు చేసిన ప్రణీత్‌రావు
● ప్రభుత్వం మారడంతో కుట్రకోణం వెలుగులోకి
● రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు



హైదరాబాద్ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)లో ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు.. గత ఎనిమిదేళ్లుగా ఒకేచోట తిష్టవేసినట్లు విచారణాధికారులు వెల్లడించారు. అప్పటి ప్రభుత్వ పెద్దల అండతో 2016లో ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్‌గా చేరిన ప్రణీత్‌రావు పై అధికారులు, కొంతమంది ప్రజా ప్రతినిధులకు నమ్మిన బంటుగా వ్యవహరిస్తూ ఏకచ్ఛత్రాధిపత్యం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రణీత్‌రావు రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు పొందుపరిచారు. ఫోన్‌ట్యాపింగ్ మాత్రమే కాకుండా.. నమ్మక ద్రోహం, అధికార దుర్వినియోగం, ఆధారాలు మాయం చేయడం వంటి మూడు ప్రధాన నేరాలకు పాల్పడినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు.

ఎస్ఐబీ అడిషనల్ ఎస్పీ డి. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ కుమార్ అలియాస్ ప్రణీత్‌రావుపై పంజాగుట్ట పోలీసులు ఇటీవల పలు కేసులు నమోదు చేశారు. ప్రణీత్‌రావు 2016లో ఎస్ఐబీ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా చేరి 2023లో అగ్జిలరేటరీ పద్ధతిలో డీఎస్పీగా పదోన్నతి పొందేంత వరకు అక్కడే తిష్టవేసినట్లు గుర్తించారు. ఎస్ఐబీలో రెండు గదులను ప్రత్యేకంగా కేటాయించుకొని వాటిలో 17 కంప్యూటర్‌లను ఏర్పాటు చేశాడు. ఫోన్ ట్యాపింగ్ నిర్వహించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి అధికారులకు అందజేసేవాడు. అంతేకాకుండా ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తన సొంత హార్డ్ డిస్కుల్లో కాపీ చేసుకునే వాడు. గతేడాది డిసెంబర్-3న ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత గత ప్రభుత్వం ఓటమి పాలవడంతో హుటాహుటిన 2023 డిసెంబర్ 4న ప్రణీత్ కుమార్ సీసీటీవీ

మిగతా 7వ పేజీలో..

పోలీసుల వద్ద ట్యాపింగ్ ఫోన్‌నంబర్‌ల జాబితా..

ఇదిలా ఉండగా.. ప్రణీత్‌రావు ట్యాపింగ్ చేసిన వందలాది ఫోన్ నంబర్ల జాబితాను పోలీసులు ఇప్పటికే బయటకు తీసినట్లు తెలిసింది. అయితే వాటిలో ఎంతమంది ప్రజా ప్రతినిధుల నంబర్లు ఉన్నాయి..? ఉన్నతాధికారులు ఎంతమంది..? మీడియా సంస్థల (ప్రతినిధులు) ఫోన్ నంబర్లు ఎన్ని..? వ్యాపారస్తులు, ప్రైవేట్ వ్యక్తులు ఎంతమంది.? అనేది విశదీకరించే పనిలో ప్రత్యేక టీమ్ నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అప్పటి ఎస్ఐబీ ఉన్నతాధికారులు పోషించిన పాత్రపైనా పోలీసులు సమాచారాన్ని రాబట్టారు. ప్రణీత్‌రావును మరోసారి పోలీస్ కస్టడీకి తీసుకొని మరింత లోతుగా విచారించి మిగిలిన అధికారుల పాత్రపైనా ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ కుట్రకోణంలో పోలీసులు వారిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారిలో ఒక ఉన్నతాధికారి ఇప్పటికే విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు.. మిగిలిన వారి కదలికలపై దృష్టి సారించినట్లు సమాచారం.

రోడ్లు ఊడ్చే వాహనంలో మంటలు


వాహనంలో చెలరేగుతున్న మంటలు

కవాడిగూడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్లు శుభ్రం చేసే జీహెచ్ఎంసీ వాహనంలో అకస్మాత్తుగా మంటలు చేలరేగి వాహనం కాలిపోయింది. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి ఎన్టీఆర్ స్టేడియం, అశోక్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి రోడ్లు శుభ్రం చేసేందుకు వెళ్తున్న జీహెచ్ఎంసీ వాహనంలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. వాహనం కింది నుంచి మంటలు వస్తున్నాయని స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ వాహనం దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికుల సమాచారంతో ముషీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది, దోమలగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రధానరోడ్డుపై వాహనంలో పెద్దఎత్తున మంటలు రావడంతో వాహనదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సుమారు 20 నిమిషాలపాటు వాహనంలో మంటలు రావడంతో ఇందిరాపార్కు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో కొద్దిసేపు ఇందిరాపార్కు చౌరస్తాలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. 'వాహనంలో మంటలు వస్తున్నాయని రోడ్డు పైన ఉన్న స్థానికులు చెప్పడంతో ఆపాను. ప్రాణాలతో బయట పడ్డా' అని డ్రైవర్ షకీల్ అన్నాడు.

రూ. 5 కోట్లతో..

జేఎన్‌టీయూ హాస్టళ్ల ఆధునికీకరణ

● నేడు ప్రారంభించనున్న వీసీ నర్సింహారెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దూరప్రాంతాల నుంచి వచ్చి జేఎన్‌టీయూలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల కోసం రెండు వసతి గృహాలను అధికారులు సిద్ధం చేశారు. ఉద్యోగుల క్వార్టర్స్ ప్రాంగణంలో రూ. 4కోట్లతో పీజీ గరల్స్ హాస్టల్ నిర్మించగా, పాడైపోయిన కృష్ణా (బాలుర) హాస్టల్‌ను సుమారు కోటి రూపాయలతో ఆధునికీకరించారు. శనివారం ఉదయం 9 గంటలకు వసతి గృహాలను వీసీ కట్టా నర్సింహారెడ్డి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. పీజీ గరల్స్ హాస్టల్ నిర్మాణానికి యూనివర్సిటీ నిధులు వినియోగించగా, కృష్ణా హాస్టల్ ఆధునికీకరణకు పూర్వ విద్యార్థుల నుంచి అందిన విరాళాలను ఖర్చు చేసినట్లు తెలిసింది.

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో సైబర్ సెక్యూరిటీ కోర్సు

● వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు

హైదరాబాద్ సిటీ, మార్చి15 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రారంభించనున్నారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు. వచ్చే(2024-25) విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న జగిత్యాల, మంథని, వనపర్తి, పాలేరు, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కళాశాలల్లోనూ సైబర్ సెక్యూరిటీ కోర్సులను ప్రవేశపెట్టాలని వర్సిటీ ఉన్నతాధికారులు భావిస్తున్నప్పటికీ, బోధనా సిబ్బంది కొరత నేపథ్యంలో.. ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో నీటి ఎద్దడి

● నెల రోజులుగా తాగునీటికి ఇబ్బందులు

● ట్యాంకర్లను పెంచాలంటున్న ప్రజలు



రాజేంద్రనగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలోనే రాజేంద్రనగర్ సర్కిలక్ష పరిధిలో నీటిఎద్దడి మొదలైనది. తాగడానికి, స్నానాలకు ఇతరాత్ర అవసరాలకు నెల రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కిల్ పరిధిలో ఎండలకు చాలా వరకు బోర్లు ఎండిపోయాయి. అపార్ట్‌మెంట్‌వాసులు, బస్తీల ప్రజలు, హోటళ్లు, షాపింగ్‌మాల్స్ నిర్వాహకులు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడ్డారు. దాంతో వాటర్ ట్యాంకర్‌లకు డిమాండ్ పెరిగింది. అవి కూడా బుక్ చేసిన రెండు నుంచి మూడు రోజులకు వస్తుండటంతో నీటి ఇబ్బందులు తప్పడంలేదు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో నాలుగు నుంచి ఐదు లక్షల జనాభా ఉంటుంది. చాలా బస్తీలకు మంచినీటి సరఫరా ఉంది. మసీదులు, దేవాలయాలు, శ్మశానవాటికలకు ఉచితంగా ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తుంటారు. అయితే రాజేంద్రనగర్ సర్కిల్‌లోని హనుమాన్‌నగర్, ఉప్పర్‌పల్లి వాంబేకాలనీలకు మాత్రం నేటికి నీటి సరఫరా లేదు.

అత్తాపూర్, హైదర్‌గూడ ప్రజలకు ట్యాంకర్లే ఆధారం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ ప్రాంతాలు చాలా అభివృద్ధి చెందాయి, ఇక్కడ వందల సంఖ్యలో అపార్ట్‌మెంట్‌లు, వ్యాపార సముదాయాలు వెలిశాయి. వేలాది కుటుంబాలు ఆ ప్రాంతాలలో నివాసం ఉంటున్నాయి. అక్కడ నీటి అవసరాలు ఎక్కువే. అయితే బోర్లు ఎండిపోవడంతో చాలా కాలనీలు, అపార్ట్‌మెంట్లవాసులు ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో ఉన్న 8 ట్యాంకర్‌లను 15కు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

బుక్ చేసిన మూడు రోజులకు ట్యాంకర్ వస్తుంది

మంచినీటికోసం ట్యాంకర్ బుక్‌చేస్తే మూడు రోజులకు వస్తుంది. తాగాడనికి స్నానాలకు ఇబ్బందులు తప్పడంలేదు. వేసవి ప్రారంభదశలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో.. ఊహించుకుంటేనే భయం వేస్తుంది. వాటర్ ట్యాంకర్‌లను పెంచాలి. ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

- శ్రీరామ్, హైదర్‌గూడ

రోజూ 8 ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేస్తున్నాం

రాజేంద్రనగర్ డివిజన్‌లో రోజూ 8 ట్యాంకర్ల ద్వారా వినియోగదారులకు నీటిని సరఫరా చేస్తున్నాం. నివాస ప్రాంతాలకు రూ.500, కమర్షియల్ అవసరాలకు రూ.850లకు ట్యాంకర్ పంపుతున్నాం. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 30 ట్రిప్పులను మంచినీటి కనెక్షన్‌లేని హనుమాన్‌నగర్, ఉప్పర్‌పల్లి వాంబే కాలనీలతో పాటు వివిధ ప్రాంతాలకు పంపిస్తుంటాం. ఇక రోజూ 90 నుంచి 100 వరకు వాటర్ ట్యాంకర్ల కోసం బుకింగ్ చేసుకుంటున్నారు. బుక్ చేసుకున్న వారికి రోజూ 50 నుంచి 60 ట్యాంకర్లను పంపిస్తున్నాం. దాంతో బుక్‌చేసుకున్నవే చాలా వరకు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొత్తగా రెండు ట్యాంకర్లను ఇవ్వాలని ఉన్నతాధికారులకు లేఖ రాశాం.

- రాంనర్సింహ్మారెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్, రాజేంద్రనగర్ డివిజన్

ప్రపంచ మానవాళికి రైతు దైవంతో సమానం



మహిళా రైతుతో మాట్లాడుతున్న నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి అహారం అందించే రైతు దైవంతో సమానమని నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల చెప్పారు. రైతాంగం స్థితిగతులను మెరుగుపరిచేందుకు నాబార్డ్ నిరంతరం కృషి చేస్తున్నని ఆమె అన్నారు. మేలైన యాజమాన్యం పద్ధతులు, పంటల వైవిధ్యకరణ, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు, విలువల జోడింపు వంటి పద్ధతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్ని(ఎఫ్‌పీవో) బలోపేతం చేయడంపై నాబార్డు సాయంతో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఒక ప్రాజెక్టు అమలు చేస్తుంది. ఇందులో భాగంగా శుక్రవారం కొనుగోలుదారులు, అమ్మకందారుల మొదటి ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చింతల సుశీల మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాతోపాటు వారి ఆహార అలవాట్లు మారుతున్నాయని, అందుకు తగ్గట్లుగా రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందు కెళ్లాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా మారాలన్నారు. ఎఫ్‌పీవోల విషయంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి తోడ్పాటునందించే విషయాన్ని పరిశీలిస్తామని చింతల సుశీల ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఎఫ్‌పీవోల పాత్ర మరింత అధికమవుతున్నదని వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.సుధారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభించినదని అన్నారు. రైతులు బలోపేతం అయితేనే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ అన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులుండాలన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, ఈఈఐ డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. నాబార్డ్ సహాయంతో నిర్వహిస్తున్న ప్రాజెక్టు గురించి ప్రొఫెసర్ మధుబాబు వివరించారు. కార్యక్రమంలో ఎవర్‌గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి ప్రసాదరావు పాశం, డాక్టర్ రవీందర్ నాయక్, మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, ఎఫ్‌పీవోలు, రైతులు, మహిళా రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐబీలో ఏకచ్ఛత్రాధిపత్యం

(5వ పేజీ తరువాయి)

కెమెరాలను ఆపివేసి, ఏళ్ల తరబడి హార్డ్ డిస్క్‌లో ఉన్న డాటాను ధ్వంసం చేసి, వాటిస్థానంలో కొత్తహార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. పోలీసులు ప్రణీత్ కుమార్‌పై పలుసెక్షన్‌లతోపాటు ఐటీ యాక్ట్‌లు ప్రయోగించి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్‌బీ వర్టికల్ విభాగానికి బదిలీ అయిన ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ బి.శోభన్, ఎస్ఐ పి.ప్రదీప్ బృందం ఈనెల 12న రాత్రి 10:30కు అరెస్టుచేసి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రణీత్‌రావు నుంచి పోలీసులు ఒక లాప్‌టాప్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అప్పటికే సేకరించి పెట్టుకున్న సమాచారంతో ప్రశ్నించగా, ప్రణీత్‌రావు నేరాన్ని అంగీకరించాడు.

అనంతరం ఆస్పత్రికి తరలించి కొవిడ్‌తోపాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రణీత్‌రావు కేసు విచారణ అధికారిగా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి అప్పగించారు. కాగా.. ఆయన టీమ్‌లో ఇన్‌స్పెక్టర్లు శోభన్, వెంకటేశ్వర్‌రెడ్డి, కె.ఎం రాఘవేంద్ర, శ్రీనివాసులు ఉన్నట్లు వెల్లడించారు.

ఆయిల్ గోదాంలో అగ్నిప్రమాదం

● పేలిన ఆయిల్ ట్యాంకర్లు

కార్వాన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో చేలరేగిన మంటలతో టోలిచౌకిలోని సాలార్‌జంగ్ కాలనీలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. హుమాయూన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాలార్‌జంగ్‌కాలనీకి చెందిన రత్నారావు కొంతకాలంగా ఆర్టీఏ ఆఫీస్ ఎదురుగా ఆయిల్ గోదాం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆయిల్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చేలరేగాయి. మంటలకు ఆయిల్ ట్యాంకర్లు పేలడంతో పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. ఆయిల్ గోదాం సమీపంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రమాదం తీవ్రత పెరుగుతుందని స్థానికులు భయంతో పరుగులు తీశారు. గోదాం దగ్గర పిస్తాహౌస్, షా గౌస్ ఉండటం.. రంజాన్ కావడంతో స్థానికులు పెద్దసంఖ్యలో అక్కడకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఐదు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆస్పత్రులపై డీసీఏ అధికారుల దాడి

● అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 13 లక్షల మందులు స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న డీసీఏ అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఔషధాలను నిల్వ చేసిన వరంగల్ జిల్లా భూపాల్‌పల్లి, నగరంలోని బండ్లగూడలోని ఆస్పత్రులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ)అధికారులు దాడిచేసి రూ.13 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోదాలు నిర్వహించి పెద్ద మొత్తంలో నిల్వ చేసిన ఫిజిసిషన్ శాంపిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 11.83 లక్షలు ఉంటుందని భూపాలపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. బండ్లగూడ, ముత్తుజాబాగ్‌లోని షిఫా ఆస్పత్రిలో నిల్వచేసిన రూ.1.20లక్షల మందులను సీజ్ చేశారు. ఆస్పత్రి యాజమాన్యాలు అనుమతి లేకుండా మందులు నిల్వ చేశారని, సీజ్ చేసి కేసులు నమోదు చేశామని హైదరాబాద్ డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి తెలిపారు.

అదనపు అంతస్తుకు రూ.1.20 కోట్లు

● డిమాండ్ చేసిన విలేకరి, సెక్షన్ ఆఫీసర్ ● ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అదనపు అంతస్తు నిర్మించుకునేందుకు ఏకంగా రూ.1.20 కోట్లను ఓ విలేకరి, జీహెచ్‌ఎంసీ సెక్షన్ ఆఫీసర్ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని అదనపు అంతస్తు నిర్మాణాన్ని కూడా నిర్మాణదారుడు విరమించుకున్నాడు. అయితే, వేధింపులు ఆగలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు.10లో ప్రసాద్ భవన నిర్మాణం చేపట్టాడు. ఆయనకు రెండు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంది. నిబంధనలు అతిక్రమించి మూడో అంతస్తునిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇదిలా ఉండగా, నిర్మాణదారుడి నుంచి డబ్బు లాగేందుకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి విశాల్, విలేకరి ఆకుల కిరణ్‌గౌడ్ పథకం వేశారు. సెక్షన్ ఆఫీసర్ విశాల్ కొద్ది రోజుల క్రితం నిర్మాణదారుడు ప్రసాద్ వద్దకు వెళ్లి భవనంపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పాడు. ఫిర్యాదుదారుడైన కిరణ్‌గౌడ్‌తో మాట్లాడుకోవాలని సూచించాడు. ప్రసాద్ ఒప్పుకొని కిరణ్‌కు ఫోన్ చేశాడు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని చెప్పిన కిరణ్, అదనపు అంతస్తు నిర్మించుకోవాలంటే జీహెచ్‌ఎంసీ, మీడియాకు కలిసి రూ.1.20 కోట్లు ఇవ్వాలని అడిగాడు. దీనికి ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగాడు. అనంతరం అదనపు అంతస్తు నిర్మాణం ఆలోచనను విరమించుకున్నాడు. కిరణ్ వేధింపులు ఆగలేదు. ప్రతీ రోజు ఫోన్ చేసి డబ్బు ఎప్పుడు ఇస్తారు అంటూ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో నిర్మాణదారుడు పశ్చిమ మండలం డీసీపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచన మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కిరణ్ డబ్బు అడిగినట్లు ఆడియో టేపులతోపాటు ఇతర ఆధారాలు అందజేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్ గౌడ్ తోపాటు విశాల్‌ను అరెస్టు చేశారు. సెక్షన్ 384, 506, 120బి ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్‌గౌడ్ గతంలో భవన నిర్మాణదారుల వద్ద డబ్బు డిమాండ్ చేసిన కేసులు అనేకం ఉన్నాయని తేలింది. ఓ నిర్మాణదారుడి వద్ద డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బంజారాహిల్స్‌తో పాటు మరో పోలీసుస్టేషన్‌లో కూడా కిరణ్‌గౌడ్‌పై కేసులు ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది.

రూ. 7కోట్లు కొల్లగొట్టారు..

● రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసం ● ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసాలకు పాల్పడి రూ. 7కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన తవిడ్మనీడి వెంకటప్రసాద్ కొర్రపాటి వెంకటరత్నం, వెంకట చిరంజీవి, విఠల్‌రెడ్డి తదితరులు కలిసి జేజే ఇండియా ఇన్‌ఫ్రా ప్రై.లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. దానికి తమ్మిడి వెంకటప్రసాద్ ఎండీగా, వెంకటరత్నం మార్కెటింగ్ ఏజెంటుగా ఉన్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించారు.

మహేశ్వరం, గచ్చిబౌలి, ఆమనగల్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వెంచర్స్, వ్యవసాయ భూములు ఉన్నాయని చూపించారు. సరిగ్గా మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తవుతాయని నమ్మించారు. ముందుగా పెట్టుబడి పెట్టినవారికి వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రూ. 10వేలకు ఎస్ఎఫ్‌టీ చొప్పున కేటాయిస్తామని, ఆ తర్వాత ప్రతి నెల ఒక్క ఎస్ఎఫ్‌టీకి రూ. 100ల చొప్పున అద్దె చెల్లిస్తామని అలా 30 నెలల్లోనే పెట్టుబడి డబ్బుకు అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఆకర్షనీయమైన బ్రోచర్లు, పేపర్ ప్రకటనలు ఇచ్చి కస్టమర్స్‌ను ఆకర్షించారు. వారి మాటలు నమ్మి పెట్టుబడుల రూపంలో ఎనిమిది మంది బాధితులు రూ. 3.56కోట్లు డబ్బులు చెల్లించారు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు లాభాలు ఇవ్వడం అటుంచి స్పందించడం మానేశారు. దాంతో బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

డీసీపీ కె. ప్రసాద్, ఏసీపీ ఎస్. రవీందర్ పర్యవేక్షణలో ఈవోడబ్ల్యూ పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితులు తమ్మిడి వెంకట ప్రసాద్, కొర్రపాటి వెంకటరత్నంలను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో సుమారు 15 మంది నుంచి రూ. 7 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. జేజే ఇన్‌ఫ్రాతో పాటు.. తరిణి అవెన్యూ, ఎల్ఎల్‌పీ పేరుతో సంస్థలు ఏర్పాటు చేసి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.



బస్తీలో ప్రజలకు కుష్ఠు లక్షణాలను పరిక్షిస్తున్న వైద్య సిబ్బంది

24 వరకు కుష్ఠు గుర్తింపు కార్యక్రమాలు

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 వరకు కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమం కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 నుంచి కుష్ఠు (లెప్రసీ) కేసుల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం శివరాంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. స్టేట్ లెప్రసీ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ శివరాంపల్లి ప్రాంతాన్ని సందర్శించారు. ముఖం నూనెగా ఉండటం, చెవి తమ్మెలు మందంగా మారడం, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చేతులు, కాళ్లు తిమ్మిర్లు, వేళ్లల్లో పట్టుకోల్పోవడం, కళ్లు సరిగ్గా మూయకపోవడం, అరికాళ్లలో నొప్పిలేని పుండ్లులాంటివన్ని లెప్రసీ లక్షణాలు అని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది రవీందర్‌రెడ్డి, కేఎస్‌కే గౌరీ, భాగ్యలక్ష్మి, అంబిక, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చరిత్రాత్మకం

చాంద్రాయణగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం గౌలిపురా మేకలమండిలో సంఘం ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పట్లోల్ల సంఘమేశ్వర్, గౌరవాధ్యక్షుడు వెన్న ఈశ్వరప్పల పోరాట ఫలితంగా కార్పొరేషన్ ఏర్పడిందని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దు శ్రీశైలం, సలహాదారుడు ఆర్.శివకుమార్, ప్రతినిధులు గంగాధర్, రవికుమార్, నాగరాజు, నవీన్, రాజు, శ్రీశైలం, శేఖర్, రవి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కినప్పుడే కాన్షీరాం కల నేరవేరుతుంది



అంబేడ్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

రాజేంద్రనగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కినప్పుడే కాన్షీరాం కల నెరవేరుతున్నదని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు అన్నారు. కాన్సీరాం కాన్సీరాం 90వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవ కమిటీ ముఖ్య సలహాదారులు వనం నర్సింహ మాదిగ, పి.జీవన్‌దాస్ మాట్లాడుతూ, పేదలు అధికారంలోకి వచ్చినప్పుడే కాన్షీరాం కల నేరవేరుతుందన్నారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్‌కుమార్, పోతురాజు యాదయ్య, అనుమూల జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాకు హెచ్చార్సీ ఏర్పాటు చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ హరినాథ్

చాంద్రాయణగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రతి జిల్లాకు మానవ హక్కుల కమిషన్(హెచ్చార్సీ)ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ గడ్డమీది హరినాథ్ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ సమస్యలపై రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు నగరంలోని మానవ హక్కుల కమిషన్‌కు వస్తున్నారని, తీరా అక్కడ మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్ లేకపోవడం బాధాకరమన్నారు. కమిషన్‌కు చైర్మన్ లేకపోతే ఇక మానవ హక్కుల రక్షణ ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు ఆలోచించి మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్‌ను నియమించాలని ఆయన కోరారు.

శంషాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కన్హా శాంతివనం సందర్శనకు నేడు భారత ఉపరాష్ట్రపతి రానున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామ పరిసరాల్లో నేడు, రేపు రెండు రోజులపాటు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. హైదరాబాద్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గొల్లపల్లి టోల్‌గేట్ వయా పెద్దగోల్కొండ మీదుగా ఇండియన్ బేకరీ(తొండుపల్లి), బుర్జుగడ్డ వద్ద యూటర్న్ తీసుకొని ముచ్చింతల్, మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. అలాగే, గచ్చిబౌలి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను పెద్దగోల్కొండ టోల్‌గేట్, మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రాఫిక్‌తోపాటు పెంజర్ల ఎక్స్‌రోడ్డు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను అమీర్‌పేట్ మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దగోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్, హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పైన తెలిపిన ప్రాంతాల్లోనే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.



మెహిదీపట్నం మాసాబ్‌ట్యాంక్‌లోని రెడ్‌క్రాస్ ప్రభుత్వ హైస్కూల్‌కు వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ నిమిత్తం బేగంపేట్‌కు చెందిన జోసలుకాస్ ప్రతినిధులు రూ.3.50 లక్షల చెక్కును అందజేశారు.

శుక్రవారం ప్రచురితమైన పై కార్యక్రమానికి సంబంధించిన వార్తలో జోసలుకాస్ బదులు వేరే సంస్థ పేరు తప్పుగా ప్రచురితమైనది. పొరపాటుకు చింతిస్తున్నాం.

- ఎడిటర్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ktWjhIF లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మార్చి15(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఆదర్శనగర్ ఫీడర్ పరిధిలోని ఆదర్శనగర్, మంజుబార్, ఆరాంఘర్ పిస్తా హౌజ్, రామయ్య హస్పిటల్స్, కింగ్స్ సరేన్యా, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా రఘు నాయక్



రఘు నాయక్

అఫ్జల్‌గంజ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ విభాగం పార్లమెంట్ నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను నియమించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ రఘునాయక్ రూడావత్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ ఉత్తర్వులు జారీచేశారు. రఘునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఆరు గ్యారెంటీలు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరిం చి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు.

కురుమ, యాదవులకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి



సాయికిరణ్ కురుమ

మదీన, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కురుమ, యాదవ సామాజిక వర్గాలకు వేర్వేరుగా కార్పొరేషన్లు చేయాలని కురమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ సాయి కిరణ్ కురుమ డిమాండ్ చేశారు. రెండు కులాలను కలిపి ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, కురుమలు ప్రస్తుతం 'బీసీ-బీ'లో ఉండగా, యాదవులు 'బీసీ-డీ'లో ఉన్నారన్నారని గుర్తు చేశారు. ఈ రెండు సామాజిక వర్గాలను కలిపి ఒకే కార్పొరేషన్ కింద ఉంచితే భవిష్యత్తులో కురుమలకు తీవ్ర నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కురుమ, యాదవ్ సామాజిక వర్గాలకు వేర్వేరుగా కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వంజరి కులాలకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



వీరేశం

అఫ్జల్‌గంజ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వంజరి కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం కార్యవర్గ సభ్యుడు, గన్నీ మార్చెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే వీరేశం డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ బీసీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ఎంతో వెనుకబాటుకు గురవుతున్న వంజర్లను విస్మరించడం బాధాకరమని ఆయన అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వంజరి కులంలో పేద, మధ్యతరగతి చెందిన వారు అత్యధికంగా ఉన్నారని, వంజరి కులానికి కూడా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వంజరి కులస్థులంతా ఏకతాటిపై వచ్చి భారీ ఎత్తున పోరాటాలు చేస్తామని వీరేశం హెచ్చరించారు.



హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతను సన్మానిస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్

హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం

అఫ్జల్‌గంజ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతను రాష్ట్ర కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాకేశ్ జైశ్వాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శైలేందర్ యాదవ్, నవీన్ బండారి, గౌలీకర్ ధీరజ్‌లాల్ పాల్గొన్నారు.

కొత్త అనుభూతి





ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా ఓ వాణిజ్య సంస్థ నగర శివారులో స్లీప్ కచేరీ పేరిట కారక్రమం నిర్వహించింది. ఈ కచేరీకి హాజరైన వారు సరస్సు దగ్గర మృదువైన లైటింగ్, కలలు కనే పొగమంచుతో ఒక నిర్మలమైన వాతావరణ అనుభూతిని పొందారు.

- నార్సింగ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి

» వంద రోజుల్లో ఐదు గ్యారెంటీలకు శ్రీకారం: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి వచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను దారిలో పెడుతూ లక్ష్యం దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన శక్తినంత కూడగట్టుకుంటూ ఒక్కో అడుగు వేసుకుంటూ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను శరవేగంగా అమలు చేస్తూ వంద రోజుల్లోనే 5గ్యారెంటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

టీజీ సిరీస్‌తో తొలిరోజే 2.51 కోట్ల ఆదాయం

కొత్త కోడ్ టీజీ సిరీస్‌తో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రారంభమయిన తొలిరోజే రవాణాశాఖ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం చేకూరింది. టీజీ సిరీస్ ఫ్యాన్సీ నెంబర్లకు అనూహ్య పోటీ నెలకొనడంతో ఒక్కరోజులో రూ.2,51,86,437 ఆదాయం చేకూరింది. ఇంతకాలం టీఎస్‌గా ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ శుక్రవారం నుంచి టీజీగా మారింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణా కార్యాలయాలో 0001 నుంచి కొత్త సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. 33 చోట్ల మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ ద్వారా టాక్స్ రూపంలో రూ.1,25,11,000, ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనయజమానుల పోటీ ద్వారా అదనంగా రూ.1,26,75,437 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి రూ.51,06,618 ఆదాయం రాగా ఇందులో సాధారణ టాక్స్ రూపంలో రూ.19,64,000, ఫ్యాన్సీ నెంబర్లపై పోటీద్వారా రూ.31,42,618 వచ్చినట్లు అధికారులు వివరించారు.

మంత్రి కోమటిరెడ్డికి హైకోర్టులో ఊరట



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. అయనపై ఉన్న రెండు వేర్వేరు కేసులను కొట్టేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2018లో కొత్తగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయంలోకి తన అనుచరులతో అక్రమంగా ప్రవేశించి.. గొడవ చేశారని పేర్కొంటూ అప్పటి నల్గొండ ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో కోమటిరెడ్డిని దోషిగా గుర్తించిన ప్రజాప్రతినిధుల కోర్టు ఆయనకు రూ.4,200 జరిమానా విధించింది. దీనిపై ఆయన అప్పీల్ చేయగా.. ఎలాంటి ఆధారాలు లేకపోవడం హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఇటు జనరల్ బాడీ మీటింగ్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘించి..అవమానానికి గురిచేశారని పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అప్పటి ఎంపీపీ కొప్పుల కృష్ణయ్య కనగల్ పోలీస్ స్టేషన్‌లో 2014లో ఫిర్యాదు చేశారు. సదరు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోమటిరెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సదరు క్వాష్ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు.. కనగల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేస్తూ తుది తీర్పు జారీ చేసింది.

22 నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 3 నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ మాట్లాడుతూ...ప్రతి నెల ఒకటో తేదీన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఎన్‌హెచ్‌ఎం విధులు బహిష్కరిస్తామన్నారు. ఈనెల 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నో వర్క్, నో పే కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు.

481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభం

అగ్నిమాపక శాఖలో 481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభమైంది. ఫైర్‌మెన్ పోస్టుల భర్తీకి పోలీస్ నియామక బోర్డు నిర్వహించిన పరీక్షలో 534 మంది అర్హత సాధించగా, వారిలో 481 మంది మాత్రమే రిపోర్టు చేశారు. దాంతో ఆ 481 మందికి అగ్నిమాపకశాఖ అకాడమీలో ఏడీజీ నాగిరెడ్డి శిక్షణాతరగతులను ప్రారంభించారు. నాలుగు నెలల శిక్షణ అనంతరం వీరు విధుల్లో పాల్గొంటారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ విధానంలో పలు మార్పులు చేశామని నాగిరెడ్డి తెలిపారు.

సింగరేణిలో 986 ఇంటర్నల్ పోస్టుల భర్తీ

కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా భూగర్భ గనుల్లో పని చేస్తున్న విద్యావంతులైన యువ కార్మికులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేందుకు వీలుగా వివిధ విభాగాల్లో ఏర్పడిన 986 ఖాళీల భర్తీకి సింగరేణి నిర్ణయం తీసుకుంది. దీనికోసం సంస్థలోని ఇన్ సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రెండు ఇంటర్నల్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ పోస్టుల్లో 204 అధికార హోదా పోస్టులు కాగా, 782 టెక్నీషియన్, కార్మిక స్థాయి పోస్టులున్నాయి.

ఆర్ అండ్ బీ ఈఎన్‌సీగా పీ సతీష్

రోడ్లు, భవనాలు(ఆర్ అండ్ బీ) శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)గా పీ సతీష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి 2024 వరకు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన సతీష్ ఇప్పుడు ఈఎన్‌సీగా పదోన్నతి పొందారు. అనేక జిల్లాల్లో పనిచేసిన ఆయన వరుసగా ఏడేళ్ల పాటు బెస్ట్ ఇంజనీర్‌గా అవార్డు అందుకున్నారు.

కార్పొరేట్‌కు విలువలు తాకట్టు పెట్టిన బీజేపీ:ఒవైసీ

నైతిక విలువలను ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ రూ.ఆరువేల కోట్లకు పైగా సేకరించడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మక్కా మసీదులో పవిత్ర రంజాన్ మొదటి శుక్రవారం ప్రార్థనల అనంతరం యౌముల్ ఖురాన్ కార్యక్రమంలో ఒవైసీ ప్రసంగించారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరిట మజ్లిస్ పార్టీ విరాళాలు వసూలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. మోదీ తాను లంచం తీసుకోనని, ఎవ్వరినీ తీసుకోనివ్వనని చెబుతున్నారని, అయితే బాండ్లు ఇస్తే తప్ప ఆయన అసలు లంచాలు తీసుకోరా? అని ఎద్దేవా చేశారు. 2019 నుంచి బీజేపీతో పాటు టీఎంసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ తదితర రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కార్పొరేట్ సంస్థలు, ప్రముఖుల నుంచి రూ.12,769 కోట్లు విరాళాలుగా సేకరించినట్లు ఎస్‌బీఐ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పలు జిల్లాల్లో పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేశాయి. శుక్రవారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 40.9 డిగ్రీలు, నల్గొండ జిల్లా మాడ్గులపల్లి, గద్వాల జిల్లా వాడపల్లి, అలంపూర్‌లతో పాటు నిజామాబాద్‌లో 40.7 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా కీర్తవారిగూడేంలో 40.6 డిగ్రీలు, వనపర్తి జిల్లా కేతేపల్లి, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, ఖమ్మం జిల్లా గుబ్బగుర్తి, సూర్యాపేట జిల్లా అలుగునూర్‌లో 40.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో ప్రొఫెసర్ కోదండరామ్, ఐఏఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈ నెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పరిష్కరించే దిశగా సలహాలు, సూచనలతో నివేదికను అందజేయాలని కమిటీకి ముఖ్యమంత్రి సూచించారు.



రంజాన్ మాసం తొలి శుక్రవారం మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ప్రజల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోంది

● ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్ మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో చట్టాలు చేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టి ముస్లింలను రెచ్చగొడుతోందని, ముస్లింలు సహనంతో ఉండాలని మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం మక్కా మసీదులో ఏర్పాటు చేసిన జల్సే యౌముల్ ఖురాన్ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ముస్లిం రంజాన్ మాసంలో తప్పకుండా ఉపవాస దీక్ష చేయాలని, దాన ధర్మాలు చేస్తూ రోజా పవిత్రతను కాడాలని పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త బోధనలు, మార్గాన్ని అనుసరించాలన్నారు. యువత ఖురాన్ పఠం చేయాలన్నారు. మహ్మద్ ప్రవక్త జీవిత కాలంలో కూడా ముస్లింలపై నిర్బంధాలు పెట్టారని, న్యాయం కోసం ఇమామే హుస్సేన్ ప్రాణాలు అర్పించారు కానీ శత్రువులకు లొంగలేదన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తే ప్రపంచంలోని అగ్రదేశాలు నోరు మెదపడం లేదన్నారు. ముస్లింలలో దేశభక్తి ఎక్కువని, స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. 1857లో అప్పటి మక్కా మసీదు ఇమామ్ మౌలానాషేక్ ఇస్మాయిల్ మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం ఆంగ్లయుల పై పోరాటానికి పిలుపునివ్వగా ముస్లింలు సుల్తాన్ బజార్‌లోని కోఠిని ముట్టడిస్తే కాల్పుల్లో ముస్లింలు ప్రాణాలు కోల్పోయారని, అండమాన్ నికోబార్‌లోని కాలపానీ జైలుకు మొదటి ఖైదీగా మక్కా మసీదు ఇమామ్ మౌలానాషేక్ ఇస్మాయిల్ శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. నాలుగు సంవత్సరాలుగా చట్టాలు చేయని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు సీఏఏ చట్టం తీసుకొచ్చి ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, కౌసర్ మోహిద్దీన్, ముబీన్, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని రోడ్డుషో..

బీజేపీ శ్రేణుల్లో జోష్..!

(5వ పేజీ తరువాయి)

చాటుకున్నారు. ఫుట్‌పాత్‌లు, టెర్రస్‌లు, బాల్కనీలపై ప్రజలు పార్టీ కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని మోదీకి స్వాగతం పలికారు. 'భారత్ మాతకీ జై.. జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు. మొబైల్‌లో వీడియోలను తీశారు. అయితే, మోదీ వాహనం అక్కడ ఆగకపోవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. ప్రధానికి ఘన స్వాగతం పలుకుతూ రైల్ నిలయం, ఆలుగడ్డ బావి తదితర ప్రాంతాలలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మిర్జాలగూడ చౌరస్తాలో ప్రారంభమైన యాత్ర మల్కాజిగిరి చౌరస్తా వరకు సాగింది.

ప్రధానితో పాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ రోడ్‌షోలో పాల్గొన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజ్‌భవన్‌కు వెళ్లారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఇదిలా ఉండగా మోదీ పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



నగరంలో సినీనటి మాళవిక శర్మ నీలి రంగు చీరలో తళుక్కుమన్నారు. బంజారాహిల్స్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం వచ్చిన ఆమె మాట్లాడుతూ.. మనశ్శాంతి కోసం తరచూ ఆశ్రమాలకు వెళ్తుంటానన్నారు. తాను నటించిన హరోంహర చిత్రం త్వరలో విడుదల కానుందన్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్‌కు గడ్డుకాలం!

(5వ పేజీ తరువాయి)

టచ్‌లోకి వెళ్లారు. నగరానికి చెందిన కీలక ప్రజా ప్రతినిధి సైతం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన సన్నిహితులతో ఆయన తమది మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబమేనని అన్నట్లు తెలిసింది. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంలో నగరానికి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే సీఎంను కలిసి తన మనసులోని మాటను చెప్పుకోవాలనుకున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మరో ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్న నందకిషోర్ వ్యాస్ కాంగ్రెస్‌లో చేరేందుకు పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపినట్లు తెలిసింది. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ ఎడ్ల హరిబాబు యాదవ్ సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. డివిజన్లు, బస్తీల వారీగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను చేర్చుకునే పనిలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ నిమగ్నమయ్యారు. కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఆసక్తి కనబరుస్తున్నారని రోహిన్‌రెడ్డి తెలిపారు.

ఢిల్లీ నుంచి రాయబారాలు..

2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో ఉన్న దానం నాగేందర్ బీఆర్ఎస్‌లో చేరి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో కూడా ఆయన సత్తా చాటాడు. అయితే, బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఆయన ఎన్నికల అనంతరం పార్టీ కార్యక్రమాలకు, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. దీంతో ఆయన పార్టీ మారుతున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో దానం ఢిల్లీలో ఉన్న పరిచయాలకు పదును పెట్టాడు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నాయకులను కలిశాడు. దీంతో మార్గం సుగమం అయినట్లు తెలిసింది. ఏఐసీసీ పచ్చజెండా ఊపగానే దానం నాగేందర్ సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులను కలిసినట్లు సీనియర్లు చెబుతున్నారు. అంతేకాదు పార్టీలో చేరిన అనంతరం మంత్రి పదవి కూడా చేపడతారని ప్రచారం జరుగుతోంది.

తహసీల్దార్‌పై కబ్జాదారు అనుచిత ప్రవర్తన

● జూబ్లీహిల్స్‌లో రూ. 30 కోట్ల స్థలం కబ్జా

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి వెనుకాలే కొన్నేళ్లుగా ఖాళీగా ప్రభుత్వ స్థలం ఉంది. దాన్ని ఆక్రమించినా అడిగేవాడు లేడనుకున్నాడో ఏమిటో కానీ.. కబ్జా చేశాడు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న తహసీల్దార్ క్షేత్రస్థాయి తనిఖీకి రాగా కబ్జాదారు తన మనుషులతో అడ్డగించాడమేకాక దురుసుగా ప్రవర్తించాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తహసీల్దార్ సమాయత్తమవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీ ఫేజ్ -1లో ప్రభుత్వం జర్నలిస్టుల కోసం కొన్నేళ్ల క్రితం స్థలం కేటాయించింది. చాలామంది సొసైటీ ద్వారా ప్లాట్లు తీసుకున్నారు. సొసైటీకి పోను కాలనీ అనుకొని నందగిరిహిల్స్‌కు వెళ్లే దారిలో ఎకరాల కొద్దీ ప్రభుత్వ మిగులు స్థలం ఉంది. ఈ స్థలాన్ని తమకు క్రమబద్ధీకరించాలని జర్నలిస్టుకాలనీ సొసైటీ సభ్యులు పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ అధికారులు తోసి పుచ్చారు. ఇదిలా ఉండగా జర్నలిస్టు కాలనీలో నివాసాల వెనకాల ప్లాట్ నంబర్ ఎ-1 నుంచి ఎ-9 వరకు సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నదని అధికారులకు ఫిర్యాదులు అందాయి. సికింద్రాబాద్ ఆర్డీఓ ఆదేశాల మేరకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తనిఖీ చేశారు. ప్లాట్ నంబర్ ఎ-7,ఎ-8 వెనక రూ.30 కోట్ల విలువ చేసే 800 గజాల స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. పురుషోత్తం రెడ్డి అనే వ్యక్తి తన ప్లాట్లకు వెనకాల ఉన్న స్థలాన్ని కూడా చదును చేసుకొని సర్వెంట్ క్వార్టర్స్‌తో పాటు ల్యాన్ కూడా వేసినట్లు నిర్ధారణ అయింది. ఈ స్థలాన్ని తనిఖీ చేసేందుకు తహసీల్దార్ ప్రయత్నించగా పురుషోత్తమ్ రెడ్డి మనుషులు అడ్డుకున్నారు. దురుసుగా ప్రవర్తించారు. లోపలికి వెళ్లడానికి అనుమతించలేదు. దీంతో తహసీల్దార్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆమె తెలిపారు.



ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలం కబ్జా యత్నం

● కాపాడిన రెవెన్యూ అధికారులు.. ● సూచిక బోర్డు ఏర్పాటు

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లో విలువైన ప్రభుత్వ భూమిని షేక్‌పేట రెవెన్యూ అధికారులు కాపాడారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3 ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనక ఉన్న ప్రభుత్వ స్థలంలో కొన్ని నిర్మాణ వ్యర్థాలు వేసి ఆక్రమించే ఏర్పాట్లు చేశారు.

నీలం రంగు షీట్లతో గేట్లను సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి స్థలం వద్ద ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. గేటుపై ప్రభుత్వ భూమి అని రాయించి స్థల రక్షణకు చర్యలు తీసుకున్నారు.

సూట్‌కేసులు, ట్రాలీ బ్యాగుల్లో గంజాయి

● బస్సులో తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

● 84 కిలోల సరుకు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సూట్‌కేసులు, ట్రాలీ బ్యాగుల్లో గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను మహేశ్వరం ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 84 కిలోల గంజాయి, రూ. 10 వేలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌కు చెందిన రఘువీర్ రాయ్ రాజమండ్రిలో ఉంటూ గంజాయి వ్యాపారం చేస్తూ ఏపీ నుంచి మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక ప్రాంతాలకు సరఫరా చేస్తుంటాడు. ఢిల్లీకి చెందిన గంజాయి వ్యాపారి ముఖేష్ అలియాస్ రషీద్.. రఘువీర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ మేరకు గంజాయి తరలించేందుకు ముఖేష్ యూపీకి చెందిన ఆటో డ్రైవర్ షాహిద్(25), ఢిల్లీకి చెందిన ఇమ్రాన్(28), బీహార్‌కు చెందిన ఎండీ అస్లాం(61), ఢిల్లీకి చెందిన సచిన్‌కుమార్ (39), మహ్మద్ జాహిద్ (51)తో పాటు ఓ బాలుడిని రఘువీర్ వద్దకు పంపించాడు. రఘువీర్ 2 సూట్‌కేసులు, 4 బ్యాగుల్లో 84 కిలోల గంజాయి నింపి ఇచ్చాడు. నిందితులు హైదరాబాద్‌కు బస్సులో తీసుకువస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.



ప్రెస్‌క్లబ్ హైదరాబాద్- 2024 డైరీని అవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి; చిత్రంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ అభివృద్ధికి సహకారం

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పంజాగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో తన నివాసంలో ప్రెస్‌క్లబ్ హైదరాబాద్- 2024 డైరీ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల పక్షపాతి అని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రావు, సి.వనజ, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, రమేష్ వైట్ల, కోశాధికారి రాజేష్, ఈసీ సభ్యులు ఉమాదేవి, వర్దెల్లి బాపూరావు, టి.శ్రీనివాస్, బి.గోపరాజు, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల ఆహ్వాన కరపత్రాన్ని అవిష్కరిస్తున్న తెలుగు, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు

ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పంజాగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు-2024 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రకటించాయి. నిపుణుల కమిటీ దరఖాస్తులను పరిశీలించి, 31 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టులను ఎంపిక చేస్తుందని, వారికి ఉగాది రోజున పురస్కారాలు అందిస్తామని ఆయా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు, ఎ. వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. దరఖాస్తు చేసేవారు తప్పనిసరిగా విభాగం పేరు పేర్కొనాలన్నారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ టీజేఎస్ఎస్ డాట్ కో ఇన్ సైట్‌కు, టీజేఎస్ఎస్662022టిజిమెయిల్ డాట్ కాంకు పంపించవచ్చన్నారు. వివరాలకు 7036602022 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సామాజిక స్పృహ, వ్యవసాయం, విద్య, వైద్య, క్రైమ్, సినిమా, క్రీడా, మహిళ తదితర విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జి.శ్రీనివాస్, జి.పరమేశ్వర్, కె.ప్రకాష్, కరుణాకర్, సత్తయ్య, శ్రీనివాస్, శివ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద శ్రీకాంతాచారికి నివాళులర్పిస్తున్న అమరుల కుటుంబ సభ్యులు

భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలి

● శ్రీకాంతాచారి తల్లి

మంగళ్‌హాట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ పదవులు ఇచ్చిందని శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ఆరోపించింది. శుక్రవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పించి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చి గెలిపించాలన్నారు. ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని, అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించకుండా తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలకు పదేళ్లుగా న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బిడ్డతో పాటు 1000 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలయ్యారని, ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు అమరవీరుల కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమ నాయకులు, అమరవీరుల కుటుంబాలు పాల్గొన్నాయి.

కరుణగోపాల్‌కు అద్రాజా నారీశక్తి సమ్మాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కరుణా గోపాల్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ నాయకురాలు, ఫౌండర్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణాగోపాల్ వర్తకవికి అమిటీ గ్లోబల్ యూనివర్సిటీ 'అద్రజా నారీశక్తి సమ్మాన్' అవార్డును అందించింది. పట్టణ సంస్కరణలు, ఆవిష్కరణలు, పాలన, పాలసీ రంగాల్లో విశేషమైన సేవలు అందించిన మహిళలకు ఈ అవార్డులను అమిటీ వర్సిటీ అందిస్తోంది. ఈ ఏడాది అవార్డులను కరుణా గోపాల్‌తోపాటు లక్ష్మీసింగ్ (ఐపీఎస్), రాజ్యసభ సభ్యులు రూపాగంగూలి, కథక్ నృత్యకారిణి పద్మశ్రీ శోవన్ నారాయణ్‌లకు అందజేశారు.

నిద్ర సరిగా లేకపోతే శారీరక, మానసిక సమస్యలు

● స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ కిశోర్

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 70కి పైగా దేశాల్లో నిద్రపట్ల అవగాహన కల్పించేందుకు మార్చి 15వ తేదీన స్లీప్ డే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఓఎస్ఏ) పై అవగాహన కల్పించేందుకు వాస్తవాలు, అపోహలు శీర్షికన శుక్రవారం ఏఐజీ ఆస్పత్రిలో వెబినార్ నిర్వహించామని ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ హెడ్, స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ కిశోర్ తెలిపారు. ఎయిమ్స్ అధ్యయనం ప్రకారం భారతదేశంలో 104 మిలియన్ల మంది ఉద్యోగులు అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా(ఓఎస్ఏ)తో బాధపడుతున్నారని, వీరిలో 47 మిలియన్ల మంది మోస్తరు నుంచి తీవ్రమైన ఓఎస్ఏతో ఇబ్బంది పడుతున్నారన్నారు. నిద్రలేమి సమస్య అంతర్జాతీయంగా ప్రతి చోటా కనిపిస్తుందని, ఇండియాలో ఇది మరింత ఎక్కువగా ఉందని, దాదాపు 32% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అన్నారు. నిద్ర సరిగా లేకపోతే శారీరక, మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గురక, స్లీప్ అప్నియా రెండూ ఒకటి కాదని, గురక ఉన్న వాళ్లు అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. స్లీప్ అప్నియా ఉన్న వారు గురక పెడతారని చెప్పలేమన్నారు. నిద్ర సంబంధిత శ్వాస లోపాలు అంటే ఓఎస్ఏ లాంటివి మరింత ప్రమాదకరమని, అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హోమ్ స్లీప్ టెస్ట్‌తో సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. ఓఎస్ఏకు చికిత్సను మూడు విధాలుగా అందిస్తారని ఆయన తెలిపారు.



ఫైనల్లో రష్మిక జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ 35కే టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ ఫైనల్లో శ్రీవల్లి రష్మిక జోడీ ప్రవేశించింది. ఇండోర్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి రష్మిక-వైదేహి చౌధురి జోడీ 6-1, 7-6తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్-సహజ జంటపై విజయం సాధించింది. ఇక, సింగిల్స్‌లో రష్మిక క్వార్టర్స్ చేరింది. ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-0, 6-0తో జస్టినా మికుల్స్‌కైట్ (లిథువేనియా)పై గెలిచింది.

క్రీడాకారుల నగదు బకాయిలు విడుదల

హైదరాబాద్: క్రీడాశాఖను తన వద్దే అట్టిపెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి పెండింగ్‌లోని నగదు ప్రోత్సాహకాల విడుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న కామన్వెల్త్, దక్షిణాసియా, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారుల నగదు ప్రోత్సాహకాలను విడుదల చేశారు. ఇందులో తాజాగా రూ.2.36 కోట్లను, గత డిసెంబరులో మరో 2.61 కోట్లను క్రీడాకారుల ఖాతాల్లో జమచేశారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రూ.4.97 కోట్లను క్రీడాకారులకు ప్రోత్సాహకాలుగా అందించారు.

భువనేశ్వర్‌కు శాట్స్ బృందం: సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తి మేరకు వచ్చే జూన్‌లో భారత్-కువైట్ మధ్య ఫిఫా క్వాలిఫయర్స్ మ్యాచ్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు పనులు ప్రారంభించింది. శాట్స్ ఎండీ కె.లక్ష్మి నేతృత్వంలోని డిప్యూటీ డైరెక్టర్ల బృందం భువనేశ్వర్‌లోని అధునాతన స్పోర్ట్స్ విలేజ్, గతంలో ఫిఫా మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన స్టేడియాలను పరిశీలించేందుకు అక్కడికి వెళ్తున్నది. భువనేశ్వర్‌లోని క్రీడా మౌలిక సదుపాయాలపై శాట్స్ బృందం అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదించనుంది.

భళా.. బెంగళూరు


స్మృతి మంధాన

- తొలిసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు
- ఎలిమినేటర్‌లో ముంబైపై విజయం
- రేపు ఢిల్లీతో టైటిల్‌ఫైట్


రిచా పెర్రీ

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు ఝలక్. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఎలిమినేటర్ పోరులో.. సమష్టి బౌలింగ్ ప్రదర్శనతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్వల్ప లక్ష్యాన్ని అద్భుతంగా కాపాడుకుంది. అటు చివరి మూడు ఓవర్లలో 20 పరుగులను సాధించలేక ముంబై బోల్తా పడింది. దీంతో 5 పరుగుల తేడాతో గెలిచిన స్మృతి మంధాన సేన.. తొలిసారి లీగ్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగే టైటిల్‌ఫైట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలిస్ పెర్రీ (66) అర్ధ సెంచరీతో ఆదుకుంది. ప్రత్యర్థి ముందు భారీ స్కోరును ఉంచాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ తొలి ఓవర్‌ను మూడు ఫోర్లతో ఆరంభించింది. కానీ ఆ తర్వాత మూడు ఓవర్లలోనే సోఫీ డివైన్ (10), మంధాన (10), దిశా కసత్ (0) వికెట్లను కోల్పోయింది. అయితే 23/3 స్కోరుతో తడబడిన జట్టును ఎప్పటిలాగే పెర్రీ ఆదుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా మెరుపు ఆటతీరుతో 40 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. రిచా ఘోష్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు, మోలినెక్స్ (11)తో ఆరో వికెట్‌కు 42 రన్స్ జోడించింది. ఆఖరి ఓవర్‌లో పెర్రీ వెనుదిరిగినా.. ఆమె దూకుడుతో చివరి ఐదు ఓవర్లలో 51 రన్స్ సమకూరాయి.

బౌలర్ల కట్టడి: స్వల్ప ఛేదనే.. బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ పర్వాలేదనిపించినా.. ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమై ఓడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33) టాప్ స్కోరర్. తొలి 8 ఓవర్లలో 50 పరుగులు చేసిన ముంబై ఓపెనర్లు మాథ్యూస్ (15), యాస్తిక (19) వికెట్లను కోల్పోయింది. ఇక, సివర్ (23), హర్మన్ ఆదుకునే ప్రయత్నం చేశారు. అటు హర్మన్‌కు జతగా అమెలియా కెర్ (27 నాటౌట్) కూడా కుదురుకోవడంతో ముంబైదే గెలుపులా కనిపించింది. అయితే 18వ ఓవర్‌లో హర్మన్‌ను శ్రేయాంక అవుట్ చేయడంతో అంతా తారుమారైంది. చివరి 2 ఓవర్లలో 16 పరుగులు కావాల్సిన వేళ హైడ్రామా నెలకొంది. 19వ ఓవర్‌లో సజన స్టంపౌట్ కాగా.. 6 బంతుల్లో సమీకరణం 12 రన్స్‌గా మారింది. క్రీజులో కెర్ ఉండడంతో ముంబై ఆశలు వదులుకోలేదు. కానీ స్పిన్నర్ శోభన.. పూజా వస్త్రాకర్ (4) వికెట్‌తో పాటు 6 పరుగులే ఇవ్వడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 135/6 (ఎలిస్ పెర్రీ 66, వేర్‌హమ్ 18 నాటౌట్; మాథ్యూస్ 2/18, సివర్ 2/18, సైకా ఇషాక్ 2/27)
ముంబై: 20 ఓవర్లలో 130/6 (హర్మన్ 33, కెర్ 27 నాటౌట్, సివర్ 23; శ్రేయాంక 2/16).

స్టాప్ క్లాక్ అమల్లోకి..

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: అంతర్జాతీయ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇకనుంచి స్టాప్ క్లాక్ నిబంధన తప్పనిసరి కానుంది. ఈ మేరకు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గత డిసెంబరు నుంచి పురుషుల క్రికెట్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ వరకు గడువు ఉన్నప్పటికీ ఇప్పటికే ఫలితం సానుకూలంగా వచ్చినట్టు ఐసీసీ పేర్కొంది. అందుకే రానున్న టీ20 వరల్డ్‌కప్ ద్వారా స్టాప్ క్లాక్‌ను అధికారికంగా అమలు చేయబోతున్నారు.

స్టాప్ క్లాక్ అంటే..: ఫీల్డింగ్ జట్టు ఓ ఓవర్‌ను ముగించిన 60 సెకన్లలోపే మరో ఓవర్‌ను ప్రారంభించాలి. ఇందుకుగాను మైదానంలో ఎలక్ట్రానిక్ బోర్డుపై 60 నుంచి 0 వరకు కౌంట్‌డౌన్ వస్తుంది. ఒకవేళ రెండుసార్లు ఈ రూల్‌ను అతిక్రమిస్తే మాత్రం ప్రత్యర్థి జట్టుకు 5 పరుగులు అదనంగా ఇస్తారు. అయితే ఓవర్ మధ్యలో మరో బ్యాటర్ క్రీజులోకి వచ్చినప్పుడు, బ్యాటర్ గాయపడిన సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది. మరోవైపు టీ20 వరల్డ్‌కప్ సెమీస్, ఫైనల్‌కు రిజర్వ్ డేలను కూడా కేటాయించారు.

2026 టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫికేషన్ ఇలా..: భారత్, శ్రీలంక దేశాల్లో జరిగే 2026 టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫికేషన్ ప్రక్రియకు ఐసీసీ ఆమోదం తెలిపింది. ఈ టోర్నీలో 20 జట్లు పాల్గొంటాయి. వీటిలో ఆతిథ్య జట్లుగా భారత్, శ్రీలంకతో పాటు ఈఏడాది జరిగే వరల్డ్‌కప్‌లో టాప్-8లో నిలిచిన జట్లే కాకుండా, మిగిలిన నాలుగు జట్లకు ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా అర్హత కల్పిస్తారు. మరో 8 జట్లను ఐసీసీ రీజినల్ క్వాలిఫయర్ మ్యాచ్‌ల ద్వారా నిర్ణయిస్తారు.

ఎంగిడి అవుట్..ఫ్రేజర్ ఇన్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ దూరమవగా, తాజాగా ఆ జట్టు ఏస్ పేసర్, సఫారీ బౌలర్ లుంగి ఎంగిడి లీగ్ నుంచి తప్పుకొన్నాడు. గాయం కారణంగా ఐపీఎల్‌లో ఆడడం లేదని ఎంగిడి ప్రకటించాడు. అతని స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌ను తీసుకున్నట్టు ఢిల్లీ ప్రకటించింది. కనీస ధర రూ.50 లక్షలు వెచ్చించి జెక్ ఫ్రేజర్‌ను ఢిల్లీ తీసుకుంది.

- నిష్ణాతులైన కోచ్‌లు లేక గాడి తప్పుతున్న శిక్షణ
- ఇంటర్వ్యూలు జరిగి రెండేళ్లయినా పూర్తికాని నియామకాలు
- కేంద్రం నిధులిచ్చినా, స్కీమ్ అమలులో జాప్యం
- సీనియర్లే జూనియర్లకు కోచింగ్ ఇస్తున్న పరిస్థితి
- గత ప్రభుత్వ నిర్వాకంతో ఆటగాళ్లు, కోచ్‌లకు అగచాట్లు



'ఖేలో ఇండియా'కు తూట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పథకం కింద కేంద్ర క్రీడా శాఖ దేశ వ్యాప్తంగా 36 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు 2020-21లో ఒక సెంటర్‌ను కేటాయించింది. ఈ సెంటర్‌లో వెయిట్‌లిఫ్టింగ్, రోయింగ్, ఫెన్సింగ్ అకాడమీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ అకాడమీలను నడిపేందుకు శిక్షణ బృందం నియామకం, క్రీడా సామగ్రి కొనుగోలు, నిర్వహణకు సుమారు రూ.2.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇక్కడ వరకు అంతా బాగానే ఉన్నా, స్కీమ్ అమలు విషయం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాన ఉంది.

ఇంటర్వ్యూలకే పరిమితం..

ఖేలో ఇండియా ఎక్సలెన్స్ సెంటర్ నిర్వహణకు దేశ వ్యాప్తంగా ఒక మోడల్‌ను తయారు చేశారు. హకీంపేట సెంటర్‌కు వచ్చేసరికి ఒక హైపెర్ఫామెన్స్ మేనేజర్, మూడు క్రీడా విభాగాలకు ముగ్గురు హెడ్ కోచ్‌లు, ఒక ప్రొఫెషనల్ కోచ్, గ్రేడ్-1 ఫిజియోథెరపిస్ట్ ఒకరు, గ్రేడ్-2 ఫిజియోథెరపిస్ట్-1, న్యూట్రిషనిస్ట్-1, ఇద్దరు మసాజర్లు, స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ ఎక్స్‌పర్ట్ ఒకరు ఉండాలి. కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్), శాట్స్ కలిసి 2022 మార్చిలో ఈ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ ప్రక్రియ ముగించి, అభ్యర్థుల తుది జాబితాను ఖరారు చేసి, రెండేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ నియామక ప్రక్రియను పూర్తి చేయకపోవడం గమనార్హం.

అమలులో జాప్యం..

ఖేలో ఇండియా స్కీమ్ కింద వచ్చిన నిధులతో దాదాపు రూ.2.32 కోట్లు వెచ్చించి, హకీంపేటలో మల్టీపర్పస్ జిమ్, వెయిట్ లిఫ్టింగ్, రోయింగ్, ఫెన్సింగ్‌కు సంబంధించిన క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు. అయితే, వీటిని ఉపయోగించి క్రీడాకారులకు సుశిక్షితమైన కోచింగ్ ఇచ్చే కోచ్‌లే లేకపోవడంతో శిక్షణ గాడి తప్పుతోంది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రస్తుతమున్న కోచ్‌లతో ట్రైనింగ్‌ను నెట్టుకొస్తున్నారు. ఇందులో ఫెన్సింగ్‌కు మూడేళ్లుగా అసలు కోచ్ లేకపోవడం గమనార్హం. సీనియర్ క్రీడాకారులే జూనియర్ ప్లేయర్లకు శిక్షణ ఇస్తున్నారని తెలుస్తోంది. వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని కూడా స్కూల్‌లోని ఒక జూనియర్ కోచ్ నడిపిస్తున్నాడు. టార్గెట్ ఒలింపిక్స్ నినాదంతో ప్రారంభించిన ఎక్సలెన్స్ సెంటర్ నిర్వహణే ఇంత లోపభూయిష్టంగా ఉంటే ఫలితాలు ఎలా వస్తాయని పలు క్రీడా సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

వేధిస్తున్న కోచ్‌ల కొరత..

శాట్స్‌లో కోచ్‌ల నియామకం చివరిగా 2009లో చేపట్టారు. అప్పటి నుంచి కోచ్‌లను తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం శాట్స్‌లో ఆరుగురు మాత్రమే రెగ్యులర్ కోచ్‌లు ఉన్నారు. వీరంతా అడ్మినిస్ట్రేషన్ విభాగంలోనే విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాక మరో 130 మంది మాత్రమే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇస్తున్నారు. కనీసం నియోజకవర్గానికి 10 మంది కోచ్‌లు అనుకున్నా, రాష్ట్రంలోని 119 నియోజకవర్గ కేంద్రాలన్నింటికీ కలిపి 1190 మంది కోచ్‌లు అవసరమవుతారు. అలాంటిది రాష్ట్రం మొత్తం మీద ఇప్పుడు 130 మందే కోచ్‌లు ఉన్నారంటే క్రీడాకారులకు శిక్షణ ఏ విధంగా అందుతున్నదో అర్థం చేసుకోవచ్చు. 1989 వరకు కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకున్న కోచ్‌లను మూడేళ్ల సర్వీస్ అనంతరం రెగ్యులరైజ్ చేసేవారు. శాట్స్‌లోని కొందరి అజ్ఞానంతో 1993 నుంచి కోచ్‌ల క్రమబద్ధీకరణకు తిలోదకాలిచ్చారు. 1996లో పరిపాలక విభాగం ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చేశారు కానీ, కోచ్‌లను రెగ్యులరైజ్ చేయలేదు. 1999, 2009 బ్యాచ్‌కి కూడా ఇదే పరిస్థితి ఎదురవడంతో శాట్స్‌లో కోచ్‌లుగా పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా మూడు దశాబ్దాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న 27 మంది కాంట్రాక్టు కోచ్‌ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించి, తక్షణమే కొత్త కోచ్‌ల నియామకం కూడా చేపట్టాలని క్రీడాకారులు, క్రీడా సంఘాలు కోరుతున్నాయి. అలానే ప్రభుత్వ స్టేడియాలు, అకాడమీలు, స్పోర్ట్స్ స్కూళ్లలో కోచ్‌లు అత్యల్పంగా ఉంటే తిరిగి వారి నెత్తినే ఖేలో ఇండియా ఎక్సలెన్స్ సెంటర్ భారం మోపడం ఎంత వరకు సబబు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఖేలో ఇండియా స్కీమ్ కింద కొత్త కోచ్‌లను తీసుకోనే అవకాశమున్నా వినియోగించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బిజినెస్



వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే అవకాశం లేదు

హైదరాబాద్‌లో మరో నాలుగు శాఖలు
యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్

హైదరాబాద్: దేశంలో వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదని యస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ చెప్పారు. అలా అని వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశమూ లేదన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉన్నందున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పట్లో రెపో రేటు తగ్గించక పోవచ్చన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించే అవకాశం ఉందన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపునకు రిటైల్ ద్రవ్యోల్బణమే పెద్ద అడ్డంకి అన్నారు. సంక్షోభ సమయంలో తమ బ్యాంకును ఆదుకున్న ఎస్‌బీఐతో సహా ఏ సంస్థా ప్రస్తుతం యస్ బ్యాంకులోని తమ వాటాలను అమ్మే యోచనలో లేవన్నారు.

మరింత విస్తరణ: ప్రస్తుతం హైదరాబాద్‌లో తమకు ఉన్న 25 శాఖలను ఈ నెలాఖరుకల్లా 29 శాఖలకు విస్తరిస్తున్నట్టు ప్రశాంత్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) హైదరాబాద్‌లో మరో రెండు శాఖలు ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. రుణాల మంజూరులో ఎంఎస్ఎంఈలు, మధ్య తరహా కంపెనీలే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం తమ మొత్తం రుణ పోర్టుఫోలియోలో ఎంఎస్ఎంఈల వాటా 30 శాతంగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం దీన్ని 35 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

తెలంగాణలో ముత్తూట్ మైక్రోఫిన్

హైదరాబాద్: ఆర్థిక సేవల రంగంలోని ముత్తూట్ మైక్రోఫిన్ తెలంగాణలో అడుగు పెడుతోంది. తొలి విడతగా తెలంగాణలో నాలుగు బ్రాంచీలు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. అవి భువనగిరి, జనగాం, హనుమకొండ, పరకాల. తదుపరి దశలో ఈ ఏడాది జూన్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో కూడా అడుగుపెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించి కొత్త కస్టమర్లను ఆకట్టుకునే వ్యూహంలో తెలంగాణలో మరింతగా కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశించబోతున్నామని ముత్తూట్ మైక్రోఫిన్ సీఈఓ సదాఫ్ సయీద్ తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన 346 జిల్లాల్లో 1,424 శాఖలు కలిగి ఉన్న ఈ కంపెనీకి 32.8 లక్షల మంది క్రియాశీల కస్టమర్లున్నారు.

టెస్లా ఎంట్రీకి లైన్ క్లియర్!

ఈవీ పాలసీకి కేంద్ర ప్రభుత్వ ఆమోదం .. కనీసం 50 కోట్ల డాలర్ల పెట్టుబడితో దేశంలో ప్లాంట్ ఏర్పాటు చేసే కంపెనీలకు దిగుమతి సుంకం రాయితీ



న్యూఢిల్లీ: టెస్లా సహా పలు అంతర్జాతీయ విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ కంపెనీలు భారత్‌లోకి ప్రవేశించేందుకు మార్గం సుగమం అయింది. ఈ కంపెనీలను ఆకర్షించేందుకు రూపొందించిన ఈవీ పాలసీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ రంగంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఆధునిక సాంకేతికతతో కూడిన ఈవీల తయారీకి భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ పాలసీ ముఖ్యోద్దేశం. ఈ పాలసీతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో భారత్ విశ్వ శక్తిగా అవతరించనుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. "ఈ పథకం ద్వారా ప్రపంచ కంపెనీలను భారత్‌కు ఆహ్వానిస్తున్నాం. దేశంలో ఈవీల తయారీ త్వరితగతిన విస్తరించాలి. అలాగే, దేశంలో తయారైన ఈవీలను ప్రపంచానికి ఎగుమతి చేయగలగాలి. తద్వారా ఈ రంగంలో మనం విశ్వ శక్తిగా ఎదగాలి. ఈ రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌ను సృష్టించగలద"ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దేశంలో ఈవీ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. దాంతో అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో ఎంట్రీపై కన్నేశాయి. వియత్నాంకు చెందిన ఈవీ కంపెనీ విన్‌ఫాస్ట్ రూ.16,000 కోట్ల పెట్టుబడులతో తమిళనాడులో విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. 2030 నాటికి భారత్‌లో ఈవీల వార్షిక విక్రయాలు కోటి యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా. అలాగే, ఈ రంగం 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చని 2022-23 ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇండస్ట్రీ వర్గాల ప్రకారం.. 2022లో ఈవీల విక్రయాలు 10 లక్షల యూనిట్ల మైలురాయికి చేరుకున్నాయి. దేశీయ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీల్లో టాటా మోటార్స్ అగ్రగామిగా ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీ నెగ్జాన్, టియాగో, టిగోర్ మోడళ్లలో ఎలక్ట్రిక్ వెర్షన్లను విక్రయిస్తోంది.

దరఖాస్తు ఇలా..

పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య డిపార్ట్‌మెంట్ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ పాలసీ వివరాలను మీడియాకు వివరించారు. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి కలిగిన కంపెనీలు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. దిగుమతి అవసరాలతో పాటు పలు వివరాలను అప్లికేషన్‌లో పొందుపర్చాలని అన్నారు. టెస్లా సహా పలు అంతర్జాతీయ ఈవీ కంపెనీలు భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. ఇంకా ఏమన్నారంటే..

- ఈ పథకం నోటిఫికేషన్ విడుదల చేసిన 120 (అంతకంటే ఎక్కువ) రోజుల్లోగా దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుంది. నోటీసు ద్వారా అప్లికేషన్లను ఆహ్వానించనున్నారు. 120 (అంతకంటే ఎక్కువ) రోజుల్లోగా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.
- స్వీకరించిన దరఖాస్తులపై వాటిని సమర్పించిన లేదా ప్రభుత్వం కోరిన మేరకు వివరణ ఇచ్చిన 120 రోజుల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.
- పథకం తొలి రెండేళ్లలో అవసరమైనప్పుడల్లా దరఖాస్తులను ఆహ్వానించే హక్కు ప్రభుత్వం కలిగి ఉంటుంది.
- ప్లాంట్ ఏర్పాటు కోసం భూమి సేకరణకయ్యే వ్యయం పెట్టుబడి పరిధిలోకి రాదు. ఈ పథకం ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకునే గ్లోబల్ కంపెనీలు కనీసం రూ.10,000 కోట్ల వార్షికాదాయం కలిగి ఉండాలి.
- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (పీఎంఏ) ఈ పథకాన్ని అమలు చేయనుంది. కంపెనీలకు పీఎంఏ కార్యదర్శి, నిర్వాహక, అమలు మద్దతును అందించనుంది.
- దిగుమతి సుంకం రాయితీ కోసం ఆమోదిత దరఖాస్తుదారులు యేటేటా దిగుమతి అప్లికేషన్‌ను సమర్పించాలి.

పాలసీ మార్గదర్శకాలు

- కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు కల్పించనుంది.
- కంపెనీలకు భారీ పరిశ్రమల శాఖ నుంచి అనుమతి లభించిన మూడేళ్లలో ప్లాంట్‌లో తయారీ ప్రారంభించాల్సి ఉంటుంది. అలాగే మూడేళ్లలో 25 శాతం కాంపొనెంట్లను దేశీయంగా సేకరించాల్సి ఉంటుంది. ఐదేళ్లలో ఈవాటాను 50 శాతానికి పెంచాల్సి ఉంటుంది.
- కంపెనీకి అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి ఐదేళ్ల వరకు 35,000 డాలర్లు (రూ.29 లక్షలు) అంతకు పైగా విలువ చేసే కార్లను 15 శాతం కస్టమ్స్ సుంకం చెల్లించి దిగుమతి చేసుకునేందుకు అనుమతించనున్నారు. ప్రస్తుతం కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) కార్ల దిగుమతిపై చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకం.. ఇంజన్ సైజు, ధర, బీమా, రవాణా విలువ ఆధారంగా 70-100 శాతం స్థాయిలో ఉంది.
- గరిష్ఠంగా 8,000 యూనిట్ల వరకు సుంకం రాయితీతో దిగుమతి చేసుకునే వీలుంటుంది. వినియోగించుకోని వార్షిక దిగుమతి పరిమితిని మరుసటి ఏడాదికి బదిలీ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు.
- కనీస పెట్టుబడితో పాటు దేశీయంగా విడిభాగాల సమీకరణ నిబంధనలను పాటింపునకు హామీగా బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ కంపెనీ ఈ నిబంధనలను పాటించడంలో విఫలమైతే బ్యాంక్ గ్యారెంటీ అమలు చేయబడుతుంది.

25 కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్: సెబీ

ముంబై: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిమిత బ్రోకర్ల ద్వారా 25 కంపెనీల షేర్లలో బీటా వెర్షన్‌లో ఆప్షనల్ టీ+0 సెటిల్‌మెంట్‌ను అనుమతించాలని నిర్ణయించింది. దీంతో ఈ షేర్ల అమ్మకం, కొనుగోళ్లు, చెల్లింపుల ప్రక్రియ అదే రోజు పూర్తి అవుతుంది. మూడు, ఆరు నెలల తర్వాత దీన్ని సమీక్షించి సెబీ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. దీనికి తోడు పబ్లిక్ లేదా రైట్స్ ఇష్యూల ద్వారా ఈక్విటీ షేర్లు జారీ చేసే కంపెనీలు.. సమీకరించే మొత్తంలో ఒక శాతం డిపాజిట్ చేయాలనే నిబంధనను ఎత్తివేసేందుకూ సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ఎఫ్‌పీఐలు ఎప్పటికప్పుడు వెల్లడించాల్సిన అంశాలపైనా సడలింపు ఇచ్చింది. మార్కెట్ లావాదేవీలను మరింత సులభతరం చేసేందుకు సెబీ ఈ చర్యలు తీసుకుంది. ఇతర ప్రధాన నిర్ణయాలు..

- కొన్ని షరతులకు లోబడి దేశంలోని తమ మొత్తం పెట్టుబడుల్లో 50 శాతానికిపైగా ఏదైనా కార్పొరేట్ గ్రూప్‌లో మదుపు చేసిన ఎఫ్‌పీఐలకు ఆ విషయం వెల్లడి నుంచి మినహాయింపు.
- ఎఫ్‌పీఐల యాజమాన్య మార్పులను నిర్దిష్ట సమయంలోగా వెల్లడించాలన్న నిబంధనల్లో సడలింపు.
- లిస్టెడ్ కంపెనీల షేర్లపై వచ్చే పుకార్ల పరిశీలనపై ఇక ఒకే విధానం.
- పుకార్ల ఆధారంగా షేర్ల ధరల్లో మార్పులు చోటు చేసుకుంటే 24 గంటల్లో ఆ లావాదేవీని నిర్ధారించాలి.
- మార్కెట్ పుకార్లపై లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయి వ్యక్తులు సకాలంలో స్పందించాలి.

నష్టాల వారం

వారాంతం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 454 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో మళ్లీ నష్టాలు చవిచూశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, ఎనర్జీ రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో పాటు స్మాల్, మిడ్‌క్యాప్ షేర్ల వాల్యువేషన్లపై ఆందోళనలు ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 612 పాయింట్లకు పైగా పతనమై 72,484.82 వద్దకు జారుకున్నప్పటికీ, చివర్లో 453.85 పాయింట్ల నష్టంతో 72,643.43 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 123.30 పాయింట్లు కోల్పోయి 22,023.35 వద్ద ముగిసింది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 1,475.96 పాయింట్లు (1.99%), నిఫ్టీ 470.20 పాయింట్లు (2.09%) నష్టపోయాయి.

జీడీపీ లెక్కల్లో గందరగోళం

అర్వింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ: ఇటీవల విడుదల చేసిన భారత జీడీపీ గణాంకాలు తీవ్ర గందరగోళంగా ఉన్నాయని, వాటిని అవగాహన చేసుకోవడం కూడా కష్టంగానే ఉన్నదని ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్ అన్నారు. తాజా గణాంకాల ప్రకారం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో జీడీపీ ఏడాదిన్నర కాలంలో అమిత వేగంగా వృద్ధి చెంది 8.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఈ గణాంకాలపై అర్వింద్ మాట్లాడుతూ.. ఈ గణాంకాల ప్రకారం చూసినట్టయితే ద్రవ్యోల్బణం 1 నుంచి 1.5 శాతం మధ్యలో ఉంటుందని, కాని వాస్తవిక ద్రవ్యోల్బణం 3 నుంచి 5 శాతం మధ్యన ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. అదే విధంగా ఒకపక్క ప్రైవేటు వినియోగం 3 శాతం ఉంటే ఆర్థిక వ్యవస్థలో వృద్ధి 7.5 శాతం మేరకు ఉన్నదని ఆయన తెలిపారు. గణాంకాలు తప్పు అని నేను చెప్పడంలేదని, కాని వాటిలో చాలా గందరగోళం ఉన్నదని ఆయన అన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతనాలు 17% పెంపు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే కేంద్ర ప్రభుత్వం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వారి వేతనాలు 17 శాతం పెంచేందుకు ఆమోదం తెలిపింది. 2022 ఆగస్టు 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుంది. దీంతో 1.10 లక్షల మందికిపైగా ఎల్ఐసీ ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది జీతాలు 17 శాతం పెంచేందుకు అనుమతించిన కొద్ది రోజులకే.ప్రభుత్వం ఎల్ఐసీ ఉద్యోగుల జీతాల పెంపునకు ఆమోదం తెలపడం విశేషం. 2010 ఏప్రిల్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన దాదాపు 24,000 మంది ఎల్ఐసీ ఉద్యోగుల ఎన్‌పీఎస్ చందాను 10 నుంచి 14 శాతానికి పెంచేందుకూ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పెన్షనర్లకు వన్ టైమ్ ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకూ ప్రభుత్వం అంగీకరించింది. దీంతో దాదాపు 30,000 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,120 ▲	60,610 ▲	80,100 ▲
ముంబై	65,559 ▲	60,052 ▲	74,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	395	విశాఖపట్నం	425
16వ తేదీ		వరంగల్	397
చిత్తూరు	463		
గోదావరి	420	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	121
విశాఖపట్నం	103		

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 16 మార్చి 2024
cinema@andhrajyothy.com



మధుబాల బయోపిక్

అలనాటి అందాల తార, ప్రేక్షక హృదయాలను దోచిన వెండితెర సామ్రాజ్ఞి, దివంగత బాలీవుడ్ నటి మధుబాల జీవితాన్ని సెల్యులాయిడ్‌పైకి తీసుకురానున్నారు. 'మొఘల్ ఈ అజమ్', 'చల్తీ కా నామ్ ఘాడీ', 'మిస్టర్ అండ్ మిస్సెస్ 55' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో ఆమె మెరిశారు. తన అందంతో, నటనతో బాలీవుడ్ 'మార్లిన్ మన్రో'గా, 'లివింగ్ తాజ్ మహల్'గా కితాబులందుకున్నారు. ఈ చిత్రానికి టైటిల్ 'మధుబాల:ది వీనస్ ఆఫ్ ఇండియన్ సినిమా'. ఈ బయోపిక్‌కు బాలీవుడ్ చిత్రం 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కే రీన్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ , బ్రీవింగ్ థాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కలసి సంయుక్తంగా నిర్మించనున్నాయి. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ ఈ విషయాన్ని శుక్రవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. "అందానికీ, అభినయానికీ నిలువెత్తు నిదర్శనమైన మధుబాల జీవితాన్ని వెండితెరపైకి తీసుకురాబోతున్నాం. ఆమె జీవిత ప్రయాణాన్ని, భారతీయ చలన చిత్ర రంగంపై ఆమె వేసిన ముద్రను ఓ దృశ్య కావ్యంగా మలవనున్నాం. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నందుకు చెప్పలేనంత సంతోషంగా ఉన్నాం. తన సమ్మోహనమైన సౌందర్యంతో ఆనాటి తరాన్ని అలరించిన అందాల దేవతను వెండితెరపై దర్శించి, పులకించి పోవడానికి.. ఆమె నటనాపటిమను చూసి ఆశ్చర్యచకితులవ్వడానికి సిద్ధమవ్వండి" అంటూ పేర్కొంది. ఈ బయోపిక్‌లో మధుబాల పాత్రను ఎవరు పోషిస్తున్నారనే ఆసక్తి అందరిలోనూ ఏర్పడగా.. ఆలియా భట్, కృతి సనన్, త్రిప్తి దిమ్రి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



మంచి హిట్ ఇచ్చారు.. థాంక్స్

గోపీచంద్

గోపీచంద్ హీరోగా కన్నడ దర్శకుడు ఎ హర్ష రూపొందించిన 'భీమ' చిత్రం ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో హీరో గోపీచంద్ మాట్లాడుతూ ' ఇంతమంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. రెండు క్యారెక్టర్స్‌లో చక్కని వేరియేషన్స్ చూపించారని అంటున్నారు. గ్రాఫిక్స్, యాక్షన్ , కామెడీ అద్భుతంగా



కుదిరాయి. ఇంత మంచి కథ తీసుకువచ్చి, కమర్షియల్ ప్యాక్డ్ సినిమా తీసిన దర్శకుడు హర్షకు, ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించిన నిర్మాతలు రాధామోహన్, శ్రీధర్‌కు కృతజ్ఞతలు. పరీక్షలు అయిపోయాయి కాబట్టి ఇంకా సినిమా చూడని వారు థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి' అని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'కన్నడ దర్శకుడు హర్ష తెలుగు ప్రేక్షకుల నాడిని పట్టుకుని సినిమాను ఆద్యంతం గ్రిప్పింగ్‌గా తీశారు. పతాక సన్నివేశాలు సినిమాకే హైలైట్' అని ప్రశంసించారు. మరో దర్శకుడు సంపత్‌నంది మాట్లాడుతూ 'మైథాలజీ, ఫాంటసీ అంశాలు జోడించి తీసిన మంచి కమర్షియల్ సినిమా 'భీమ'. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్ చూస్తుంటే పరశురాముడు ఇలాగే ఉంటాడమో అనిపించింది' అన్నారు. ముంబైలో సినిమా చూశాననీ, ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని హీరోయిన్ మాళవిక చెప్పారు. తన తొలి తెలుగు చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు దర్శకుడు హర్ష. రోజురోజుకీ కలెక్షన్లు పెరుగుతున్నాయని చెబుతూ మంచి విజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు నిర్మాత రాధామోహన్.

మరింత సరళంగా సినిమా సర్టిఫికేషన్ రూల్స్

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సినిమాటోగ్రఫీ 2024(సినిమా సర్టిఫికేషన్) నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రక్రియలో గణనీయమైన మార్పులు చేసింది. 1983 నుంచి కొనసాగుతున్న విధానాలలో కొన్ని మార్పుల్ని తీసుకువచ్చింది. ఈ మార్పుల వల్ల ఆన్‌లైన్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ప్రక్రియ మరింత సులువవుతుందని ప్రసార శాఖ ప్రకటించింది. కొత్త నిబంధనల వల్ల పారదర్శకత పెరిగి వాణిజ్యపరంగా చిత్ర పరిశ్రమకు మరింత మేలు జరుగుతుంది. పూర్తి స్థాయిలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా, సర్టిఫికేషన్‌కు పట్టే కాలం చాలావరకూ తగ్గుతుందని పేర్కొంది. ఇకపై వయసును బట్టి ప్రేక్షకులను ఏడేళ్ల పైన, 13 ఏళ్లపైన, 16 ఏళ్లపైన మూడు కేటగిరీలుగా విభజించి సర్టిఫికెట్ జారీ చేయనుంది.

భయపెట్టే అనన్య


సుమన్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'అనన్య'. జయరామన్, చందన జంటగా నటించారు. ప్రసాద్‌రాజు బొమ్మిడి దర్శకత్వంలో జంధ్యాల గంగాధర శర్మ నిర్మించారు. ఈ నెల 22న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించామని దర్శకుడు తెలిపారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠ కలిగిస్తుంది, ఈ జానర్‌లో ట్రెండ్ సెట్ చేస్తుంది అని నిర్మాత తెలిపారు.



మలయాళ చిత్రం...
కలెక్షన్ కింగ్



కథను, కథనంలో కొత్తదనాన్ని నమ్ముకొని చేస్తున్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మలయాళ చిత్రసీమకు గౌరవాన్ని తెచ్చిపెడుతోంది. కమర్షియల్ హంగులు, రొటీన్ మసాలా అంశాలు లేకున్నా అక్కడి సినిమాలు బాక్సాఫీసును దున్నేస్తున్నాయి. రైటింగ్‌లో లేనిది టేకింగ్‌లో రాదు అనే సూక్తిని మలయాళ చిత్రసీమ మొదటి నుంచి నిక్కచ్చిగా పాటిస్తోంది. కాబట్టే అక్కడ పరిమిత బడ్జెట్‌తో రూపొందిన ఎన్నో చిత్రాలు ఇప్పటివరకూ మంచి విజయాన్ని అందుకొంటూ చిన్న పరిశ్రమకు ఊపిరి పోస్తున్నాయి. ఇప్పుడు మలయాళ సినిమా మరింత ఎదిగింది. గడచిన రెండేళ్లుగా పరభాషల్లోనూ కమర్షియల్ విజయాలను అందుకుంటూ, భారతీయ చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. ఇటీవల కాలంలో మాత్రం అక్కడి సినిమాలు రూ. 100 కోట్లు, రూ. 150 కోట్ల వసూళ్లను అలవోకగా సాధిస్తున్నాయి. పలు భాషల్లో మలయాళ సినిమాలు డబ్ అవుతున్నాయి. మంచి విజయం సాధిస్తున్నాయి. ఓటీటీల్లోనూ మలయాళ సినిమాల హవా నడుస్తోంది. భాషలకు అతీతంగా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వాణిజ్య హంగులకు పెద్ద పీట వేసే పరభాషా చిత్రాల్లోలా అవసరం లేకున్నా భారీగా ఖర్చు పెట్టడం, హీరోయిజాన్ని కీర్తించడానికి బిల్డప్పు సీన్లు లాంటి అవలక్షణాలకు మలయాళ చిత్రసీమ ఆమడ దూరం. మొదటి నుంచి అక్కడ సినిమాకు కథే హీరో. ఆ సూత్రాన్నే నమ్ముకొని ముందుకు సాగుతున్న ఈ తరం మలయాళ దర్శకులు తమ మార్కెట్‌ను పాన్ ఇండియా స్థాయికి విస్తరిస్తున్నారు. కొత్త ఏడాదిలో తొలి మూడునెలల్లోనే అరడజను విజయాలు అందుకొని సరికొత్త ఉత్సాహంతో మలయాళ చిత్రసీమ దూసుకుపోతోంది.







పిశాచం పాత్రలో మమ్ముట్టి

ఈ కోవలో ముందుగా ప్రస్తావించాల్సిన చిత్రం 'భ్రమయుగం'. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఈ చిత్రంలో పోషించింది ఓ పిశాచం పాత్ర. మరే భాషలోనైనా ఆ స్థాయి ఉన్న నటుడు ఇలాంటి పాత్ర పోషించడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఊహకైనా అందదు. ఇక సినిమాలో ఉన్నది మొత్తం మూడు పాత్రలే. కథ అంతా పాడుబడిన ఇంట్లోనే సాగుతుంది. సినిమా మొత్తం బ్లాక్ అండ్ వైట్‌లోనే తీయడం మరో విశేషం. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే కథలో ఓ ఒంటరి బాటసారి అడవిలో దారి తప్పి పాడుబడిన ఇంట్లోకి వెళ్లడం, తను అక్కడే బందీ అవడం, ఆ ఇంట్లో ఎదుర్కొన్న పరిస్థితుల నేపథ్యంలో సాగిన సినిమా ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. విడుదలైన మూడు వారాల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 55 కోట్ల వసూళ్లను సాధించింది.

ఈతరం ప్రేమలు

అగ్ర హీరోల సినిమాలే కాదు, అక్కడి నుంచి వస్తున్న లో బడ్జెట్ చిత్రాలు సైతం దేశవ్యాప్తంగా ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ఆ కోవలో ముందుగా చెప్పాల్సింది 'ప్రేమలు' చిత్రం గురించే. మలయాళ హీరో ఫహాద్ ఫాసిల్ నిర్మించిన ఈ చిత్రం అక్కడ రూ. 100 కోట్ల వసూళ్లను సాధించింది. దర్శకుడు రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేశారు. గిరీష్ ఏడి దర్శకుడు. కాలేజీ నేపథ్యంలో సాగిన ఈ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ తెలుగు ప్రేక్షకులను సైతం అమితంగా ఆకట్టుకుంది. కథానాయిక మమిత బైజు తెలుగునాట పాపులర్ అయ్యారు.

ఆల్‌టైమ్ రికార్డ్ మూవీ

యూత్ ఎంటర్టైనర్ 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్రం ఇతర భాషల్లో సైతం వసూళ్ల దుమ్ము రేపుతోంది. రూ. 4 కోట్లతో నిర్మించిన ఈ చిత్రం నేటికి (23 రోజుల్లో) రూ. 175 కోట్లు వసూలు చేసింది. ఇప్పటిదాకా అత్యధిక వసూళ్లు సాధించిన మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించింది. ఇంకా బాక్సాఫీసు దగ్గర ఈ చిత్రం హవా నడుస్తోంది. 2006లో కొడైకెనాల్ గుహల్లో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు చిదంబరం ఈ చిత్రాన్ని రూపొందించారు. విహార యాత్ర కోసం కొండగుహల్లోకి వెళ్లిన స్నేహితుల బృందంలో ఓ యువకుడు లోయలో పడడం, అతన్ని కాపాడేందుకు మిగిలినవారంతా కలసి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుంది. త్వరలోనే ఈ చిత్రం తెలుగు వెర్షన్ ప్రేక్షకుల ముందుకు రానుంది.

మెప్పించిన మర్డర్ మిస్టరీ

ఫిబ్రవరిలో విడులైన 'అన్వేషిప్పిన్ కాండేత్తుమ్' చిత్రం పోలీస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగుతుంది. నటీనటులు అంతా కొత్తవారే. రూ. 10 కోట్ల వ్యయంతో తెరకెక్కి, రూ. 50 కోట్లకు పైబడి వసూళ్లను సాధించింది. కథంతా మర్డర్ మిస్టరీ చుట్టూ తిరుగుతుంది. సినిమా అంతా పోలీస్ ఇన్వెస్టిగేషన్ తప్ప పాటలు, ఫైట్లు, కామెడీ సన్నివేశాలు మచ్చుకూ కనిపించవు. అయినా ప్రేక్షకులు పట్టం కట్టారు. ప్రస్తుతం ఓటీటీ స్ట్రీమింగ్‌లోనూ చక్కని ఆదరణ పొందుతోంది.

కమర్షియల్ సక్సెస్‌తో కొత్త కోణం

మలయాళ చిత్ర పరిశ్రమ సాధిస్తున్న ఈ విజయాల్లో ప్రధాన పాత్ర అక్కడి దర్శకులదే అని చెప్పాలి. వారి సృజనాత్మకతతో సరికొత్త కథలు తెరపైకి వచ్చి, ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. అగ్ర హీరోలు సైతం ప్రయోగశీలురు కావడం, దర్శకులపైన నమ్మకం ఉంచి మేకింగ్‌లో కలుగజేసుకోకుండా ఉండడమూ విజయాలకు కారణం. అందుకే అక్కడి సినిమా ఎల్లలు చెరిపివేసి దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ విజయ దుందుభి మోగిస్తోంది. ఈ ఏడాది మూణ్నెల్లలోనే పలు మలయాళ సినిమాలు భారీ కమర్షియల్ విజయాలను అందుకొని సక్సెస్‌కు సరికొత్త భాష్యం చెబుతున్నాయి. మార్కెట్ పరిధి తక్కువ కావడంతో కొద్ది బడ్జెట్‌తో, ముందస్తు ప్రణాళికతో చాలా తక్కువ రోజుల్లోనే సినిమాను నిర్మించడం పరిపాటి.



సినీ నటుడు వెంకటేశ్ రెండో కుమార్తె హవ్యవాహిని వివాహం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులు హవ్యవాహిని, డాక్టర్ నిశాంత్‌ను ఆశీర్వదించారు.


మీ నవ్వులకు
థియేటర్లు బద్దలవుతాయ్

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకొన్న చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో వీ సెల్యులాయిడ్ సంస్థ నిర్మిస్తోంది. శుక్రవారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు కామెడీ సన్నివేశాలను డీల్ చెయ్యడంలో దర్శకుడు శ్రీహర్ష మరోసారి తన ప్రతిభను చూపించారు. ట్రెజర్ హంట్, హారర్, థ్రిల్లర్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు



కలిగిన ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ నెల 22న థియేటర్స్‌కు రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్లు బద్దలవుతాయ్. విమ్మల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. దర్శకుడు శ్రీహర్ష హిలేరియస్‌గా ఈ సినిమా తీశారు' అన్నారు. ట్రైలర్‌లో కంటే సినిమాలో ఎనర్జీ వంద రెట్లు ఎక్కువ ఉంటుంది. ఈ నెల 22న అందరూ మీ గ్యాంగ్స్‌తో రండి. టెన్ టైమ్స్ ఎంటర్‌టైన్ అవుతారు' అని చెప్పారు దర్శకుడు శ్రీహర్ష. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత సునీల్ బలుసు, ప్రియదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు

అమితాబ్‌కు యాంజియోప్లాస్టీ



బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ముంబైలోని కోకిలా బెన్ హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఆయన కాలికి యాంజియోప్లాస్టీ చేశారు. సాయంత్రం అమితాబ్ డిశ్చార్జి అయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. 'ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాను' అని బిగ్ బి సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుతం ఆయన 'కల్కి 2898 ఏడీ' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.



ఫిల్మ్ మేకర్ కథగా
'భరతనాట్యం'

సూర్య తేజ ఏలే, మీనాక్షి గోస్వామి నటిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్ ఘోష్, సలీం ఫేకు, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషించారు. పాయల్ సరాఫ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ మూవీ నుంచి 'చేశావు ఏదో మాయ' అనే సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే, ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఓ ఔత్సాహిక ఫిల్మ్‌మేకర్ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను ఇందులో చూపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ గిరిజాల, డీఓపీ: వెంకట్ ఆర్ శాకమూరి, సంగీతం: వివేక్ సాగర్, ఆర్ట్: సురేశ్ భీమగాని, పబ్లిసిటీ డిజైనర్: ధని ఏలే

'అర్జునుడి గీతోపదేశం'

వరలక్ష్మి శరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'అర్జునుడి గీతోపదేశం' చిత్రం శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సతీశ్ గోగాడ దర్శకత్వంలో త్రిలోక్‌నాథ్, ప్రదీప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు మల్లా సీతారామరాజు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, కనుమెలి అవిష్యరాజు తొలి క్లాప్ ఇచ్చారు. లక్కంశెట్టి వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 20 నుంచి అమలాపురంలో తొలి షెడ్యూల్ ప్రారంబిస్తున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నైలో షూటింగ్ చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, ఫొటోగ్రఫీ: చైతన్య కందుల, ఎడిటింగ్: అర్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరికృష్ణ





రతన్ టాటాకు పీ.వీ స్మారక అవార్డు

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పీ.వీ నరసింహారావు మెమోరియల్ అవార్డును ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా శుక్రవారం అందుకున్నారు. పీ.వీ నరసింహారావు స్మారక ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాడంచెట్టి అనిల్‌కుమార్, పీవీ మనుమడు, వ్యాపారవేత్త కశ్యప్ ముంబైలోని రతన్ టాటా ఇంటికి వెళ్లి ఆయనకు పురస్కారాన్ని బహూకరించారు. నరసింహారావు లాంటి గొప్ప వ్యక్తి పేరిట అవార్డు దక్కడం గర్వకారణమని రతన్ టాటా ఈ సందర్భంగా అన్నారు. పీవీ స్ఫూర్తితో దేశ నిర్మాణం కోసం యువత కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాంకేతిక వేత్త హనుమాన్ చౌదరి, టాటా ట్రస్ట్ జనరల్ మేనేజర్ శంతను నాయుడు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో మోదీ రోడ్ షో

(మొదటి పేజీ తరువాయి)

పలికారు. మీర్జాలగూడ నుంచి వీవీఎస్ కాలనీ, సాయిరాం థియేటర్, వెంకటేశ్వర నగర్ మజీద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీ పార్క్ మీదుగా మల్కాజిగిరి చౌరస్తా వరకు రోడ్ షో సాగింది. ప్రధాని వెంట రోడ్‌షోలో ఈటల రాజేందర్‌తో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉన్నారు. సాయంత్రం 5.42 గంటలకు బేగంపేటలో దిగిన మోదీకి ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఏ.వీ.రెడ్డి స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో 6.16 గంటలకు మీర్జాలగూడ వచ్చిన ప్రధానిని చూడగానే మోదీ.. మోదీ నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. దారి పొడవునా ఏర్పాటు చేసిన 60 స్వాగత వేదికల గుండా ఓపెన్ టాప్ జీపులో అభివాదం చేస్తూ మోదీ రోడ్ షోలో ముందుకు సాగారు. మల్కాజిగిరి చౌరస్తాలో ప్రధాని మాట్లాడతారని అంతా భావించారు. అయితే, ఆయన ప్రసంగం లేకుండా కేవలం అభివాదం చేస్తూ వెళ్లిపోవడంతో పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యాయి. సుమారు యాభై నిమిషాల పాటు సాగిన రోడ్ షోతో పరిసర ప్రాంతాలన్నీ బీజేపీ శ్రేణులతో కిక్కిరిసి పోయాయి. ప్రధాని రాక సందర్భంగా కళాకారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీ లత, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశర్‌రెడ్డి రోడ్ షోలో పాల్గొన్నారు.

నేడు నాగర్ కర్నూల్‌లో మోదీ సభ

నాగర్‌కర్నూల్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. నాగర్‌కర్నూల్‌లో శనివారం జరిగే బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఇందు కోసం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని వెలమ సంఘం కల్యాణ మండపం పక్కన సభా స్థలిని సిద్ధం చేస్తున్నారు. ఉదయం 10.45 గంటలకు నాగర్‌కర్నూల్ చేరుకోనున్న ప్రధాని.. గంట పాటు అక్కడ ఉంటారు.



రోడ్ షోలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, ఈటల రాజేందర్

అక్రమ మైనింగ్ కేసులో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సోదరుడి అరెస్టు

- గూడెం మధుసూదన్‌రెడ్డికి రిమాండ్
- అరెస్టును అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- కాంగ్రెస్‌లో చేరకపోతే అక్రమ కేసులా?: హరీశ్‌రావు ఆగ్రహం

పటాన్‌చెరు/సంగారెడ్డి క్రైం మార్చి15: అక్రమ మైనింగ్, క్వారీల నిర్వహణలో ఆరోపణలతో పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు, ఆ పార్టీ నేత మధుసూదన్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను కోర్టులో హాజరు పరచగా.. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. అయితే మధుసూదన్‌రెడ్డి తరలింపును బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబం మైనింగ్ నిర్వహిస్తుండగా.. పదేళ్లుగా వారు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా, ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అక్రమ మైనింగ్, క్వారీల నిర్వహణపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని మంత్రి దామోదర రాజనర్సింహ.. జిల్లా కలెక్టర్‌ను, సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం గూడెం మధుసూదన్‌రెడ్డి నడుపుతున్న సంతోష్ శాండ్ స్టోన్ క్వారీ, స్టోన్ క్రషర్లపై దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వం మైనింగ్‌కు కేటాయించిన స్థలం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహించడమే కాకుండా, ఆయనకు కేటాయించిన భూమిలోనూ ఎక్కువ మొత్తంలో మైనింగ్ చేశారని రెవెన్యూ, మైనింగ్ శాఖలు నివేదికలు సమర్పించాయి. ఈ మేరకు క్రషర్, క్వారీ యజమాని అయిన మధుసూదన్‌రెడ్డిపై రెండు నెలల క్రితమే పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, క్రషర్లను మూసివేశారు. కాగా, అరెస్టును తప్పించుకునేందుకు, ముందస్తు బెయిల్ కోసం మధుసూదన్‌రెడ్డి పలు ప్రయత్నాలు చేశారు. మధ్యలో ఆయన సోదరుడు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లడంతో అరెస్టును పోలీసులు వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. ఇటీవలే ఎమ్మెల్యే తిరిగి రావడంతో మధుసూదన్‌రెడ్డిని అరెస్టు చేశారు.



మధుసూదన్‌రెడ్డిని జిల్లా కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.. ఉద్రిక్తత

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పట్టణంలోని మధుసూదన్‌రెడ్డి నివాసం వద్దకు పోలీసులు చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకొని పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడికి బీఆర్ఎస్ శ్రేణులు చేరుకొని పోలీస్‌స్టేషన్ నుంచి సంగారెడ్డికి తరలిస్తుండగా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. భారీ బందోబస్తు మధ్య మధుసూదన్‌రెడ్డిని పోలీసులు సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. కాగా, మైనింగ్ కోసం ప్రభుత్వం నాలుగు ఎకరాలు కేటాయిస్తే మధుసూదన్‌రెడ్డి పది ఎకరాలు ఆక్రమించి మైనింగ్ నిర్వహిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై మైనింగ్ మినరల్ యాక్టు సెక్షన్ 21, 23తో పాటు 379, 420, 427, 442, 409 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. శుక్రవారం ఆయనను అదుపులోకి తీసుకున్న అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించి.. మధ్యాహ్నం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. 3వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి పి.తేజశ్రీ ఎదుట న్యాయవాదులు సుదీర్ఘంగా వాద ప్రతివాదనలు వినిపించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డికి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయనను పోలీసులు కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్టును బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావుతో కలిసి హరీశ్‌రావు పటాన్‌చెరుకు చేరుకుని విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించి వారిని కాంగ్రెస్ పార్టీలో చేరాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. పటాన్‌చెరు మండల పరిధిలో 38 క్రషర్లు, క్వారీలు ఉంటే కేవలం తమ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబం నిర్వహిస్తున్న క్రషర్, క్వారీని సీజ్ చేసి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిస్తేనే క్వారీపై విచారణకు వచ్చామని గతంలో ఆర్డీవో చెప్పిన వీడియోను విలేకరుల సమావేశంలో చూపిస్తూ.. ఇది రాజకీయ కక్ష సాధింపు కాదా? అని ప్రశ్నించారు. బెదిరించి మెడపై కత్తి పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదన్నారు. నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడంపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

హైదరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ సిటీ/తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంటు స్థానంలో మజ్లిస్ పార్టీని ఓడించి బీజేపీ జెండా ఎగరేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికిందరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట, అడ్డగుట్ట, తార్నాక, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈసారి బీజేపీ తెలంగాణలో మెజారిటీ సీట్లు సాధించబోతోందని చెప్పారు. కాగా, తెలంగాణలో లోక్ సభ ఎన్నికల తర్వాత ఇతర పార్టీలకు మనుగడ ఉండదని బీజేపీ నేత రఘునందన్ రావు తిరుమలలో అన్నారు. స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని చెప్పారు.

కమలం గూటికి జైపాల్ యాదవ్?

బీఆర్ఎస్‌ను వీడనున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే



ఆమనగల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ కారు దిగనున్నారు. ఆయన బీజేపీలోకి వెళుతున్నట్టు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచిన జైపాల్ యాదవ్.. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీపై ఆయన అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. మాజీ మంత్రి ఈటల రాజేందర్, పలువురు బీజేపీ అగ్రనేతలు జైపాల్ యాదవ్‌ను పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు తెలిసింది. అందుకు జైపాల్ కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. శనివారం నాగర్ కర్నూల్‌లో జరిగే ప్రధాని మోదీ సభలో జైపాల్ యాదవ్ బీజేపీలో చేరే అవకాశం ఉంది. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా.. కొందరు బీజేపీ అగ్రనేతలు పార్టీలోకి రావాలని కోరారని.. పార్టీ మార్పుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

కవిత ఇంటిపై ఈడీ దాడులు కుమ్మక్కు డ్రామాలో భాగం

రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లలో కాంగ్రెస్‌దే గెలుపు

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు డ్రామాలు మొదలయ్యాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇంట్లో జరిగిన ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు ఆ డ్రామాలో భాగమేనని తెలిపారు. కవిత అరెస్టు ద్వారా బీజేపీ రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల, నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కోమటిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. కవితను అరెస్టు చేయించడం వల్ల బీజేపీకి తెలంగాణలో మూడు సీట్లయినా వస్తాయని అమిత్‌షా భావనని విమర్శించారు. 'తెలంగాణలో బీఆర్ఎస్ కనుమరుగైపోయిందని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో 14 నుంచి 15 సీట్లు గెలవబోతోందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. మోదీ, కేసీఆర్ గల్లీలో కొట్లాడుకుంటారని, ఢిల్లీలో దోస్తానా చేస్తారని విమర్శించారు. కేసీఆర్.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాళ్లుపట్టుకొని బీఎస్పీతో పొత్తు కుదుర్చుకున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇక, పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుందని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత మాత్రమే ఆ పార్టీలో ఉంటారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కేసీఆర్ పీడ విరగడైందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. తాము ఆహ్వానిస్తే జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తారని ముక్తాయించారు. కాగా, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం ఒక నాటకం అన్నారు.

విచారణలో భాగంగానే కవిత అరెస్ట్

కక్ష సాధింపు అవసరం లేదు: కిషన్‌రెడ్డి



మల్కాజిగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాం నేపథ్యంలో విచారణలో భాగంగానే ఈడీ కవితను అరెస్ట్ చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కక్ష సాధింపు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్ షో ప్రారంభానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో ప్రమేయం లేకపోతే ఈడీ పలుమార్లు పిలిచినప్పుడు కవిత హాజరుకావాల్సి ఉండేదన్నారు. వాస్తవంగా ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల కుమ్మక్కుతోనే కవిత అరెస్టు

అప్రజాస్వామికం, అక్రమం, అనైతికం.. తీవ్రంగా ఖండిస్తున్నాం.. న్యాయపోరాటం చేస్తాం

- బీఆర్ఎస్‌ను దెబ్బ తీయాలనే కుట్ర
- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అరెస్టులు
- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు: మాజీ మంత్రి హరీశ్‌రావు
- కవిత నిర్దోషిగా తిరిగి వస్తారు: జగదీశ్

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ ఎమ్మెల్సీ కవిత అరెస్టు పూర్తి అప్రజాస్వామికం, అక్రమం, అనైతికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు కుమ్మక్కయ్యాయని, రాజకీయ దురుద్దేశంతోనే కవితను అరెస్టు చేయించారని ఆరోపించారు. కావాలనే శుక్రవారం సాయంత్రం అరెస్టు చూపించారని, శని, ఆదివారాలు కోర్టుకు సెలవులుంటాయని, బెయిల్ కూడా రాకూడదనే ఉద్దేశంతోనే ఇదంతా చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతోనే బీజేపీ అక్రమాలకు తెరతీసిందన్నారు. శుక్రవారం కవిత అరెస్టు అనంతరం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కవితను అరెస్టు చేపిస్తామంటూ కొద్దిరోజులుగా రాష్ట్ర బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు ఈడీ అధికారుల్లాగా పలుమార్లు ప్రకటనలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈడీ అధికారులు ముందే ప్లాన్ చేసుకొని వచ్చారని, ముందుగా సెర్చ్ మాత్రమే చేస్తామని చెప్పిన అధికారులు అనంతరం సాయంత్రం వేళ అరెస్టు చేశారని, అలాగే కవిత కోసం విమాన టికెట్లు బుక్ చేశారంటే వారి ముందస్తు ప్లాన్‌ను అర్థం చేసుకోవచ్చన్నారు. శనివారం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్న నేపథ్యంలో శుక్రవారం కవితను అరెస్టు చేయడమనేది తమ అధినేత కేసీఆర్‌ను నైతికంగా ఇబ్బంది పెట్టడమేనని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ దెబ్బ తీసి.. లబ్ధి పొందేందుకే బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రపన్నాయని ఆరోపించారు. ఇటువంటి కుట్రలు తమకు కొత్త కాదన్నారు. అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలు వంటివి ఎన్నో ఉద్యమ పార్టీగా చూశామని పేర్కొన్నారు. వాటిని ఎదురించి, ఛేదించి, తెలంగాణను సాధించామని చెప్పారు. కవిత అరెస్టును ఖండిస్తూ శనివారం అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కవిత అరెస్టును రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటామని, సుప్రీం కోర్టులో పిటిషన్ వేస్తామని హరీశ్‌రావు వెల్లడించారు. ఒకవైపు ఈడీ కేసుల్లో మహిళలను అరెస్టు చేయవచ్చా అన్న అంశంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోందని, దీనిపై ఈనెల 19న విచారణ జరగనున్న నేపథ్యంలోనే ఈ అరెస్టు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం చెప్పిన మాటకు విలువ లేకుండా ఒక మహిళను అరెస్టు చేయడమనేది కుట్రలో భాగమేనన్నారు. ఎన్నికల్లో అలవికాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లను (ఆడబిడ్డలను) మోసం చేసిందని హరీశ్ రావు ఆరోపించారు. మహాలక్ష్మిపేరిట మహిళలకు రూ.2500 ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని.. దీనిపై బాండ్ పేపర్ కూడా రాసిచ్చారని గుర్తు చేశారు. కవిత అరెస్టులో కుట్రకోణం ఉందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆమె నిర్దోషిగా తిరిగి బయటకు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు..



మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు: బీఎస్పీ

ఈడీని అడ్డుపెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కవితను అరెస్టు చేయించిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బీఎస్పీతో బీఆర్ఎస్ పొత్తుకు చేతులు కలిపిన కొన్ని గంటల్లోనే.. మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని 'ఎక్స్' వేదికగా ఆయన ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నడుపుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుదుర్చుకున్న లోపాయకారి ఒప్పందంలో భాగంగానే ఈ అరెస్టు జరిగిందన్నారు.

అంతా రాజకీయ కుట్ర: బీఆర్ఎస్ నేతలు

రాజకీయ కుట్రలో భాగంగానే ఈడీ ద్వారా కవితను అరెస్టు చేశారని బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కడియం శ్రీహరి, నిరంజన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ఎన్నికల్లో తమ పార్టీ నేతలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. ప్రజాక్షేత్రంలో రాజకీయంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కూతురిని చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

బతికే ఉన్నా డెత్ సర్టిఫికెట్ సృష్టించారు!

- ఆస్తి దక్కకూడదని అయినవారి నిర్వాకం
- న్యాయం కోసం ప్రజావాణికి మహిళ
- కౌలుకు తీసుకొని 6 ఎకరాలు కబ్జా
- 80 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన
- మొత్తంగా 1428 దరఖాస్తులు

బేగంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోయినట్లు అయినవాళ్లే డెత్ సర్టిఫికెట్ తీశారని, తాను బతికే ఉన్నానంటూ ఓ మహిళ 'ప్రజావాణి'ని ఆశ్రయించింది. బాధితురాలు ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లికి చెందిన ఆరెపల్లి పద్మ. బాధితురాలి వివరాల ప్రకారం.. బొగ్గుగనిలో పని చేసే ఆరెపల్లి చంటి ఈమెకు పెదనాన్న. తన సోదరుడి కుమార్తె అయిన పద్మను చంటి దత్తత తీసుకొని పెంచుకున్నాడు. భార్య చనిపోవడంతో చంటి రెండో వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత చంటి చనిపోవడంతో ఆస్తిపై కన్నేసిన ఆయన రెండోభార్య (పద్మ పిన్ని) అధికారులతో కుమ్మక్కై, పద్మ చనిపోయినట్లుగా డెత్ సర్టిఫికెట్ తీసుకుంది. దీనిపై బాధితురాలు స్థానిక అధికారులను కలిసినా స్పందన లేకపోవడంతో న్యాయం కోసం పద్మ శుక్రవారం ప్రజాభవన్‌లోని ప్రజావాణికి వచ్చింది. కాగా శుక్రవారం ప్రజావాణికి 1428 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూపరమైన సమస్యలపై 350, రేషన్‌కార్డుల కోసం 114, ఇందిరమ్మ ఇళ్ల కోసం 397 దరఖాస్తులున్నాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా డీఎస్సీ-2012లో మొదటి జాబితాలో ఎంపికైనా సవరణల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా రిజర్వేషన్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ సదరు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ప్రజావాణికొచ్చారు. ఇక 61 ఏళ్లు పైబడిన 3797 మంది వీఆర్ఏలు.. తమ వారసులకు నియామక పత్రాలు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలంటూ ప్రజావాణికొచ్చి విజ్ఞప్తి చేశారు. వారితో చిన్నారెడ్డి, దివ్య దేవరాజ్ మాట్లాడారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. తన ఆరు ఎకరాల భూమిని కౌలుకు సాగుచేసే వారే కబ్జా చేశారంటూ భూపాలపల్లి మండలం ఆదనగర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు లక్ష్మి ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను చెప్పేవరకు ఇక్కడ నుంచి వెళ్లనని ఆమె భీష్మించడంతో పోలీసులు ఆమెకు నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించారు.



బాధితురాలు పద్మ

రేవంత్ పాలనపై ప్రజల్లో సంతృప్తి

- బీఆర్ఎస్‌లో సంస్థాగత నిర్మాణ లోపం
- కాంగ్రెస్‌లో చేరాలని అధిష్ఠానం నుంచి నా కుమారుడు అమిత్‌రెడ్డికి ఆఫర్ వచ్చింది: గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో సంస్థాగత నిర్మాణ లోపం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల నుంచి సమన్వయం లేకపోవడం వల్లనే తన కుమారుడు అమిత్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపీగా పోటీచేయడం లేదన్నారు. తాము పార్టీ మారతామన్నది అంతా ఊహాగానమేనని సుఖేందర్‌రెడ్డి చెప్పారు. అయితే, కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ అధిష్ఠానం నుంచి అమిత్‌రెడ్డికి ఆఫర్ వచ్చిందని తెలిపారు. తాను శాసనమండలి ఛైర్మన్‌గా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నానని, ఏ రాజకీయ పార్టీలో చేరాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రేవంత్ తమకు బంధువైనప్పటికీ శాసనసభ సమావేశాల సందర్భంగా, కార్యక్రమాల్లో కలవడమే తప్ప వ్యక్తిగతంగా ఏనాడూ కలవలేదన్నారు. వేంనరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తన కుమారుడు అమిత్ కలవడం వెనక రాజకీయాలేమీ లేవని సుఖేందర్‌రెడ్డి చెప్పారు.

బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్

- నాగర్‌కర్నూల్‌లో ప్రవీణ్‌కుమార్ పోటీ
- బీఆర్ఎస్-బీఎస్పీ మధ్య పొత్తుపై స్పష్టత

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరింది. లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ రెండు స్థానాల్లో పోటీ చేయనుంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేయనున్నారు. మరో లోక్‌సభ స్థానమైన హైదరాబాద్ అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కాన్షీరాం జయంతి సభలో ప్రవీణ్‌కుమార్.. బీఆర్ఎస్‌తో పొత్తు, తమకు కేటాయించిన స్థానాలపై అధికారికంగా ప్రకటించారు. బీఎస్పీ పోటీ చేసే స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ చేయబోదన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతితో చర్చించిన తర్వాతనే పొత్తుపై స్పష్టతకు వచ్చినట్లు ఆయన తెలిపారు. పొత్తుకు సహకరించిన మాయావతి, బీఎస్పీ రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీగౌతమ్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రవీణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు.

ప్రభుత్వాన్ని పడగొట్టాలని పగటి కలలు

- బీఆర్ఎస్, బీజేపీ ప్రజాతీర్పును గౌరవించట్లేదు: మల్లు రవి
- బీఆర్ఎస్‌కు ఊపిరి పోసేందుకే కవిత అరెస్టు: నిరంజన్

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్, బీజేపీ గౌరవించట్లేదని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆ రెండు పార్టీలు పగటి కలలు కంటున్నాయని ఎద్దేవా చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 సీట్లలోనూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పదేళ్లు రాష్ట్రాన్ని నియంతలా పాలించారని విమర్శించారు. కొన ఊపిరితో ఉన్న బీఆర్ఎస్‌కు ఊపిరి పోయడానికే బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. ఇది బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కై ఆడుతున్న డ్రామా అంటూ కొట్టిపారేశారు. మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహిస్తున్న సమయంలో కవితను అరెస్టు చేసి నాటకాన్ని రక్తికట్టించారని ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రజల ఆకాంక్షల మేరకు రేవంత్ సర్కారు పాలన కొనసాగుతోందని, గడిచిన వంద రోజుల్లో రోజుకో సమస్యను పరిష్కరించిందని ఆ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. రేవంత్ వంద రోజుల పాలనపై ప్రజలు పండగ చేసుకోవాలన్నారు. రాహుల్ గాంధీ.. మహిళా పక్షపాతి అని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావ్ అన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, ఐదు గ్యారెంటీలను ప్రకటించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెడతామని మాటిచ్చి పెట్టకుండా మాదిగ సామాజిక వర్గాన్ని ప్రధాని మోదీ చేశారని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రీతం అన్నారు.

అంకితభావంతోనే టీఎస్ఆర్టీసీకి అవార్డులు

- 'ట్రాన్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డుల' కార్యక్రమంలో సజ్జనార్



కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) అయిదు ప్రతిష్ఠాత్మక అవార్డులు టీఎస్ఆర్టీసీకి దక్కడం ఎంతో గర్వకారణమని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడం వల్లే సంస్థకు ఈ పురస్కారాలు వరించాయని కొనియాడారు. శుక్రవారం న్యూ ఢిల్లీలో 'నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్ పోర్ట్ ఎక్సలెన్స్' అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఆర్‌టీయూ అధ్యక్షుడు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ చేతుల మీదుగా సజ్జనార్ నేతృత్వంలోని ఆర్టీసీ అధికారులు అవార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. ఈ పురస్కారాలతో జాతీయ స్థాయిలో టీఎస్ఆర్టీసీ ఖ్యాతి మరింతగా పెరిగిందని, 43 వేల టీఎస్ఆర్టీసీ కుటుంబసభ్యులకు ఈ అవార్డులను అంకితం చేస్తున్నాని సజ్జనార్ అన్నారు. 2022-23 ఏడాదికి గాను రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ తదితర విభాగాల్లో ఆర్టీసీకి ఐదు అవార్డులు దక్కాయి.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు సర్కారు చేయూత..

- 2 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు
- సీఎం నిర్ణయంపై గల్ఫ్ ప్రవాసీయుల్లో హర్షం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)/ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వెళ్లి చనిపోయిన సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు వలస కూలీల కుటుంబాలను రేవంత్ సర్కారు ఆదుకుంది. ఇరు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి సాయం విడుదల చేస్తూ శుక్రవారం జీవోలు జారీ చేసింది. సౌదీ అరేబియాలో గతేడాది డిసెంబరు 7న కోనారావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన బొడ్డు బాబు, అదే నెల 12న బహ్రెయిన్‌లో వేములవాడ మండలం మర్రిపెల్లికి చెందిన శశికుమార్ మరణించారు. ఇదే విషయమై.. గల్ఫ్‌లో మరణించిన ప్రవాసీయుల కుటుంబాలను ఆదుకోవాలని.. దీనికోసం విధివిధానాలను రూపొందించాలని ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఈ నేపథ్యంలోనే బొడ్డు బాబు భార్య శిరీష, శశికుమార్ భార్య మాధవిల పేరిట రూ.5 లక్షల చొప్పున చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. చెక్కులను ఆయా కుటుంబాలకు అందజేయాల్సిందిగా ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ముఖ్యమంత్రి నిర్ణయంపై గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ ప్రవాసీయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోళ్లపై న్యాయ విచారణకు జూన్ 30 గడువు

- యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్లపై కూడా..
- విచారణాంశాలపై ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాలతోపాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై న్యాయ విచారణను జూన్ 30వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరింది. పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిషన్‌కు విచారణ అంశాలను నిర్దేశిస్తూ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సమగ్ర కుల గణనకు ఉత్తర్వులు

- రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యారంగాల వారీగా సర్వే
- రాజకీయంగా ఏ కులానికి ఎన్ని పదవులనే దానిపైనా..
- గణనకు ఫిబ్రవరి 16న అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం
- నెలలోపే ఉత్తర్వు.. త్వరలో సర్వే సమగ్ర విధివిధానాలు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల్లో ఒక్కో దానిని అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సమగ్ర కుల గణనకు ఉత్తర్వులు వెలువరించింది. నెల క్రితం మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న సర్కారు.. ఆ వెంటనే ఫిబ్రవరి 16న అసెంబ్లీలో తీర్మానం చేసింది. దానికి అనుగుణంగా శుక్రవారం ఉత్తర్వులను జీవో నం.26 జారీ చేసింది. ప్రజల జీవన స్థితిగతులు, వారి వివరాలను శాస్త్రీయంగా సేకరించేందుకు కుల గణన చేపడతామని, జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కుల గణనలో ఇంటింటి సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో ఆయా కులాల పరిస్థితిని తెలుసుకోనున్నారు. దీంతోపాటు రాజకీయంగా ఏ కులానికి ఎన్ని పదవులు ఉన్నాయనే దానినీ నమోదు చేస్తారు. కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి దాక ఈ వివరాలను సేకరించనున్నారు. మరోవైపు కుల గణన చేపట్టేందుకు బీసీ సంక్షేమ శాఖ రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసింది. కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల ప్రణాళికలను రూపొందించడానికి వీలుగా చేపట్టే కుల గణన రాష్ట్ర చరిత్రలో అత్యంత కీలక నిర్ణయమని ప్రభుత్వం పేర్కొంది. సర్వే విధి విధానాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు సర్కారు తెలిపింది.

చరిత్రాత్మక ప్రక్రియకు నాంది: వకుళాభరణం

కుల గణనపై జీవో జారీ చేయడం చరిత్రాత్మక ప్రక్రియకు నాంది అని, సువర్ణ అధ్యాయానికి తెరతీస్తుందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జీవో విడుదల హర్షణీయం: జాజుల

రాష్ట్రంలో కుల గణనకు జీవో జారీ పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ కుల గణన నిర్వహించి, లెక్కలు తేల్చాలని రెండు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. ఇంటింటి సర్వేలో వివరాలు సమగ్రంగా సేకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లోకి దానం నాగేందర్!

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కూడా.. బీఆర్ఎస్‌ను వీడుతున్న నేతలు

- ముఖ్యమంత్రి రేవంత్‌తో ఇరువురి భేటీ
- 18న పార్టీలో చేరే అవకాశం
- దానంకు సికింద్రాబాద్ లేదా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ?



సీఎం రేవంత్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరుతున్న జితేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఖైరతాబాద్/అఫ్జల్‌గంజ్/వరంగల్ మార్చి 15(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. బీఆర్ఎస్ నేత, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపుగా ఖాయమైంది. ఈ మేరకు ఇరువురు నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం వేర్వేరుగా కలిశారు. సీఎం నివాసానికి వెళ్లిన వెళ్లిన దానం నాగేందర్... అక్కడ రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. ఇక, వరంగల్ ఎంపీ దయాకర్ సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ఈ భేటీ జరిగింది. దానం నాగేందర్, పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 18న ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో వారు పార్టీలో చేరే అవకాశం ఉందని వెల్లడించాయి. అంతేకాక, దానం నాగేందర్‌కు సికింద్రాబాద్, మల్కాజిగిరిలో ఏదో ఒక స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. కాగా, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నంద కిశోర్ వ్యాస్ బిలాల్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు.

సొంతగూటికి దానం..

కాంగ్రెస్‌లోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన దానం నాగేందర్.. 2004 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి ఆసిఫ్‌నగర్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కానీ ఎంఐఎం అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి గెలిచి 2014 వరకూ మంత్రిగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఓటమి పాలైన దానం 2018 ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ తన సీటును నిలబెట్టుకున్నారు. బీఆర్ఎస్‌లో తగినంత ప్రాధాన్యం లభించకపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి సొంత గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే, దానం నాగేందర్‌ను తిరిగి పార్టీలోకి తీసుకోవడంపై ఖైరతాబాద్ నియోజవర్గం కాంగ్రెస్ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. నాగేందర్‌ను పార్టీలో తీసుకోవద్దంటూ పలువురు మహిళా నేతలు గాంధీభవన్ వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. మరోపక్క, సిటింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌ను కాదనీ కడియం కావ్యకు కేసీఆర్ వరంగల్ టికెట్ కేటాయించారు. ఈ నేపథ్యంలో దయాకర్ కాంగ్రెస్‌లో చేరుతుండడం ఆసక్తికరంగా మారింది.

హస్తం గూటికి జితేందర్ రెడ్డి

- బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- రేవంత్, భట్టి, ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరిక
- కుమారుడు మిథున్ రెడ్డి కూడా..
- ప్రభుత్వ సలహాదారు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

హైదరాబాద్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి బీజేపీకి గుడ్‌బై చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు! ఆ వెంటనే ఆయన్ను ప్రభుత్వ పదవులూ వరించాయి! ఈ మేరకు శుక్రవారం పరిణామాలన్నీ చకచకా జరిగిపోయాయి. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగిన జితేందర్ రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి ఆ పార్టీ టికెట్‌ను ఆశించారు. అక్కడ పార్టీ టికెట్ డీకే అరుణకు రావడంతో జితేందర్ రెడ్డి తీవ్ర నిరాశకు గురైన సంగతి తెలిసిందే. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా జితేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఆ మేరకు రేవంత్‌తో చర్చలు జరిపిన జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాక సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జితేందర్‌కు దీపామున్షీ దాస్ పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి కూడా పార్టీ కండువా కప్పుకొన్నారు. ఆ వెంటనే జితేందర్‌రెడ్డిని క్యాబినెట్ ర్యాంకుతో కూడి న ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) పదవిలో, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతిని ధి పదవిలో ప్రభుత్వం నియమించింది. ఈ మేర కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

- అటవీ, పర్యాటక శాఖలు కలిసి పని చేయాలి
- కాలుష్యం లేని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- అటవీశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అటవీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. శుక్రవారం సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అటవీ అందాలు, వన్య ప్రాణులు, వలస వచ్చే విదేశీ పక్షులు, విభిన్న జీవ వైవిధ్యమున్న ప్రాంతాలు, సంస్కృతీ సంప్రదాయాలకు, ప్రాచీన వారసత్వ సంపదకు అద్దం పట్టే ప్రాంతాలన్నింటినీ గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణలో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లో కూడా పర్యాటకులు విడిది చేసేలా ప్రాజెక్టులు ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి, అటువంటి ప్రాజెక్టులను రాష్ట్రంలోనూ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలపై నిషేధం ఎత్తివేయాలని అధికారులు కోరగా.. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆ అంశంపై నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పారు. ఏటా పర్యావరణ దినోత్సవం వంటి సందర్భాల్లో.. కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటూ జీరో పొల్యూషన్ విధానాలను పాటించే సంస్థలకు ప్రశంస పత్రాలను, ప్రోత్సాహకాలను అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం అమలుపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించే ప్లాస్టిక్ పరిశ్రమలకు భారీగా జరిమానాలు విధించాలని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 81 ఐఎఫ్ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది అధికారులు మాత్రమే ఉన్నారని, మిగిలిన ఖాళీలను భర్తీ చేసేలా ఐఎఫ్ఎస్‌లను కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నామని ఆయన వెల్లడించారు.

పాత కరెంట్ చార్జీలే..

- కొత్తగా పిటిషన్లు వేసేదాకా పాత చార్జీల వసూలుకు ఈఆర్సీ అనుమతి.. ఉత్తర్వులు జారీ
- అదనపు సర్‌చార్జీ యూనిట్‌కు రూ.1.40 ఖరారు

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనల పిటిషన్లు దాఖలు చేసేదాకా 2024-25 ఆర్థి క సంవత్సరంలో పాత కరెంట్ చార్జీలే (2023-24లో ఖరారు చేసిన) వసూలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) అనుమతిచ్చింది. ప్రస్తుతానికి కొత్తగా పిటిషన్లు వేయలేమని, అప్పటిదాకా పాత చార్జీలే వసూలు చేసేందుకు అనుమతినివ్వాలంటూ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ నేపథ్యంలో పాత చార్జీల వసూలుకు అనుమతిస్తూ ఈఆర్సీ ఛైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు మనోహర్‌రాజు, బి.కృష్ణయ్యలు శుక్రవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. దీంతో రెండు డిస్కమ్‌లతోపాటు సిరిసిల్ల సహకార విద్యుత్ సొసైటీ (సెస్)లో పాత చార్జీలు వర్తింపచేయనున్నారు. కొత్త పిటిషన్ వేసే దాకా పాత వీలింగ్ చార్జీలే వసూలు చేయనున్నారు. కొత్తగా పిటిషన్లు దాఖలు చేయాలని డిస్కమ్‌లకు ఈఆర్సీ ఆదేశాలిచ్చింది. ఇక టీఎస్ జెన్‌కో చార్జీలకు సంబంధించి కూడా ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చింది. రెగ్యులర్ పిటిషన్ వేసే దాకా పాత స్థిర, ఇంధన చార్జీలు వసూలు చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఇదిలా ఉండగా.. ఓపెన్ యాక్సెస్(బహిరంగ విపణి) నుంచి కరెంట్ కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.1.40 అదనపు సర్‌చార్జీ కింద వసూలు చేసుకోవడానికి ఈఆర్సీ అనుమతిచ్చింది. 2024-25 ఆర్థిక సం వత్సరం తొలి అర్ధవార్షికం (1-4-2024 నుంచి 30-9-2024 దాకా)లో యూనిట్‌కు రూ.1.95 వసూలు చేసేందుకు డిస్కమ్‌లు పిటిషన్ వేయగా.. యూనిట్‌కు రూ.1.40కు అనుమతిచ్చారు. ఇక వినియోగ దారులు గ్రీన్ ఎనర్జీ నుంచి కరెంట్‌ను కొనుగోలు చేస్తే వారికి అదనపు సర్‌చార్జీ వర్తించదు.

జీరో బిల్లుపై నేడు ఉత్తర్వులు..

గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల దాకా గృహ వినియోగదారులకు ఉచితంగా ప్రభుత్వం కరెంట్‌ను సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై దాఖలైన పిటిషన్‌పై శనివారం ఈఆర్సీ ఉత్తర్వులు ఇవ్వనుంది. ముందస్తుగా ప్రభుత్వం సబ్సిడీని విడుదల చేస్తే తప్ప జీరో బిల్లు జారీ చేయడానికి వీల్లేదని ఎలక్ట్రిసిటీ యాక్ట్ నిబంధనలున్నాయి. ఈ నేపథ్యంలో ఈఆర్సీ ఉత్తర్వులు వెలువరించనుంది.

4% రిజర్వేషన్లను తొలగించడం మోదీ, షా వల్ల కాదు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు వేయగా సీనియర్ న్యాయవాదులను నియమించిందని గుర్తుచేశారు. అంత కష్టపడి సాధించిన ఈ రిజర్వేషన్లను కాపాడే బాధ్యత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముస్లింలకు ప్రాధాన్యం ఇస్తామని.. ఎక్కడ అవకాశం ఉన్నా వారి వాటా వారికి వస్తుందని చెప్పారు. వీసీల ఎంపికలోనూ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ముస్లింల ఇంటి వద్దకే రుణాలు, పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఆయనకు సెక్రటరీగా జన్నత్ హుసేన్ ఉండేవారని.. ఇప్పుడు తనకు షానవాజ్ ఖాసిం ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ, టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా ముస్లింను నియమించామని వివరించారు. మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని భర్తీ చేశామన్నారు. కాగా, హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి, మత సామరస్యం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్వేషాలు వ్యాపింపజేసే వారిని, ఇళ్లను కూల్చేవారిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఏఏపై కాంగ్రెస్ విధానం ఏమిటో సీఎం ప్రకటన చేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. సమావేశానికి ముందు ముస్లిం అనాథ చిన్నారులకు సీఎం రేవంత్ బహుమతులు అందించారు. ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముస్లింలు భారీగా హాజరయ్యారు. మహిళలూ పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎల్బీ స్టేడియం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ముస్లిం టోపీ పెట్టుకున్న ఫొటోతో భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. కాగా, రంజాన్ మాసం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల వరకు హోటళ్లు, దుకాణాలు తెరిచి ఉంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి ఇచ్చినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు వెంటనే విడుదల చేయనున్నదని చెప్పారు.



సీఎం రేవంత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఓవైసీ తదితరులు

ఆధ్యాత్మికతకు దిక్సూచి భారత్!

- మన సంస్కృతి, సంప్రదాయాలతో శాంతిసామరస్యాలు
- దేశంలో విశ్వ గురువులుండటం మన భాగ్యం: రాష్ట్రపతి ముర్ము
- రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్, గవర్నర్

షాద్‌నగర్/కొత్తూర్, శంషాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేదభూమి, కర్మభూమిగా ఉన్న భారత్.. ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మికత పరంగా దిక్సూచిగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు శాంతిసామరస్యాలను పంచుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో ఎంతో మంది సన్యాసులు, విశ్వగురువులు ఉన్నారని, ఇది మన భాగ్యం అని ఉద్ఘాటించారు. ఆధ్మాతికతతో ప్రజలకు తమ భవిష్యత్తును ఆనందమయంగా మార్చుకునే శక్తి లభిస్తుందని, ఆధ్యాత్మిక శక్తిని పొందాలనుకునే వారు ధ్యానాన్ని సాధన చేయాలని పేర్కొన్నారు. ధ్యాన సాధన ద్వారానే ఆయా దేశాలు వేగంగా పురోగతి సాధిస్తున్నాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ అధ్మాత్మిక మహోత్సవానికి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాంచంద్రమిషన్(హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్) గురూజీ కమలేశ్‌జీ పటేల్ (దాజి) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వ అధ్మాత్మిక వేదిక ద్వారా మన దేశం విశ్వ విజేత దిశగా పయనించాలని అభిలషిస్తున్నట్లు చెప్పారు. సామరస్యాన్ని చాటేందుకు ప్రపంచంలోనే 160దేశాలను హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కాగా ధ్యానంతో భవిష్యవాణి చెప్పవచ్చునని 1895లో స్వామి వివేకానంద షికాగోలో వివరించారని, యాభై ఏళ్ల తర్వాత భారత్‌లోనే ఇది సాధ్యమవుతుందని ఆయన అన్నారని కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘవాలే పేర్కొన్నారు. స్వామి వివేకానంద కల ఇవాళ నిజమైందన్నారు. మనమంతా ఒక్కటేనని ప్రతి వ్యక్తి తన మనసులో అనుకుంటే గనక ఆధ్యాత్మిక భావన పెంచుకోవచ్చునని రాంచంద్రమిషన్ అధ్యక్షుడు కమలేశ్‌జీ పటేల్ పేర్కొన్నారు. శాంతిబోధనల ద్వారా ప్రపంచంలో ఉన్న స్వర్గాన్ని భూ మండలానికి తీసుకవచ్చే శక్తి ఆధ్యాత్మికతకు ఉందని చిన్నజీయర్ అన్నారు. అంతకు ముందు కన్హా శాంతి వనం ఆవరణలో రాష్ట్రపతి మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆపోలో ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ ఉపాసన, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పలువురు ఆధ్యాత్మిక గురువులు, ఆయా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు రాష్ట్రపతి ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనస్వాగతం పలికారు.


బంజారాహిల్స్ నివాసం నుంచి బయటకు వస్తున్న కవిత..


కారెక్కుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అభివాదం చేస్తూ..


కవితను తీసుకెళ్తుండగా అడ్డుపడిన కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు

ఎన్నికలతో సంబంధం లేదు: షా

ఈడీ కవితను అరెస్టు చేయడానికి, ఎన్నికల షెడ్యూలుకూ సంబంధం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. నేరంపై దర్యాప్తు జరిపే సంస్థలు ఎప్పుడు అవసరమైతే అప్పుడు సోదాలు జరిపి అరెస్టు చేస్తాయని ఆయన ఢిల్లీలో చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎప్పుడు అరెస్టు అవుతారో కూడా చెప్పలేనని, అది ఈడీయే చెప్పాలని, ఎవర్నీ దేశ హోంమంత్రి అరెస్టు చేయబోరని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్ ముఖ్యులతో కేసీఆర్ భేటీ

కవిత అరెస్టు నేపథ్యంలో ఏం చేద్దాం? అంటూ.. కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్యులతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భేటీ అయ్యారు. నందినగర్‌లోని తన నివాసంలో హరీశ్ రావు, కేటీఆర్, సంతోష్‌కుమార్‌తోపాటు ఒకరిద్దరు ఇతర నేతలతో సమావేశమయ్యారు. తదుపరి చర్యలపై వారితో చర్చించినట్లు తెలుస్తోంది.

కవిత అరెస్ట్



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని వెళ్తారని అంతా భావించినా.. అందుకు భిన్నంగా జరిగింది. ఈడీ అధికారులు కవిత నివాసంలోకి ప్రవేశించిన వెంటనే ఆమెతో పాటు ఇంట్లోని సిబ్బంది ఫోన్లను కూడా స్వాధీనం చేసుకోవడంతో లోపల ఏం జరుగుతుందనే విషయం బయటకు వచ్చేందుకు కొంత సమయం పట్టింది. కాగా, కవిత అరెస్టును బీఆర్‌ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించింది. అరెస్టును సవాలు చేస్తూ కవిత తరఫు న్యాయవాదులు శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. మరోవైపు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది.

ఇంట్లోకి ఎవరినీ రానివ్వకుండా..

శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఈడీ ప్రత్యేక బృందం.. మధ్యాహ్నం 1.30 గంటలకు కవిత ఇంటికి చేరుకుంది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ మీనా నేతృత్వంలో 12 మంది అధికారుల ప్రత్యేక బృందంలో ఇద్దరు మహిళా అధికారులు ఉన్నారు. కవితతోపాటు ఇంట్లో ఉన్న సిబ్బంది ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు.. కేంద్ర బలగాల సహాయంతో గేటు వద్ద పహారా ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న కవిత తరఫు న్యాయవాదులు అక్కడికి వచ్చి.. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా వారు అడ్డుకున్నారు. కాగా, ఈడీ అధికారుల రాకను ఏమాత్రం ఊహించని కవిత.. ఒకింత షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత తేరుకుని దర్యాప్తు అధికారులకు సహకరించారు. వారి సూచన మేరకు తాను ఉపయోగిస్తున్న రెండు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈడీ బృందం అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సుమారు నాలుగు గంటలపాటు ఈడీ అధికారులు తనిఖీలు, విచారణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5.20 నిమిషాలకు కవితను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో మనీలాండరింగ్ కోణంలో పీఎంఎల్‌ఏ యాక్ట్ ప్రకారం కవితను అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్.. అరెస్ట్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈసీఐఆర్/హెచ్ఐయూ -2/14/2022లో మనీలాండరింగ్ అభియోగాలపై అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం కారణాలు పొందుపరిచిన 14 పేజీలను కవిత భర్త అనిల్‌కుమార్‌కు ఈడీ అధికారులు అందజేశారు. కవిత అరెస్టును ధ్రువీకరిస్తూ ఈడీ సిబ్బంది ఇంటి గేటు వద్దకు వచ్చి చెప్పివెళ్లడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కవిత అరెస్ట్ సమయంలో ఆమె సోదరుడు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పలువురు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు ఆమె నివాసంలోనే ఉన్నారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని కేటీఆర్ ఈడీ అధికారుల్ని ప్రశ్నించారు. ఈడీ అధికారిణి భానుప్రియ మీనా తనిఖీలు పూర్తయినట్లు చెప్పారని, ఆ తర్వాత అరెస్ట్ చేస్తున్నట్లు చెప్పారని, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా అరెస్ట్ చేస్తే.. చట్టప్రకారం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈడీ అధికారుల్ని కేటీఆర్ హెచ్చరించారు. ఈరోజు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచేందుకు అవకాశం లేదంటూనే.. అరెస్టు అని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఉద్దేశ పూర్వకంగానే ఈడీ అధికారులు శుక్రవారం వచ్చారని, ఇది సరికాదని అన్నారు. సోదాలు ముగిసిన తర్వాత కూడా కుటుంబసభ్యులను ఇంట్లోకి రావద్దంటూ హుకుం జారీ చేయడమేంటని అధికారులను ప్రశ్నించారు. పార్టీ నాయకులను, కుటుంబ సభ్యులను ఇంటి లోపలికి రానివ్వకపోవడంతో స్థానిక పోలీసులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాసనమండలి అధికారులకు సమాచారమిచ్చి..

కవిత ఎమ్మెల్సీ కావడంతో ఆమె అరెస్ట్ సమాచారాన్ని ఈడీ అధికారులు శాసనమండలి అధికారులకు చేరవేసినట్లు తెలిసింది. సాయత్రం 7.10 గంటలకు కవితను తన నివాసం నుంచి ఆమె సొంత వాహనంలోనే పోలీస్ కాన్వాయ్‌తో శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకెళ్లారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో విమానంలో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లారు. కాగా, కవితను విమానాశ్రయానికి తరలించే సమయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. పార్టీ శ్రేణులకు కవిత విక్టరీ సింబల్, పిడికిలి చూపించారు. వాహనంలో ఈడీ అధికారులతోపాటు కవిత భర్త అనిల్‌కుమార్ ఉన్నారు. విమానాశ్రయంలోనూ భర్తతో కవిత కొంత సమయం మాట్లాడారు.

పంచనామాలో పేర్కొన్న అంశాలివే..

కవిత అరెస్ట్ సమయంలో పంచనామాలో ఈడీ అధికారులు పూర్తి వివరాలు పొందుపరిచారు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఇద్దరు అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. మనీలాండరింగ్ యాక్ట్ -2002 ప్రకారం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కవితకు వివరించారు. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ మీనా, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.హెచ్.జోగేందర్, సుమిత్ గోయల్, ఇతర ఈడీ అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న కవితకు తమను తాము ఈడీ అధికారులుగా పరిచయం చేసుకుని సెర్చ్ వారెంట్ చూపించారు. ఆమె నుంచి అనుమతి సంతకం తీసుకున్న అనంతరం తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం 6.45 గంటలకు ముగిశాయి. తనిఖీల్లో భాగంగా కవిత నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం సాయంత్రం 5.20 గంటలకు ఆమెను అరెస్ట్ చేశారు. కాగా, సాయంత్రం 6గంటల ప్రాంతంలో కవిత సోదరుడు, న్యాయవాదులుగా చెప్పుకొంటూ సుమారు 20మంది చట్టవిరుద్ధంగా ఇంట్లోకి ప్రవేశించారని పంచనామాలో పేర్కొన్నారు. వారి గుర్తింపు కార్డులు చూపించాలని కోరగా.. వాగ్వాదానికి దిగారని తెలిపారు.

ఏ మాత్రం హడావిడి లేకుండా..

గతంలో కేంద్ర దర్యాప్తు అధికారులు కవితను విచారించేందుకు వచ్చిన సమయంలో ఆమె ఇంటి వద్ద ఎంతో హడావిడి ఉండేది. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకోవడం, భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసేవారు. కవిత నివాసానికి దారితీసే రోడ్డును చాలా దూరంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసి.. అనుమతి లేని వారి రాకపోకల్ని అడ్డుకునేవారు. కానీ, శుక్రవారం అలాంటి పరిస్థితులు కనిపించలేదు. ఈడీ బృందం కవిత ఇంటికి చేరుకున్నా పోలీసుల హడావిడి కనిపించలేదు. సాయంత్రం అరెస్ట్‌పై ఈడీ ప్రకటన వెలువడ్డ తర్వాత వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏసీపీ, కొంత మంది సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కవితను అరెస్ట్ చేసి తీసుకెళ్లే సమయంలో ఎస్కార్ట్ సదుపాయం కల్పించారు. శంషాబాద్ విమానాశ్రయంలోనూ ముందుజాగ్రత్త చర్యగా కొంత భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఎప్పుడేం జరిగిందంటే...

- ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఈడీ ప్రత్యేక బృందం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో రెండు వాహనాల్లో కవిత ఇంటికి చేరుకున్నారు.
- గంట తర్వాత విషయం బయటకు రావడంతో న్యాయవాదులు, నేతలు అక్కడికి చేరుకున్నారు.
- 4 గంటలకుపైగా సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు.. కేసు విషయంలో ఆమెను ప్రశ్నించారు.
- సాయంత్రం 5.20 గంటలకు కవితను అరెస్ట్ చేస్తున్నట్లు ఈడీ అధికారులు ప్రకటించారు.
- సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించిన కేటీఆర్, మరికొందరు.
- 6.45 గంటలకు ముగిసిన ఈడీ తనిఖీలు
- అరెస్ట్ ప్రొసీజర్ అనంతరం సాయంత్రం 7.10 గంటలకు కవితను ఆమె నివాసం నుంచి శంషాబాద్ విమానాశ్రయం తరలించారు.
- రాత్రి 8.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, 8.45 గంటలకు విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లారు.

బీజేపీ పాలనలో ప్రత్యర్థులపై కక్షసాధింపు: కేటీఆర్



పదేళ్ల బీజేపీ పాలనలో రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యల కోసం అధికారాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగపరచడం సాధారణంగా మారిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో ఆరోపించారు. కవిత అరెస్టు విషయం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఈడీ వ్యవహరించిన తీరు, ప్రదర్శించిన తొందరపాటు చర్యలకు సుప్రీంకోర్టులో సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. కచ్చితంగా ఈ నెల 19న జరిగే సుప్రీంకోర్టు విచారణలో ఈ అంశం పరిగణనలోకి వస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఈడీ స్వయంగా సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని (అండర్ టేకింగ్) తుంగలో తొక్కిందని, చివరకు న్యాయమే గెలుస్తుందని పేర్కొన్నారు. ఈడీ అధికారులు కవితను ఢిల్లీకి తరలించిన నేపథ్యంలో.. కేటీఆర్ శుక్రవారం రాత్రి హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కాగా, కవితను ఎందుకు అరెస్టు చేస్తున్నారో.. ఈడీ అధికారులు చెప్పలేదని.. బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా.. ఎన్నికల ముందు అరెస్టులేంటని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు.

కారుతో దోస్తీ లేదని చాటుకోవటానికే!

తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ వ్యూహం

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లను గెలుచుకొని, రాష్ట్ర రాజకీయాలపై పట్టు బిగించేందుకే బీజేపీ కార్యాచరణ చేపట్టిందా? ఇందులో భాగంగానే బీఆర్‌ఎస్‌ను బలహీనపరిచి రాష్ట్రంలో ఓ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావిస్తోందా? బీఆర్‌ఎస్‌తో తమకు తెర చాటు బంధం లేదని ఎంత చెప్పినా ప్రజలు విశ్వసించని నేపథ్యంలోనే కవిత అరెస్టు ద్వారా బ్రహ్మాస్త్రం ప్రయోగించిందా?.. అంటే అవుననే అంటున్నాయి బీజేపీ వర్గాలు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 13 స్థానాలు గెలుచుకోవడం లక్ష్యంగా పని చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా స్థానిక నాయకత్వానికి దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే. దక్షిణాదిన తమ విస్తరణకు తెలంగాణ కీలకమని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఆ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు తమ వైపు వచ్చే అవకాశం లేదని గుర్తించి.. బీఆర్‌ఎస్‌పై గురిపెట్టినట్లు తెలుస్తోంది. ఒకవైపు, బీఆర్‌ఎస్ సిటింగ్ ఎంపీలతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతల కోసం ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టిన బీజేపీ, మరోవైపు బీఆర్‌ఎస్‌ను బలహీనపరిచేందుకు అంతర్గత కార్యాచరణకు నడుం బిగించిందన్న ప్రచారం జరుగుతోంది. ఇద్దరు బీఆర్‌ఎస్ ఎంపీలతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఇటీవల బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టయితే ఆ పార్టీపై మరింత ప్రభావం చూపుతుందని, గులాబీ నేతలు ఎక్కువ మంది తమవైపు వస్తారన్న అంచనాల్లో బీజేపీ ముఖ్యనేతలు ఉన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు శుక్రవారం హైదరాబాద్ గడ్డపై కాలుపెట్టిన సందర్భం... మరోవైపు ఎన్నికల షెడ్యూలుకు 24 గంటల ముందు.. కవితను ఈడీ అరెస్టు చేయడం రాజకీయాల్లో సంచలనం సృష్టించింది.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే ప్రచారం

వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందే కవితను అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. అయినా కవిత అరెస్టు కాలేదు. ఆమెను అరెస్టు చేస్తే, బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా సానుభూతి పవనాలు వీయవచ్చని బీజేపీ అధిష్ఠానం భావించినందువల్లే అరెస్టు జరగలేదని విశ్లేషణలు వెలువడ్డాయి. ఇదే అదనుగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనంటూ కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేసింది. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ-బీఆర్‌ఎస్ ఒక్కటేనన్న ప్రచారం కాంగ్రెస్‌కు అనుకూలించిందన్న అభిప్రాయం బీజేపీ వర్గాల్లో బలంగా ఉంది. కవితను అరెస్టు చేసి ఉంటే సమీకరణాలు మరోలా ఉండేవని, అసెంబ్లీ ఎన్నికల్లో తమకు గణనీయంగా సీట్లు లభించి ఉండేవని ఆ పార్టీకి చెందిన ఒక ముఖ్యనేత పేర్కొన్నారు. బండి సంజయ్‌ని అకస్మాత్తుగా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి ఎందుకు తప్పించారు? కవితను ఎందుకు అరెస్టు చేయలేదు? అంటూ కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు తమ వద్ద సమాధానాలే ఉండేవి కావని మరో నేత తెలిపారు. ఇదే అంశాన్ని లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థానిక నేతలు, పార్టీ ఎమ్మెల్యేలు జాతీయ నాయకత్వానికి నివేదించారు. బీజేపీ-బీఆర్‌ఎస్ ఒక్కటేననే ప్రచారాన్ని కాంగ్రెస్ మరోసారి చేస్తోందన్న సంగతినీ తెలియజేశారు. కవిత అరెస్టు జరిగితే దీన్ని తిప్పికొట్టటంతోపాటు తమకు బీఆర్‌ఎస్‌తో పొత్తు లేదని నిరూపించుకున్నట్లు అవుతుందని తెలిపారు. మరోవైపు, బీఆర్‌ఎస్‌తో ఎలాంటి పొత్తూ లేదని పార్టీ జాతీయ నాయకత్వం అంతర్గత సమావేశాల్లో పలుమార్లు చెప్పినా రాష్ట్ర శ్రేణులు నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. కేసీఆర్‌ను వ్యతిరేకించి బీజేపీలో చేరిన సీనియర్ నేతలు కొంతమంది కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే, కవిత అరెస్టు జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌తో తమకు అవగాహన లేదని నిరూపించుకోవాల్సిన అనివార్య పరిస్థితుల్లోనే కవిత అరెస్టుకు కేంద్రంలోని పెద్దలు పచ్చజెండా ఊపి ఉంటారని పేర్కొంటున్నారు. మరోవైపు, ఎలక్టోరల్ బాండ్స్ అంశం బీజేపీకి తలనొప్పిగా మారిన నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకే కవిత అరెస్టు జరిగిందన్న వాదనా రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.


ఢిల్లీకి వెళ్లేముందు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్సీ కవిత



కొడుక్కి ముద్దుపెట్టి..

ఈడీ బృందం సోదాలు జరిపిన అనంతరం ఎమ్మెల్సీ కవితను అదుపులోకి తీసుకొని ఢిల్లీకి తరలిస్తున్న నేపథ్యంలో.. ఆమె తన కొడుక్కి ముద్దుపెట్టి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. అదేసమయంలో తనను చూసేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలకు కవిత అభివాదం చేస్తూ.. అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. రాజకీయ కక్షసాధింపు చర్యలను న్యాయపరంగా ఎదుర్కొందామని పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు.


కవితను సముదాయిస్తున్న భర్త అనిల్ కుమార్

సరిగ్గా ఏడాది తర్వాత..

గత ఏడాది మార్చిలో ఈడీ విచారణ.. తాజాగా కల్వకుంట్ల కవిత అరెస్ట్

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను 2023 మార్చిలో ప్రశించిన ఈడీ అధికారులు.. సరిగ్గా ఏడాది తర్వాత అరెస్టు చేశారు. గత ఏడాది మార్చి 11న ఢిల్లీలోని ఏపీజే అబ్దుల్ కలామ్ రోడ్డులో ఉన్న ఈడీ కార్యాలయంలో కవితను ఏడు గంటలపాటు ఈడీ విచారించింది. మార్చి 9న ఆమెకు సమన్లు పంపిన ఈడీ.. మార్చి 11వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రశ్నల వర్షం కురిపించింది. విజయ్ నాయర్, అరుణ్ రామచంద్ర పిళ్లై, ఆడిటర్ బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి తదితరులు ఇచ్చిన వాంగ్మూలాలను కవిత ముందు ఉంచి సమాధానాలు రాబట్టింది. అతి తక్కువ వ్యవధిలోనే పది ఫోన్లను ఎందుకు మార్చాల్సి వచ్చింది లేదా ధ్వంసం చేయాల్సి వచ్చింది?అని ప్రశ్నించింది. ఆ సమయంలోనే కవిత వాడుతున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత ఈడీ పలు మార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ.. కవిత హాజరు కాలేదు. మహిళను ఆమె ఇంటి వద్దే విచారించాలంటూ నళినీ చిదంబరం కేసులో ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈడీ విచారణకు బ్రేక్ పడినట్లయింది. కాగా, అంతకుముందు 2022 డిసెంబరు 11న సీబీఐ కూడా కవితను హైదరాబాద్‌లో విచారించింది. తాజాగా గత నెల 26న కవితను నిందితురాలిగా విచారించేందుకు 41-ఏ కింద సీబీఐ నోటీసులు ఇచ్చింది. అయితే, తనను విచారించే విషయమై ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించానని, ఎన్నికల వేళ తాను బిజీగా ఉన్నానని విచారణకు హాజరు కాలేనని ఆమె లేఖ రాశారు. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంలో ఈనెల 19న కూడా విచారణ జరగాల్సి ఉంది.



ఎప్పుడెప్పుడు.. ఏం జరిగిందంటే..

లిక్కర్ స్కామ్‌పై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా విచారణకు ఆదేశించడంతో 2022 ఆగస్టు 17న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ తర్వాత నాలుగు రోజులకు ఆగస్టు 22న ఈడీ ఈసీఐఆర్ దాఖలు చేసింది. అదే ఏడాది నవంబరు 25న తొలి చార్జిషీటు దాఖలైంది. 2021 జూన్‌లో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు సౌత్ గ్రూప్ పేరుతో ఢిల్లీ రాజకీయ నేతలతో లావాదేవీలు జరిపారని అందులో పేర్కొంది. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తరఫున విజయ్ నాయర్ మొత్తం వ్యవహారాన్ని నిర్వహించారని వెల్లడించింది.

సీబీఐ చార్జిషీటు ప్రకారం దొడ్డిదారిన అక్రమార్జన కోసమే ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారు. హోల్‌సేల్‌గా 12 శాతం లాభాలు, రిటైల్‌గా 185శాతం లాభాలు ఆర్జించాలని ప్రణాళికలు రచించారు. ఢిల్లీలో హోల్‌సేల్ వ్యాపార సంస్థ అయిన ఇండో స్పిరిట్ గ్రూప్‌నకు 65శాతం వాటా కేటాయించేందుకు అంగీకరించారు. ఇందులో సౌత్ గ్రూప్‌నకు ప్రత్యక్షంగా, పరోక్షంగా 9 రిటైల్ జోన్లను కేటాయించారు.

2021 జనవరిలో హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో కవిత బినామీగా భావిస్తున్న అరుణ్ రామచంద్ర పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు తదితరులు విజయ్ నాయర్‌తో సమావేశమయ్యారు.

కవితతోపాటు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి, శరత్ రెడ్డి ఉండగా.. వారికి అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు, అభిషేక్.. సౌత్ గ్రూప్ ప్రతినిధులుగా వ్యవహరించారు. 2021 జూలై-సెప్టెంబరు మధ్య రూ.30కోట్లు హవాలా మార్గం ద్వారా మళ్లించారు.

2021 సెప్టెంబరు 20న ఢిల్లీలో మద్యం ఉత్పత్తిదారు ఫెర్నార్డ్ ఇచ్చిన విందుకు అభిషేక్, అరుణ్ పిళ్లై, శరత్ చంద్రారెడ్డి హాజరయ్యారు. 2022 ఏప్రిల్ 8న కవిత, అరుణ్ పిళ్లై కలిసి ఢిల్లీలోని ఓబెరాయ్ హోటల్‌లో విజయ్ నాయర్, దినేశ్ అరోరాను కలిసి తమకు రావాల్సిన ముడుపుల గురించి చర్చించారు.

2022 సెప్టెంబరు నుంచీ అరెస్టులు మొదలయ్యాయి. మొదట ఇండో స్పిరిట్ యజమాని సమీర్ మహేంద్రు, నవంబరులో శరత్‌చంద్రారెడ్డి, బినయ్ బాబు, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అమిత్ అరోరా అరెస్టయ్యారు.

2023 ఫిబ్రవరి 26న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది. 2023 జూన్‌లో శరత్ చంద్రారెడ్డి, సెప్టెంబరులో మాగుంట రాఘవరెడ్డి, దినేశ్ అరోరా... అప్రూవర్లుగా మారారు. తాజాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చుట్టూ ఉచ్చు బిగించేందుకు కవిత అరెస్టు తప్పనిసరి అయిందని ఈడీ వర్గాలు అంటున్నాయి.

ఆ పిటిషన్‌పై విచారణ 19కి వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది. మహిళలను దర్యాప్తు కార్యాలయాల్లో కాకుండా ఇంటివద్దనే విచారించేలా ఆదేశించాలంటూ గత ఏడాది మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. కవిత తరఫున విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. గత విచారణ సందర్భంగా 'రెగ్యులర్ కేసులను విచారించే' (నాన్ మిస్‌లీనియస్) మంగళ, బుధ, గురువారాల్లో విచారిస్తామని చెప్పారని, కానీ 'తాజా పిటిషన్లు విచారించే' (మిస్‌లీనియస్) శుక్రవారం నాడు ధర్మాసనం ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ కేసును నాన్‌మిస్‌లీనియస్ రోజు విచారించాలని ధర్మాసనాన్ని కోరారు. ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.


కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ ఆమె నివాసం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కవిత నివాసం వద్ద ఉద్రిక్తత

బంజారాహిల్స్/సుభాష్‌నగర్: కవిత నివాసం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. ప్రధాని మోదీకి, ఈడీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కవిత నివాసంలో సోదాలు జరుగుతున్న విషయం బయటకు పొక్కడంతో భారీగా బీఆర్‌ఎస్ శ్రేణులు, భారత జాగృతి కార్యకర్తలు ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా కాపలా ఉన్న అధికారులు అనుమతించలేదు. దీంతో వారు గో బ్యాక్ ఈడీ అంటూ బైఠాయించారు. రంగంలోకి దిగిన పోలీసులు కవిత నివాసానికి వెళ్లే దారులను బారికేడ్లతో మూసివేసి కార్యకర్తలను ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. మరోవైపు.. ఎమ్మెల్సీ కవితను అరెస్టును నిరసిస్తూ భారత జాగృతి, బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాగా, కవిత అరెస్టును స్వాగతిస్తూ భువనగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు. అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని మునిసిపల్ వైస్‌చైర్మన్ దశరథ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ అన్నారు.





Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***K. Srinivas****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి


నవ్య స్మార్ట్

9

శనివారం • 16 మార్చి 2024

స్పోటిఫై నుంచి మ్యూజిక్ వీడియోలు





స్పోటిఫై మ్యూజిక్ వీడియోలను అధికారికంగా సపోర్ట్ చేస్తోంది. ఇప్పటికిది బేటా ఫీచర్‌గా స్పోటిఫై పేర్కొంది. ప్రస్తుతానికి 11 దేశాల్లో మాత్రమే లభ్యమవుతుంది. ఇందులో ఇండియా లేదు. ఈడీ షీరన్, ఐస్ స్పైస్, అలూనా, అసోకే కు ప్రస్తుతానికి మద్దతు ఇస్తోంది. రాబోయే రోజుల్లో వేలకొద్దీ పాటలను కలుపుకోనుంది. ఈ సదుపాయం లభించాలంటే సాంగ్ టైటిల్‌పై 'స్విచ్ టు వీడియో ఐకాన్' కనిపించాలి. దాన్ని టాపింగ్ చేస్తే సాంగ్ రీస్టార్ట్ అవుతుంది. మ్యూజిక్ వీడియో ఫుల్‌స్ర్కీన్ కోసం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లపై రొటేట్ చేయవచ్చు. మళ్లీ మామూలుగా కావడానికి కూడా స్విచ్ టు ఆడియో పైనే టాప్ చేయాలి. డెస్క్‌టాప్, టీవీ డివైజుల్లోనూ అందుబాటులో ఉంటుంది. అయితే డివైజ్ ఏదైనా సరే, ప్రీమియమ్ చందాదారులకు మాత్రమే వీక్షించగలరు.

వాట్సాప్‌లో చాట్ ఫిల్టర్స్

వాట్సాప్ - చాట్ ఫిల్టర్స్‌పై పనిచేస్తోందని సమాచారం. దీనిపై గత ఏడాది వేసవి తిరిగి సెప్టెంబర్‌లో పని చేసినప్పటికీ పురోగతి లేదు. ప్రస్తుతం మళ్లీ దీనిపై వాట్సాప్ దృష్టిసారించిందని 'డబ్ల్యుబేటాఇన్ఫో' తెలిపింది.



బేటా టెస్టర్లకు ప్రస్తుతం దీన్ని విడుదల చేస్తున్నట్టు కూడా పేర్కొంది. అలాగే ఆ నివేదికలో బైటపెట్టిన స్ర్కీన్‌షాట్ ప్రకారం వాట్సాప్‌లో కాన్వర్సేషన్ లిస్టులో టాప్‌లో చాట్ ఫిల్టర్స్ ఉన్నాయి. చదవని సంభాషణల కోసం ఒకటి, గ్రూప్ చాట్స్ లిస్టింగ్స్ కోసం మరొకటి చాట్ ఫిల్టర్లు ఉండనున్నాయి. ఇంతకుముందు పర్సనల్, బిజినెస్ చాట్స్ కోసం ఫిల్టర్లను పెట్టి ఒక ప్రయోగం చేసింది. ప్రస్తుతం వాటిని పక్కన పెట్టేసింది. సంభాషణల నిర్వహణ, చాంతాడు జాబితా నుంచి ప్రత్యేకించిన చాట్స్‌ను కనుగొనడం వంటి పనులకు ఈ ఫిల్టర్లు ఉపయోగపడతాయి. మేనేజింగ్ కమ్యూనికేషన్స్ విషయానికి వస్తే వాట్సాప్ ప్రత్యేకంగా చాట్స్ పిన్ చేయడం, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ కాన్వర్సేషన్స్ ఇండికేట్ చేయడానికి మరొకటి ఫీచర్లపై కూడా వాట్సాప్ పనిచేస్తోంది.

స్లాక్ నుంచి జీఐఎఫ్ ఫైండర్



వ్యాపారాలు, టీమ్స్ కోసం ఉద్దేశించి కమ్యూనికేషన్ టూల్స్‌గా స్లాక్ ప్రసిద్ధి. టీమ్ పరిధిలో ఈమెయిల్, ఫోన్ కాల్స్‌కు స్వస్తిపలికేలా చేసింది. ఇప్పుడు ఇదే కమ్యూనికేషన్ టూల్ తాజాగా జీఐఎఫ్ ఫీచర్‌ను కలిపింది. టీమ్ సభ్యుల మధ్య ఫన్ కోసం దీన్ని క్రియేట్ చేసింది. రోజువారీ మెసేజింగ్‌లో జీఐఎఫ్‌కు ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. జీఐఎఫ్‌ని ఇంటిగ్రేట్ చేసినట్టు స్లాక్ ప్రత్యేకించి ఎక్స్‌లో పోస్టు చేసింది. దీంతో పర్ఫెక్ట్ జీఐఎఫ్‌ను యూజర్లు సెలెక్ట్ చేసుకోగలుగుతారు. కొత్త ఫీచర్ కాస్తా ఇప్పుడు గూగుల్‌కు చెందిన జీఐఎఫ్ సెర్చ్ ఇంజిన్‌గా మారింది. ఈ ఫీచర్ సహాయంతో వేలాది జీఐఎఫ్‌లు యూజర్లకు అందుబాటులోకి వచ్చాయి. స్లాక్‌పై జీఐఎఫ్‌ల కోసం అవసరమైన చాట్‌ను ఓపెన్ చేయాలి. తదుపరి ఎమోజీ ఐకాన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ జీఐఎఫ్ ట్యాబ్ కనిపిస్తుంది. పాపప్ అయిన వాటి నుంచి ఎంచుకుని జతచేసుకోవాలి. అప్పై షేర్ చేసుకోవాలి.



వచ్చే నెలలో మైక్రోసాఫ్ట్ కోపైలెట్ సెక్యూరిటీ

మైక్రోసాఫ్ట్ కోపైలెట్ సెక్యూరిటీ మొత్తానికి వచ్చే నెలలో విడుదల కానుంది. ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. ఏఐ సైబర్ సెక్యూరిటీ సెంట్రిక్ చాట్‌బోట్ ఇది. గత ఏడాది మార్చిలోనే దీనిని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. సరిగ్గా ఏడాది తరవాత వాస్త వరూపం దరిస్తోంది. భద్ర తకు సంబంధించి సందేహాల నివృత్తికి తోడు బెదిరింపులపై దర్యాప్తు, విశ్లేషణలను కూడా ఇది చేపడుతుంది. పాతిక వరకు భాషలను సపోర్ట్ చేస్తుంది. థ్రెట్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి డేటా పెద్ద ఎత్తున దీని వద్ద పోగుపడి ఉంది. 78 ట్రిలియన్ల మేర సెక్యూరిటీ సిగ్నల్స్‌ను ప్రతి రోజూ ప్రాసెస్ చేస్తోంది. దీనికి తోడు లాంగ్వేజ్ మోడల్స్‌ను కూడా అవసరానికి తగ్గట్టు రూపొందిచగలుగుతోంది. ఈ చాట్‌బోట్ రెండు వెర్షన్స్‌లో లభ్యమవుతుంది. అందులో మొదటిది వివిధ సంస్థల్లో అమలులో ఉన్న సెక్యూరిటీ సిస్టమ్‌కు అనుగుణ్యమైనది. మరొకటి అక్కడి వ్యక్తులకు సహాయపడేది కాగా ఈ సర్వీసును గంటకు నాలుగు డాలర్లు చొప్పున నెలవారి బిల్లింగ్‌కు మాట్లాడుకోవాల్సి ఉంటుంది.



ఆండ్రాయిడ్ యూజర్లకు కాల్ టు వీడియో ఫీచర్

ఆండ్రాయిడ్ యూజర్లు ఇకపై రెగ్యులర్ వాయిస్ కాల్స్‌ను వీడియో కాల్స్‌గా మార్చుకునే సౌలభ్యాన్ని పొందనున్నారు. ప్రస్తుతం ఇదే పనిపై గూగుల్ ఉందని, సదరు ఫీచర్ టెస్టింగ్‌లో ఉందని తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకించి బటన్ సహాయంతో పెద్దగా ఇబ్బంది పడకుండానే వాయిస్ నుంచి వీడియో కాల్‌కు మారవచ్చు. ఐఫోన్‌లో ఫేస్‌టైమ్ అనుభవం మాదిరిగా ఉంటుంది. ఆండ్రాయిడ్ 14పై రన్ అవుతున్న కొన్ని పిక్సెల్ ఫోన్లకు ఈ ఫీచర్‌ను మొదట అందుబాటులోకి తేనున్నారు. తదుపరి క్రమక్రమంగా దీన్ని విస్తరించనున్నారు. ఈ ఫీచర్‌తోనే ఆండ్రాయిడ్ యూజర్లు ఏకంగా ఐఫోన్ యూజర్లతో వీడియోకాల్స్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే గూగుల్ మీట్ యాప్ ఆండ్రాయిడ్ డివైజ్‌లో ఉండాలి. నేటివ్ యాప్ పరిధిలో మీట్ యాప్‌తో ఇంటిగ్రేట్ అయి సులువుగా పని అవుతుంది. మీట్ యాప్ లేకుంటే దానిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రాంప్ట్ అందుతుంది. ఐఫోన్ మాదిరిగా కాకుండా ఆండ్రాయిడ్ డివైజుల్లో ఫ్లెక్సిబిలిటీ ఉంటుంది. మూడో పార్టీ యాప్‌లను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

గమ్మా యాప్ : ఏఐ టూల్స్



గమ్మా యాప్ - ప్రజంటేషన్స్ నుంచి వెబ్ పేజీల క్రియేషన్ వరకు రూపకల్పనకుగాను ఏఐ టూల్స్‌ను జతచేసింది. ముఖ్యంగా పనిచేసే చోట ప్రజంటేషన్స్, డాక్యుమెంట్స్ రూప కల్పన సర్వసాధారణం. వీటి కోసం ఉద్యోగులు చాలా పెద్ద ఎత్తున శ్రమపడాల్సి ఉంటుంది కూడా. అయితే గమ్మా యాప్ తాజాగా కలిపిన ఏఐ టూల్స్ సహకారంతో చాలా వేగంగా ఈ పనులను చక్కబెట్టవచ్చు. ఈ టూల్స్ సహాయంతో డాక్యుమెంట్స్ తదితరాల రూపకల్పన చిటికెలో పూర్తవుతుంది. పేరు సూచిస్తే చాలు, పనిని సదరు టూల్స్ పూర్తి చేస్తాయి.




కంటెంట్ రైటింగ్‌తో మొదలుపెట్టి రిఫైనింగ్ వరకు పనులన్నీ చకచకా జరుగుతాయి. ఇందుకోసం...

- గమ్మాకు చెందిన ఏఐ జనరేటర్ - లేఔట్స్ డిజైన్, డిజైన్స్, యూజర్ ప్రాంప్టర్, డాక్యుమెంట్స్, వెబ్ పేజీల తయారీలో సహాయపడుతుంది.
- ఫార్మేటింగ్, స్టయిలింగ్, పొజిషనింగ్ తదితర విషయాల్లో యూజర్ ఆందోళన చెందాల్సిన పని ఉండదు. సింగిల్ క్లిక్‌తో ప్రొఫెషనల్ లుక్‌తో ప్రజంటేషన్‌ను రూపొందిస్తుంది.
- లైవ్ ప్రజంట్ మోడ్‌లో గమ్మా వస్తుంది. యూజర్లు ఈ ప్రజంటేషన్లను షేర్ చేసుకోవచ్చు.
- టెక్స్ సమ్మరైజింగ్, రీరైటింగ్, ఎస్ఈఓ, ఏఐ ఇమేజ్ సెర్చ్ సహా పలు పనులను గమ్మా నిర్వర్తిస్తుంది.
- జీఐఎఫ్‌లు, వీడియోలు, వెబ్‌సైట్స్, చార్టులు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

ఉచితంగా కొన్నిఫీచర్లు మాత్రమే యూజర్లకు అందుబాటులో ఉంటాయి. నెలకు పది డాలర్లు చెల్లిస్తే ఈ యాప్‌నకు చెందిన అడ్వాన్స్‌డ్ ఫీచర్లను ఉపయోగించుకోవచ్చు.



గూగుల్ మెసేజెస్‌కు ఆర్‌సీఎస్ కస్టమైజేషన్



గూగుల్ మెసేజెస్ - కొత్త రంగులు, థీమ్స్‌తో ఆర్‌సీఎస్ కస్టమైజేషన్‌ను తీసుకువచ్చింది. రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్‌గా దీన్ని పలువురు ఉపయోగిస్తుండటం తెలిసిందే. ప్రస్తుత ఫీచర్ జోడింపుతో యూజర్లకు ఇక పర్సనలైజేషన్‌కు అవకాశం ఉంటుంది. ఈ అనుభవం ఆండ్రాయిడ్‌లో లభిస్తుంది. గత నవంబర్ నుంచి దీనిపై పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇది బేటా టెస్టర్లకు అందుబాటులోకి వస్తోంది. '9టు5గూగుల్' ప్రకారం యూజర్లు తమ ఆర్‌సీఎస్ చాట్‌లో కస్టమ్ బబుల్స్ రంగులో నేపథ్యం పొందవచ్చు. చేంజ్ కలర్స్ ఆప్షన్స్ ఉంటుంది. చాట్ ఇంటర్‌ఫేస్‌కు థీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బ్లూ, గ్రీన్ సహా తొమ్మిది థీమ్ ఆప్షన్స్ ఉన్నాయి. ఈ మార్పుతో ఆర్‌సీఎస్ చాట్ యావత్తు కొత్తగా కనిపిస్తుంది. దీని కోసం మూడుచుక్కలపై టాప్ చేయాలి. చేంజ్ కలర్స్ దగ్గరకు వెళ్లి తొమ్మిది డిఫరెంట్ కలర్ ఆప్షన్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా ఒకసారి ఆర్‌సీఎస్ చాట్ రంగు మార్చుకుంటే, ఆ మార్పు చాట్ ఇంటర్‌ఫేస్‌లోనూ కనిపిస్తుంది. 'యూ చేంజ్డ్ ద థీమ్' అని మెసేజ్ వస్తుంది.

థీమ్‌ను వేరే రంగులోకి మార్చాలని అనుకుంటే ఇంటర్‌ఫేస్ ఒక లింక్‌ను కూడా చూపుతుంది. అలా ఈ ఫీచర్ ప్రస్తుతానికి టెస్టింగ్ దశలో ఉందని సమాచారం.

3డీ వీడియో గేమ్స్‌కు 'సైమా'



గూగుల్ డీప్‌మైండ్ ప్రత్యేకించి 3డీ వీడియో గేమ్స్ కోసం విలక్షణ ఏఐ మోడల్‌ను పరిచయం చేసింది. స్కేలబుల్ ఇన్‌స్ట్రక్టబుల్ మల్టీవరల్డ్ ఏజెంట్(ఎస్ఐఎంఏ - సైమా)అని ఈ ఏఐ మోడల్‌ని అంటారు. వేర్వేరు గేమింగ్ వాతావరణాల్లో టాస్క్‌లను నెరవేర్చే పనిని తెలుసుకుంటోంది. ఇంకా పరిశోధన స్థాయిలోనే ఉంది. ఒకసారి ఇది పక్కాగా రూపొందితే ఆన్‌లైన్ నుంచి రియల్ వరల్డ్ వరకు ఉపయోగించుకోవచ్చని గూగుల్ పేర్కొనడం విశేషం. లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్‌ను క్రియేట్ చేసేందుకు ఎయిట్ గేమ్ స్టూడియోతో గూగుల్ డీప్‌మైండ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. సైమాని తొమ్మిది వేర్వేరు గేమ్స్ కోసం శిక్షణ ఇప్పించింది. హెలోగేమ్స్, టియర్‌డౌన్, గోట్ సిమ్యులేటర్ 3 వంటివి ఈ గేమ్స్‌లో ఉన్నాయి. ఇందులో ప్రతి గేమ్ వేర్వేరు ఆబ్జెక్టులు, మెనూతో ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది. అలాగే నాలుగు వేర్వేరు రీసెర్చ్ పరిస్థితులను కూడా కంపెనీ కల్పించింది. తద్వారా కన్‌స్ట్రక్షన్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందులోనే స్కల్చర్స్ నుంచి అన్నీ రూపొందుతాయి. సైమా ఇప్పటికి 600 వరకు బేసిక్ స్కిల్స్‌ను నేర్చుకుంది. మొత్తమ్మీద మనుషుల ఆదేశాల మేరకు 3డీ వీడియో గేమింగ్‌కు సాధ్యమయ్యేందుకు చురుకుగా వ్యవహారాలు సాగుతున్నాయి.

టెంపరేచర్‌పై పేటెంట్!

యాపిల్ - టెంపరేచర్ మెజర్‌మెంట్‌పై పేటెంట్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. యాపిల్ వాచీలో ప్రధానంగా డివైజ్ అలాగే పరిసరాల్లోని ఉష్ణోగ్రతలో ఉండే హెచ్చుతగ్గులను సమన్వయం చేయడం ఇందులోని ఉద్దేశం. దీనికి పేటెంట్ లభిస్తే మామ్మూలు థర్మామీటర్లకు మూడినట్లేనని నిపుణులు చెబుతున్నారు. ఐఫోన్ ఉత్పత్తిదారులు బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్ ఫీచర్‌ని తమ స్మార్ట్ వాచీల్లో తీసేసిన నేపథ్యంలో ఈ పెటెంట్ చర్చనీయాంశమైంది. యాపిల్ లేటెస్ట్ వాచీల్లో ఇప్పటికే బాడీ టెంపరేచర్ సెన్సర్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 7న తాజా పేటెంట్ కోసం యాపిల్ దరఖాస్తు చేసినట్టు తెలిసింది. బాడీ టెంపరేచర్ లెక్కింపులో ఇది నాన్ ఇన్వేజివ్ మెథడ్‌ను ఉపయోగిస్తుంది. ప్రస్తుతం ఉన్న వాచీలు శరీర ఉష్ణోగ్రతలను మాత్రమే తీసుకుంటున్నాయి. నిజానికి హెచ్చుతగ్గులు డివైజ్ అదే విధంగా పరిసరాలను బట్టి ఉంటాయి. పేటెంట్ తీసుకోనున్న విధానంలో డివైజ్‌లోని రెండు లొకేషన్స్‌కు ఉన్న తేడాని కూడా లెక్కిస్తారు. ఇక్కడ హీట్ ఫ్లక్స్ అంటే ఒక యూనిట్ ఏరియాలో - ఒక యూనిట్ టైమ్ లేదా సర్ఫేస్ నుంచి బదిలీ అయ్యే హీట్ అర్థం. మనిషి చర్మంలోని హీట్ ఫ్లక్స్ ఆధారంగా కరెక్షన్ ఫ్యాక్టర్‌ని లెక్కిస్తుంది. ఉపరితల వేడిని లెక్కించేందుకు ఒకటి లేదా అంతకుమించి అల్గోరిథమ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది. సర్ఫేస్ టెంపరేచరని ఉపయోగిస్తామని పేటెంట్‌లో పేర్కొన్నారు. అలాగే పెటెంట్ అయిన వాచీలో మందంగా ఉండే థెర్మోపైల్ ఫిల్మ్ రెండు జంక్షన్లను కలిపి ఉంచుతుంది. మొత్తమ్మీద యావత్తు ప్రక్రియ ఇంకా కాన్సెప్ట్ దశలోనే ఉంది. అన్నీ పూర్తి చేసుకుని ఉనికిలోకి వస్తుందా లేదా అన్నది ప్రశ్నార్థకం. పేటెంట్‌కు దరఖాస్తు చేసినంతమాత్రాన అది ఆమోదం పొంది, మార్కెట్లోకి వస్తుందని చెప్పలేమని కూడా అంటున్నారు.





గూగుల్ పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్'



గూగుల్ తన పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్' ఫీచర్‌ను విడుదల చేసే పనిలో ఉన్నట్టు 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. ఈ ఫీచర్‌తో ఫోన్ స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా మోడిఫై చేసుకోవచ్చు. దీని కోసం సెట్టింగ్స్‌లోకి వెళ్లి డిస్‌ప్లేని టాప్ చేయాలి. టచ్ సెన్సిటివిటీని ఎంచుకోవాలి. ఇప్పటివరకు పర్యావరణ శక్తుల ప్రభావంతో ఆటోమేటిక్‌గా అడాప్టివ్ టచ్ కలుగుతుందన్న విషయాన్ని గుర్తించలేదు. వన్‌ప్లస్ 12కి చెందిన అక్వా టచ్ మాదిరిగా ఈ ఫీచర్ ఉంటుందని భావిస్తున్నారు. ఫోన్ వేడెక్కినప్పుడు ఈ ఆక్వా టచ్ ఫీచర్ దాని టచ్ సెన్సిటివిటీని అడ్జస్ట్ చేస్తుంది. ఈ ఫీచర్ పిక్సెల్ 9 సిరీస్‌కే పరిమితమా, మిగిలిన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లకు వస్తుందా అన్నది మాత్రం తెలియరాలేదు. మూడు నెలలకు ఒకసారి పిక్సెల్ ఫీచర్ డ్రాప్ అప్‌గ్రేడ్ ఉంటుంది. అయితే కావాలనే పాత పిక్సెల్స్‌ను గూగుల్ విడిచిపెడుతోంది.

SONY

పీఎస్5 సిస్టమ్‌కు సాఫ్ట్‌వేర్ అప్డేట్



సోనీ - ప్లేస్టేషన్(పీఎస్)5కి అప్డేట్‌తో ఆడియోపరంగా డ్యూయల్‌సెన్స్ కంట్రోలర్‌ను మెరుగుపర్చింది. దాంతో మరికొన్నింటిని కూడా జతచేసింది. కాన్సోల్‌పై టర్న్ అయినప్పుడు యూజర్లకు ఈ అప్డేట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కనిపిస్తుంది. ఈ అప్డేట్‌తో డ్యూయల్‌సెన్స్‌పై స్పీకర్లు, డ్యూయల్‌సెన్స్ ఎడ్జ్ బిగ్గరగా మారుతాయి. వాయిస్ చాట్ ఆడియో, గేమ్ శబ్దాల్లో స్పష్టత ఉంటుంది. తెరవెనుక శబ్దాలను తొక్కిపెడుతుంది. కంట్రోలర్ ఇండికేటర్లలో బ్రైట్‌నెస్ అడ్జస్ట్‌మెంట్‌కు కూడా వీలుంటుంది. సరిగ్గా అదే ఫీచర్‌ని పవర్ ఇండికేటర్‌కు కూడా వస్తుంది. కన్సోల్‌పై రెండు వెర్టికల్ ఇండికేటర్స్ ఉంటాయి. ఇవి పీఎస్5 పరిస్థితిని తెలియజేస్తాయి. పార్టీస్, షేర్‌స్క్రీన్, ఎమోజీ రియాక్షన్లకు కూడా సరికొత్త ఫీచర్లు రాబోతున్నాయి. ఇప్పుడు వచ్చిన అప్డేట్ 15.1 ఎమోజీ సపోర్ట్, సిస్టమ్ సాఫ్ట్‌వేర్ పర్ఫార్మెన్స్ స్టెబిలిటీని సైతం తీసుకొచ్చింది.

ఎంజేపీఏపీబీసీఆర్‌జేసీ సెట్ నోటిఫికేషన్

విజయవాడలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్ఈఐఎస్)- బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 18 ఇంగ్లీష్ మీడియం కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. బాలురకు, బాలికలకు విడివిడిగా కాలేజీలు ఉన్నాయి. మొత్తం 2600 సీట్లు ఉండగా వీటిలో 1300 సీట్లను బాలికలకు ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులకు ఐఐటీ జేఈఈ/నీట్ పరీక్షలకు సంబంధించి కోచింగ్ సౌకర్యం కల్పిస్తారు. 75 శాతం సీట్లను బీసీ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారికి కేటాయించారు. మిగిలిన 25 శాతం సీట్లను సాంఘిక సంక్షేమ/గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివినవారికి, సంబంధిత హాస్టళ్లలో ఉన్నవారికి, జడ్పీ స్కూళ్లు/ప్రైవేట్ పాఠశాలల్లో చదివినవారికి నిర్దేశించారు.



బాలుర కళాశాలలు-సీట్లు: సింహాచలం(విశాఖపట్నం), మోపిదేవి(కృష్ణా), నిజాంపట్నం(గుంటూరు), కోట(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. కోట(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. సోడమ్ (చిత్తూరు), బేతంచర్ల (కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

బాలికల కళాశాలలు-సీట్లు: నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), నందలూరు(వైఎస్సార్ కడప), అరెకల్(కర్నూలు), నెరవాడ(కర్నూలు), గుడిబండ (అనంతపురం), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), అరెకల్(కర్నూలు), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. ఆముదాలవలస(శ్రీకాకుళం), డోన్(కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్/బయాలజీ నుంచి 50, ఫిజికల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 30, సోషల్ స్టడీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పా యింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పెన్సిల్ ఉపయోగించకూడదు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ఐఐటీ/నీట్ కోచింగ్ సెంటర్లు
- **బాలురకు:** సింహాచలం కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; దొరవారి సత్రంలో ఐఐటీ 60 సీట్లు ఉన్నాయి.
- **బాలికలకు:** నెల్లిమర్ల కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; నందలూరు సెంటర్‌లో ఐఐటీ 60 సీట్లు; టేకులోడు సెంటర్‌లో నీట్ 40 సీట్లు; తానాం సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లోపు ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 12
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 16న
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 26
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 29
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 20
- **తరగతులు ప్రారంభం:** జూలై మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** acad.uohyd.ac.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం- ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 164 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశ పరీక్ష అయిదోతరగతి స్థాయిలో ఉంటుంది. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్ష రాయవచ్చు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ విద్యార్థులకు 35 మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలి. ఈ స్కూళ్లలో బోధన ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు.
అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగు, అయిదు తరగతులు చదివి ఉండాలి. జనరల్, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.150; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.75
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21
- **విద్యార్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 27
- **ఎంపికైన విద్యార్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 29
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్:** ఏప్రిల్ 30
- **తరగతులు ప్రారంభం:** జూన్ 12 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

లక్ష్మీపత్ యూనివర్సిటీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు

జైపూర్‌లోని జేకే లక్ష్మీపత్ యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్-బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి రెండో రౌండ్ దరఖాస్తులు కోరుతోంది. డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్)
- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, ఇంటర్ డిసిప్లినరీ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎం డిజైన్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి ఏడాది పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జేకే డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్
- ఇందులో లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, విజువల్ సెన్సిబిలిటీస్ అంశాలనుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి పోర్ట్ ఫోలియో రౌండ్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. సంస్థ నిర్ణయం మేరకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 4
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అనంతపురం
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 8
- **పోర్ట్‌ఫోలియో రౌండ్:** ఏప్రిల్ 15
- **అభ్యర్థుల సెలెక్షన్స్:** ఏప్రిల్ 17
- **రిజిస్ట్రేషన్స్:** జూలై 8
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.jklu.edu.in/

ఆతిథ్యమే కెరీర్
(బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్)



ఆసక్తి ఉంటే తీసుకోదగ్గ కెరీర్ ఆప్షన్స్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ ఒకటి. అందుకు పునాదిగా అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో మన దేశంలో అందిస్తున్న కోర్సు బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్). ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకున్నా ఈ కోర్సు చేసేందుకు అర్హులే. దీనిని అందిస్తున్న పలు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్. అందుకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.....

హోటల్ మేనేజ్‌మెంట్ చాలాకాలంగా ఉత్తరాది వారి ఎంచుకునే కోర్సుగానే ఉంది. దాదాపుగా దశాబ్ద కాలం నుంచి దక్షిణాదికీ విస్తరిస్తోంది. ఆరంభంలో ఇది రిసెప్షన్ అండ్ బుక్ కీపింగ్ మాత్రమే. వసతి, తిండి, రూమ్ వ్యవహారాలు మాత్రమే చదువులో భాగం. తరవాతి రోజుల్లో పలు విభాగాల అధ్యయనం అవసరమైంది. అందుకు అనుగుణంగానే కోర్సును కూడా ఉన్నతీకరించారు. అందరికీ పరిచయం ఉన్న వ్యవహారం వంట. దీన్నే ఫుడ్ ప్రొడక్షన్‌గా అందిస్తున్నారు. రెండోది ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్. హోటల్‌లోని రూమ్స్ మొదలుకుని వాటి నిర్వహణ వంటివన్నీ ఇందులోకి వస్తాయి. కస్టమర్ రిలేషన్స్ ప్రధాన అంశం. అలాగే సేల్స్ అండ్ మార్కెటింగ్ కూడా స్టడీ అంశమే. నగరంలో జరగబోయే వివిధ సదస్సులు, సమావేశాలు అలాగే వాటికి రాబోయే అతిథులు, వారిలో రకాలు, వారి అవసరాలు, కావాల్సిన రూమ్‌లు తదితరాలను ఇందులో అధ్యయనం చేస్తారు. ఒక రకంగా ఇది బిజినెస్‌ను పెంచుకునే వ్యవహారం. అప్పుడే హోటల్‌కు వచ్చిన అతిథులను ఆహ్వానించడంతో మొదలుపెట్టి, వారికి రూమ్ చూపించే వరకు ఉండేవన్నీ లాబీ మేనేజ్‌మెంట్‌లో భాగం. కస్టమర్ రిలేషన్స్ మేనేజ్‌మెంట్, బిల్లింగ్, అకౌంటింగ్ కూడా ఉంటాయి. ఇప్పటి హోటల్స్ లేదంటే ఆతిథ్య రంగానికి అవసరమైన విధంగా మూడేళ్ల కోర్సులో టీచింగ్, ప్రాక్టికల్స్ ఉంటాయి. కోర్సు అనంతరం విద్యార్థులు తమకు నచ్చిన ఫీల్డ్‌ను ఎంచుకుంటారు.

ఎవర్ డిమాండ్

ఫైన్ హోటల్స్ పెరుగుతున్న నేపథ్యంలో ఎప్పుడూ లక్షకు మించి సిబ్బందికి డిమాండ్ ఉంటుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. మన దేశంలోని వివిధ ప్రసిద్ధ హోటళ్లనే తీసుకుంటే, మూడు లక్షల మందికి మించి పని చేస్తున్నారు. ఏటా వారిలో పది శాతం మందికి ప్రమోషన్ సహా ఏదో రకమైన ఎదుగుదల అదే హోటళ్లలో ఉంటుంది. కనీసం తొంభై వేల మంది ఇతర అవకాశాల కారణంగా ఉద్యోగాలు వదిలిపెట్టి వెళుతున్నారు. ఎక్కువ మంది ఐటి రంగంలోకి వెళుతుంటారు. హోటళ్లకు వచ్చే పెద్ద కస్టమర్లు అక్కడి వారి సేవలను గుర్తించి తీసుకెళుతుంటారు.

ఆరంభంలోనే పారిపోతుంటారు...!

ఈ కోర్సులో చేరిన విద్యార్థుల్లో కొంత మంది మొదటి ఏడాది పూర్తయ్యేసరికి తమవల్ల కాదని పారిపోతుంటారు. ముఖ్యంగా నలుగురితో కలవలేని వ్యక్తులు హోటల్ రంగంలో ఇమడలేరు. శాఖాహారులకు ఫ్రంట్ ఆఫీస్ ఓకే కానీ కిచెన్‌లో మాంసాహార వంటకాలు మాత్రం కష్టమే.

ఎంజాయ్ చేయగలగాలి

అందరూ సెలవు తీసుకుని ఎంజాయ్ చేస్తున్నప్పుడు వీరు పనిచేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న, జనవరి 1న, పర్వదినాల్లో అందరూ కుటుంబంతో గడుపుతుంటారు. వీరు మాత్రం హోటల్ సందర్శకుల సేవల్లో మునిగి తేలాల్సి ఉంటుంది. ఆ రోజు వీరికి చాలా బిజీ. కస్టమర్లతో, టూరిస్టుల ఆనందంలోనూ పాలుపంచుకోవడంలోనే సంతృప్తి చెందాలి. చేస్తున్న వృత్తిలోనే ఎంజాయ్ చేయాలి. ఎంత లేదనుకున్నా కాలేజీలో నేర్పేది ఇరవై శాతమే. ఆ ట్రైనింగ్‌తో ఈ రంగంలో ట్రైనీగా మంచి సంస్థలో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఆ తరవాత ఎదుగుదల సంబంధిత వ్యక్తిని బట్టి ఉంటుంది. ఇతర రంగాలతో పోలిస్తే హోటల్ అండ్ హాస్పిటాలిటీ రంగంలో ఎదుగుదల ఎక్కువ.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ముందు చెప్పుకొన్నవి కోర్సు పరిభాషలో చెప్పాలంటే ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

అడ్మిషన్ నోటిఫికేషన్

సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో
- తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో **60**
- హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో **285**
- స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎం-డా.వైఎస్సార్ ఎన్ఐటీహెచ్ఎంలో **120**
- శ్రీశక్తి ఐహెచ్ఎం(ప్రైవేట్ కళాశాల)లో **120**
- మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో **60**

ఎంట్రెన్స్ టెస్ట్

న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్	30
జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్	30
ఇంగ్లీష్ లాంగ్వేజ్	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి	50
మొత్తం	**200**

ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/



ఎవరు రాజు?

ఒక అడవిలో సింహం ఉండేది. తనే రాజుగా ప్రకటించుకుంది. ప్రతి రోజూ తన దగ్గరకే జింకలు, తోడేళ్లు, పందులు.. ఇలా రోజూ ఒకటి ఆహారంకోసం రావాలని ఆజ్ఞాపించింది. దీంతో జంతువులన్నీ నిరసించాయి. అయినా రాజుగారు ఆజ్ఞ కాబట్టి తప్పలేదు. కుందేలు లాంటి జంతువులు వెళ్లినపుడు సింహం కోప్పడేది. అడవిలోకి వేటకు వెళ్లి జంతువులను భయభ్రాంతులకు గురిచేసేది. దీంతో సింహంతో ఏదోటి మాట్లాడాలని అనుకున్నాయి జంతువులు.


ఆ రోజే ఆ అడవిలోకి మదపుటేనుగు వచ్చింది. ఈ అడవికి నేనే రాజును అన్నది. మిగతా జంతువులన్నీ ఆశ్చర్యపోయాయి. అసలే సింహం బాధకు చస్తోంటే.. ఇదో తలనొప్పి అనుకున్నాయి. విషయం ఏనుగుకు



నక్క చెప్పింది. 'అయినా ఈ అడవిలో ఆ సింహాన్ని కొట్టే పరాక్రమం ఎవరికి ఉంది. ఊరికే పొడవు, ఎత్తు, బలం ఉంటే ఏం లాభం? బుర్ర ఉండొద్దా' అని ఉడికించింది ఏనుగును. దీంతో ఏనుగు ఇలా అంది.. 'ఈ అడవికి నేనే రాజును. ఎవరు వస్తారో చూస్తా' అన్నది. దీంతో జంతువులన్నీ ఏకమయ్యాయి. సింహం దగ్గరకు వెళ్లాయి. నేనే రాజు అంటూ రెండు ప్రగల్భాలు పలికాయి.

ఈ గొడవ కాస్త సద్దుమనగలేదు, దీంతో జంతువలకు ఇబ్బంది కలిగింది. నేనంటే నేను గొప్ప అనుకున్నాయి. ఇంతలో నక్క వచ్చి.. 'మీరు గొప్పవారు అని అనుకోవటం కాదు. అడవికి రాజు ఒకరే ఉండాలి' అన్నది. ఏనుగుతో 'నువ్వు జింకను పట్టుకుని రా' అన్నది. సింహంతో 'నువ్వు పెద్ద బండరాయిని తీసుకురా' అన్నది. అది కూడా సాయంత్రంలోపు చేయాలి అన్నది. రెండూ వేగంగా వెళ్లాయి. రెండూ వాటికి చెప్పిన పనులు చేయలేక వెనక్కి వచ్చాయి. నక్క వారితో ఇలా అన్నది.. 'మీరు ఎవరూ మీకు అప్పగించిన పనిని చేయలేకపోయారు. అంటే ఇద్దరూ కొట్లాడుకుని ఉపయోగం లేదు. జంతువులను సమానంగా చూడటం నేర్చుకోండి' అన్నది. ఆ తర్వాత ఏనుగు 'నేనే రాజు' అనలేదు. సింహం అలా రాజుగా ఉండిపోయింది.


శునకాలు ఎన్ని?



దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



డైలీ సుడోకు - 256

	2		7	3				
3	4	7			2		6	
								7
4		8		5		2	3	
	6	5		1		7		8
1								
	7		4			5	1	9
				9	3		7	

సుడోకు - 255 సమాధానం

1	8	4	3	6	7	9	5	2
7	5	6	1	9	2	3	8	4
2	3	9	5	4	8	7	6	1
5	9	3	2	1	4	6	7	8
4	6	7	8	5	9	1	2	3
8	2	1	6	7	3	5	4	9
9	7	2	4	3	6	8	1	5
6	1	8	9	2	5	4	3	7
3	4	5	7	8	1	2	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.